PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 152 | విజయవాడ, గురువారం 4 జనవరి 2024 | 8 + 8 పేజీలు | వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 4 January 2024 | Rs



పేసర్ల స్వర్గధామం

- సిరాజ్‌కు ఆరు
- దక్షిణాఫ్రికా 55ఆలౌట్, భారత్ 153ఆలౌట్

లోపలి పేజీలో..

రాజధానిపై విచారణ ఏప్రిల్‌కు వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతి కేసుల విచారణను అత్యున్నత న్యాయస్థానం ఏప్రిల్‌కు వాయిదా వేసింది. ఏప్రిల్‌లో సుదీర్ఘంగా వాదనలు విన్న తరువాతే నిర్ణయం తీసుకుంటామని సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పింది. అమరావతే రాజధాని అంటూ గతంలో ఎపి హైకోర్టు తీర్పు ఇవ్వగా.. ఆ తీర్పును ఎపి ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. బుధవారం ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. మూడు రాజధానుల చట్టాలను ఉపసంహరించుకున్నా.. హైకోర్టు తీర్పు ఇవ్వడం సమంజసం కాదని ఎపి ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదించారు. ఈ కేసులో ఇంకా లిఖితపూర్వక అఫిడవిట్లు దాఖలు చేయడం పూర్తి కాలేదని రైతుల తరపున న్యాయవాది దేవదత్ కామత్ వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న సుప్రీంకోర్టు.. నాలుగు వారాల్లోగా అఫిడవిట్లు, కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేసింది.



లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్

చంద్రబాబు హామీలు అమలు కాలేదు

- పవన్‌తో కలిసి కొత్త హామీలతో మళ్లీ ముందుకొస్తున్నారు
- పింఛన్ల పెంపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్
- రాష్ట్రంలో 66.34 లక్షల మందికి పింఛన్లు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

రాబోయే ఎన్నికల్లో మాయమాటలతో మభ్యపెట్టడానికి, తాయిలాలు ఇవ్వడానికి చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు ముందుకు వస్తారని, ఇటువంటి వాటికి మోసపోవద్దని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు కాలేదని విమర్శించారు. పేదలకు మూడు సెంట్ల స్థలం ఇస్తానని అమలు చేయలేదని అన్నారు. తాము ఇచ్చిన హామీలను నిలుపుకున్నామని తెలిపారు. వైఎస్ఆర్ పెన్షన్ పెంపు కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా ఆర్ఎంసి మైదానంలో బుధవారం జరిగిన బహిరంగ సభలో జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం తాను పెన్షన్ రూ.3 వేలకు పెంచానని, గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో 66.34 లక్షల మంది లబ్ధిదారులకు పింఛను ఇస్తున్నామని తెలిపారు. ఇందుకోసం నెలకు దాదాపు రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. వైసిపి అధికారంలోకి రాకముందు చంద్రబాబు పాలనలో ఎన్నికలకు రెండు నెలల ముందు వరకూ పింఛను రూ.1,000 మాత్రమే ఇచ్చారన్నారు. ఆ తర్వాత రూ.2 వేలు చేశారని వివరించారు. ఎన్నికలు రాకపోతే అది కూడా పెంచేవారు కాదన్నారు. గత ఐదేళ్ల చంద్రబాబు పాలనలో ఒక్కొక్కరికీ పింఛను రూ.58 వేలు ఇస్తే, ఈ నాలుగున్నరేళ్ల పాలనలో తమ ప్రభుత్వం రూ.1.47 లక్షలు ఇచ్చిందని వివరించారు. వికలాంగులకు రూ.1.82 లక్షలు ఇచ్చామని తెలిపారు. గతానికి, ఇప్పటికి మధ్య తేడా గమనించాలని కోరారు. గతంలో పింఛను కావాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదని ఆరోపించారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు.

చంద్రబాబు, పవన్‌లపై విమర్శలు

ప్రశ్నించడం కోసమే పార్టీ పెట్టానని చంద్రబాబు దత్తపుత్రుడు చెప్తున్నాడని, అడ్డగోలుగా ప్రజలను చంద్రబాబు మోసగిస్తే ఎందుకు ప్రశ్నించలేదన్నారు. దీనిపై కేంద్రానికి మిగతా 2లో

అంగన్‌వాడీలపై కర్కశం

- పలు జిల్లాల్లో అరెస్టులు, ఉద్రిక్తత
- అక్కడికక్కడ అడ్డగింతలు
- నిర్బంధాన్ని అధిగమించి కలెక్టరేట్ల వద్ద అంగన్‌వాడీల బైఠాయింపు

ప్రజాశక్తి- యంత్రాంగం

అంగన్‌వాడీలపై పోలీసులు దాష్టీకం ప్రదర్శించారు. కలెక్టరేట్ల బైఠాయింపు కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి నిర్బంధాన్ని ప్రయోగించారు. పలు జిల్లాల్లో అరెస్టులకు పాల్పడ్డారు. బస్సుల్లో వెళ్తున్న అంగన్‌వాడీలను బలవంతంగా దించేశారు. ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. నిర్బంధాన్ని అధిగమించి కలెక్టరేట్ల వద్దకు చేరుకొని వేలాది మంది అంగన్‌వాడీలు బుధవారం బైఠాయించారు. నిర్బంధాలకు, బెదిరింపులకు భయపడేది లేదని, తమ న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. వారి నినాదాలతో కలెక్టరేట్లు హోరెత్తాయి.

విజయవాడలో వి.శ్రీనివాసరావు సహా పలువురు అరెస్టు

విజయవాడలో పోలీసులు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సహా పలువురిని అరెస్టు చేశారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని అన్ని మండలాల నుంచి విజయవాడ కలెక్టరేట్‌కు వస్తున్న అంగన్‌వాడీలపై పోలీసులు విరుకుపడి బీభత్సం సృష్టించారు. నాలుగు ప్రాంతాల్లో సుమారు వెయ్యి మందిని బలవంతంగా అరెస్టు చేసి ఎంజి రోడ్డులోని ఎఆర్ గ్రౌండ్స్, మాచవరం పోలీస్ స్టేషన్, హనుమాన్‌పేటలోని శ్రీరాజరాజేశ్వరి కళావేదిక కల్యాణ ప్రాంతాలకు తరలించారు. అరెస్టుల సందర్భంగా పోలీసులు కర్కశంగా వ్యవహరించడంతో ఎల్.రమాదేవి సహా పలువురు అంగన్‌వాడీలకు తీవ్ర గాయాలయ్యాయి. అంగన్‌వాడీలతో కలిసి ర్యాలీలో వస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావును బలవంతంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన చేతికి తీవ్ర గాయమైంది. అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మను అరెస్టు చేశారు. యూనియన్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.సుప్రజను వెంటపడి మరీ పట్టుకుని పోలీసులు గొంతు నొక్కేయడంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్వరాజ్యం మైదానం వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు నాయకులను పోలీసులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. ఆ తర్వాత వారందరినీ పోలీసులు విడుదల చేశారు. దీనికి ముందు వివిధ మిగతా 2లో



విశాఖ కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలను అరెస్టు చేస్తున్న పోలీసులు

రేపటి నుండి విజయవాడలో 24 గంటల రిలేదీక్షలు

ప్రజాశక్తి - అమరావతి

శుక్రవారం(ఐదవ తేది) నుండి విజయవాడలో 24 గంటల రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద బైఠాయింపు కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అంగన్‌వాడీలకు అభినందనలు తెలిపారు. గురువారం ఆందోళనలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. శుక్రవారం విజయవాడలో చేపట్టనున్న రిలే నిరాహార దీక్షలను యూనియన్ అఖిలభారత కార్యదర్శి ఎ.ఆర్ సింధు ప్రారంభిస్తారని తెలిపారు. శనివారం (ఆరవ తేది) అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద 24 గంటల రిలే నిరాహార దీక్షలు ప్రారంభించాలని, అదే సమయంలో ప్రస్తుతం ఎక్కడికక్కడ జరుగుతున్న ఆందోళనలను కొనసాగించాలని అంగన్‌వాడీలకు పిలుపునిచ్చారు.



సుబ్బరావమ్మ

పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టం చేస్తాం

- అధికారంలోకి రాగానే అధికారాలు, నిధులు
- టిడిపి అధినేత చంద్రబాబు


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని తాము అధికారంలోకి రాగానే సర్పంచులకు అధికారాలు, నిధులు ఇచ్చి పటిష్టం చేస్తామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళగిరిలోని సికె కన్వెన్షన్‌లో 'పంచాయతీలతోనే ప్రగతి' అనే అంశంపై బుధవారం వర్క్‌షాపు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన చంద్రబాబునాయుడు మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల వేతనాలు కూడా పెంచుతామని హామి ఇచ్చారు.

పంచాయతీలకు విధులు, నిధులు, గౌరవం కోసం సర్పంచులు పోరాడుతున్నారని, గతంలో వీటిని టిడిపి ప్రభుత్వమే ఇచ్చిందని, తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత తామే ఇస్తామన్నారు. వైసిపి పాలనలో సర్పంచులకు జరిగిన అన్యాయాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని చెప్పారు. నరేగా నిధులు పంచాయితీ మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సోషల్ ఆడిట్ సర్పంచులకు ఇస్తామన్నారు. జలజీవన్ కింద ఇంటింటికీ కుళాయికి కేంద్రం నిధులు ఇచ్చిందని, వీటిని ముఖ్యమంత్రి ఖర్చు చేయలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఖర్చు చేస్తామన్నారు. కేంద్రప్రభుత్వం పంచాయితీలకు కేటాయించిన నిధులను పూర్తిగా ఖర్చుచేస్తామన్నారు. రాష్ట్రబడ్జెట్‌లో పంచాయితీ రాజ్‌కు 5శాతం కేటాయిస్తామని, దీనిని ఐదేళ్లల్లో 10శాతానికి పెంచుతామని వెల్లడించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు మాట్లాడుతూ స్థానిక సంస్థలకు కేంద్రప్రభుత్వం ఇచ్చిన రూ1400కోట్లు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి దోచుకున్నారని విమర్శించారు. చంద్రబాబునాయుడు పాలనలో స్థానికసంస్థలకు స్వర్ణయుగమని అన్నారు. నాడు సర్పంచ్‌లుగా వున్నవాళ్లంతా మంచి పనులు చేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని తెలిపారు.



మంగళగిరిలోని సికె కన్వెన్షన్‌లో జరిగిన సర్పంచుల సదస్సులో వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న చంద్రబాబు



అదానీ కేసు సిట్‌కు బదిలీ చేయలేం

- సెబీ దర్యాప్తులో జోక్యం చేసుకోలేం
- సుప్రీం కోర్టు తీర్పు

సుప్రీం తీర్పు నిరాశపరిచింది

- సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో

లోపలి పేజీలో..

జైళ్లలో కుల వివక్ష

- కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు

భూ హక్కుల చట్టం అమలులోకి రాలేదు

- హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని అమల్లోకి రాలేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు చెప్పింది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, ఆస్తి వివాదాలకు సంబంధించి దాఖలయ్యే దావాలను తిరస్కరించరాదని సివిల్ కోర్టులను ఆదేశించింది.కక్షిదారులు దాఖలు చేసే దావాలను విచారణ చేపట్టాల్సిందేనని కూడా తేల్చి చెప్పింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు లతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 7కి వాయిదా వేసింది. ఈలోగా ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శిలు కౌంటర్లు దాఖలు చేయాలంది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని సవాల్ చేస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ), రాష్ట్ర బార్ కౌన్సిల్ తరపున కె.చిదంబరం, ముప్పాళ్ల సుబ్బారావు, జి.సుదర్శన్, కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం వేర్వేరుగా దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాలను బుధవారం హైకోర్టు విచారణ చేపట్టింది. పిల్స్ విచారణకు రాగానే, ప్రభుత్వ ప్లీడర్ కల్పించుకుని, భూయాజమాన్య హక్కు చట్టానికి సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం ఖరారు చేయలేదని చెప్పారు. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు గంటా రామారావు, ఎన్.సుబ్బారావు, న్యాయవాది యలమంజులు బాలాజీ వాదించారు. రాష్ట్ర సర్కార్ నూతనంగా తెచ్చిన భూ యజమాన్య హక్కుల చట్టం ప్రజల హక్కులను హరించేలా ఉందన్నారు. కొత్త చట్టం అమల్లోకి రావడంతో స్థిరాస్తి వివాదాలపై దాఖలయ్యే దావాలను సివిల్ కోర్టులు విచారణ చేపట్టడం లేదన్నారు. కొత్త చట్ట నిబంధనల ప్రకారం దావాల్లోని వివాదాలను సంబంధిత అధికారుల వద్ద తేల్చుకోవాలని సివిల్ కోర్టులు చెబుతున్నాయని అన్నారు. పిటిషనర్ల వాదనలను ఏజీ ఎస్ శ్రీరామ్ వ్యతిరేకించారు. భూ యాజమాన్య హక్కుల చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ఆయా ప్రాంతాల్లో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌కు నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు.నోటిఫికేషన్ జారీకి గడువు ఉందన్నారు, నిబంధనల రూపకల్పన కూడా కాలేదన్నారు.. టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి (టీఆర్‌వో), ల్యాండ్ టైటిలింగ్ అప్పిలెట్ అధికారులను (ఎల్‌టీఏవో) కూడా నియమించలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో సివిల్ కోర్టు దావాల్ని తిరస్కరించాల్సిన అవసరం కూడా లేదన్నారు. ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు విచారణను వచ్చే నెల 7కి వాయిదా వేసింది. అప్పటి వరకు తామిచ్చిన ఉత్తర్వులు అమల్లో ఉంటాయని, సివిల్ కోర్టులు దావాలను చట్ట ప్రకారం విచారణ చేయాల్సిందేనని తేల్చి చెప్పింది.

సిఎం జగన్‌తో షర్మిల భేటీ

- కుమారుడి పెళ్లికి రావాలని ఆహ్వానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఆయన సోదరి వైఎస్ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిల భేటీ అయ్యారు. తన కుమారుడు రాజారెడ్డి నిశ్చితార్థం, పెళ్లికి ఆహ్వానించేందుకు వైఎస్ షర్మిల తన భర్త అనిల్‌కుమార్, కుమారుడితో కలిసి బుధవారం సాయంత్రం తాడేపల్లికి చేరుకున్నారు. అంతకముందు ఇడుపులపాయ నుండి గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న షర్మిల కుటుంబానికి ఇటీవల వైసిపికి రాజీనామా చేసిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, పలువురు కాంగ్రెస్ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. సిఎం జగన్‌తో విభేదించి తెలంగాణలో సొంత పార్టీ పెట్టుకున్న షర్మిల.. తెలంగాణ ఎన్నికలకు ముందు అభ్యర్థులను పోటీకి పెట్టకుండా భేషరుతుగా కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఆమె వైఎస్ఆర్‌టిపిని కాంగ్రెస్‌లో విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశిస్తారని, ఎఐసిసి జాతీయ ప్రధాన కార్యదర్శి లేదా పిసిసి అధ్యక్ష పదవిని చేపట్టబోతున్నట్లు రాజకీయంగా చర్చ నడుస్తోంది. రాష్ట్రంలో వైసిపి 2024 ఎన్నికలకు 82 మంది సిట్టింగులను మారుస్తున్నట్లు వస్తున్న వార్తలతో వైసిపి టికెట్ దక్కని దాదాపు 40 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నుంచి పోటీ చేయనున్నట్లు సమాచారం. సిట్టింగ్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తరపున పోటీ చేస్తే రాజకీయంగా వైసిపికి తీవ్రంగా నష్టం జరుగుతుందని ఆ పార్టీలో ఆందోళన నెలకొంది. షర్మిల గురువారం ఢిల్లీలో కాంగ్రెస్‌లో చేరేందుకు ముందురోజు అన్నను కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేసేందుకు తాడేపల్లికి రావడం చర్చనీయాంశమైంది. 2021 తర్వాత మొదటిసారి అన్నను కలిశారు.

30 నిమిషాలపాటు భేటీ

సిఎం జగన్ నివాసానికి వెళ్లిన వైఎస్ షర్మిల దంపతులు అన్నావదినలతో దాదాపు అరగంటపాటు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ భారతికి, సిఎం జగన్‌కు స్వయంగా ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అరగంట మిగతా 7లో



జగన్,షర్మిలా (ఫైల్ ఫొటో)

ఇరాన్‌లో జంట పేలుళ్లు !

వంద మందికిపైగా మృతి, • 141 మందికి గాయాలు

టెహరాన్ : ఇరాన్ సైనిక ఉన్నతాధికారి సంస్మరణ కార్యక్రమంలో సంభవించిన జంట పేలుళ్లలో వంద మందికిపైగా మరణించారు. మరో 141మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు. ఇరాన్ ఆర్మీ జనరల్ ఖాసిం సోలెమని వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి సమీపంలో బుధవారం జరిగిన సంస్మరణ కార్యక్రమంలో పెద్ద పేలుడు సంభవించింది. ఆ తరువాత కొద్ది నిముషాల వ్యవధిలోనే రెండో పేలుడు చోటుచేసుకుంది. పేలుళ్ళకు కారకులెవరనేది వెంటనే తెలియరాలేదు. పేలుళ్ళతో ఆ ప్రాంతంలో తొక్కిసలాట జరగడంతో అనేకమంది గాయపడ్డారని ఇరాన్ ప్రభుత్వ టివి తెలిపింది. సైనిక ఉన్నతాధికారి సోలెమని నాలుగవ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వేలాదిమంది అభిమానులు పాల్గొన్నట్లు టివి విజువల్స్‌బట్టి తెలుస్తోంది. సౌత్ సెంట్రల్ నగరమైన కెర్మన్‌లో 15నిముషాల వ్యవధిలో ఈ పేలుళ్లు సంభవించాయి.

2020 జనవరి 3న బాగ్దాద్ విమానాశ్రయానికి వెలుపల అమెరికా జరిపిన డ్రోన్ దాడిలో ఖాసిం సోలెమని చనిపోయిన సంగతి తెలిసిందే.. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ విదేశీ కార్యకలాపాల విభాగమైన ఖుద్స్ ఫోర్స్‌కు ఆయన నాయకత్వం వహించారు. ఆయన హత్య నేపథ్యంలో ఇరాన్, అమెరికా మధ్య ప్రత్యక్ష సైనిక ఘర్షణ మరింత విస్తరించే ప్రమాదముందని పరిశీలకులు పేర్కొంటున్నారు.



ఉగ్రదాడిలో ధ్వంసమైన వాహనాలు



మెగా డిఎస్‌సి విడుదల చేయాలి

- మంత్రి బొత్స క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన డివైఎఫ్ఐ
- అరెస్టు చేసిన పోలీసులు

లోపలి పేజీలో..

వేతనాల్లో కోతలను నిరసిస్తూ బ్రిటన్‌వ్యాప్తంగా జూనియర్ డాక్టర్ల 144 గంటల సమ్మె

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన పలువురు వైసిపి, కాంగ్రెస్ నాయకులు జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరిలో కాంగ్రెస్ పార్టీ నగర మాజీ అధ్యక్షులు బాడిత శంకర్, మాజీ కార్పొరేటర్లు సిహెచ్ భగవాన్, ఎస్ ప్రసాద్, అవనిగడ్డకు చెందిన వైసిపి నాయకులు ఎంవికె రామాంజనేయులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. 2024లో మార్పును తీసుకురాబోతున్నామని, ప్రభుత్వంలో బలమైన భాగస్వామ్యం తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

చంద్రబాబు రాజకీయ వ్యాపారి

- మంత్రి మేరుగ ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జీవితమంతా పక్తు వ్యాపారిలా రాజకీయాలు చేస్తారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ 175కు 175 స్థానాలను గెలిచే లక్ష్యంతో అసెంబ్లీలకు అభ్యర్థులను మారుస్తుంటే చంద్రబాబుకు వచ్చిన సమస్య ఏమిటని ప్రశ్నించారు. చంద్రబాబులా డబ్బున్న వారికి అసెంబ్లీ, పార్లమెంటు, రాజ్యసభ సీట్లను ఇవ్వలేదన్నారు. చంద్రబాబు కోసం బిజెపి తరపున బ్రాంచ్ ఆఫీస్‌ను పురందేశ్వరి రాష్ట్రంలో నడుపుతున్నారని విమర్శించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- బిజెపి డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వాస్తవ ఆర్థిక పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని బిజెపి రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక సమావేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమావేశం పలు తీర్మానాలు చేసింది. ఇందులో ప్రధానంగా ఆర్థిక బీభత్సం, మౌలిక సదుపాయాల కల్పనలో అథమం, పంచాయతీ హక్కుల హననం, ఎస్‌సి, ఎస్‌టి, బిసి సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లింపు, రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాకపోవడం, యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడం, రాజధాని అమరావతిని వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, అస్మదీయుల కోసం భూ దోపిడీ, కరువు, రైతుల ఆత్మహత్యలు వంటి అంశాలపై సమావేశం తీర్మానం చేసింది. తీర్మానాలను మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ ప్రతిపాదించగా, ఒబిసి మోర్చా జాతీయ కార్యదర్శి పార్థసారధి, మాజీ ఎంపి కొత్తపల్లి గీత బలపరిచారు. ఈ సమావేశంలో జాతీయ కార్యదర్శి సత్యకుమార్, జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివ ప్రకాష్, జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు పాల్గొన్నారు.

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

- నరసరావుపేటలో టెంట్ ధ్వంసం
- రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిదవ రోజుకు చేరిన ఆందోళనలు



పల్నాడు జిల్లా నరసరావుపేటలో కార్మికుల టెంట్‌ను ధ్వంసం చేసిన దుండగులు



సత్యసాయి జిల్లా పెనుకొండలో సిఐటియు, మున్సిపల్ యూనియన్ నాయకులను అరెస్టును నిరసిస్తూ పోలీస్ వాహనం ముందు పడుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు ఆందోళనను ఉధృతం చేశారు. పలు జిల్లాల్లో అధికారులు పోటీ కార్మికులతో పనులు చేయించడాన్ని మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. దీంతో నరసరావుపేటలో సమ్మె టెంట్‌ను కొందరు దుండగులు తొలగించారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ర్యాలీలు నిర్వహించారు. అధికారుల బెదిరింపులకు భయపడమని, సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగుతుందని కార్మికులు తేల్చిచెప్పారు.

గుంటూరులో మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట పొర్లు దండాలు పెట్టి నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి జి.ఉషారాణి, ఇతర పార్టీలు, సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో సమ్మె శిబిరం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ప్రదర్శన చేసి ఆర్‌డిఒకు వినతిపత్రం ఇచ్చారు. కాగా సమ్మె శిబిరం టెంట్‌ను కొందరు దుండగులు ధ్వంసం చేశారు. దీనిపై కార్మికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఎమ్మెల్యే అనుచరుల పనేనని నాయకులు, కార్మికులు విమర్శించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. తెనాలి, నెల్లూరులో పోటీ కార్మికులతో పనులు చేయించడాన్ని మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు.

అనంతపురం కార్పొరేషన్‌లో పోటీ కార్మికుల ద్వారా చెత్త తరలింపుకు అధికారులు యత్నించగా కార్మికులు, సిఐటియు నాయకులు అడ్డుకొని నిరసన తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో మున్సిపల్ కార్యాలయంలోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా..అప్పటికే అక్కడ ఉన్న పోలీసులు కార్మికులను బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. కడపలో చెత్త వాహనాలను తరలించేందుకు అధికారులు ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. రాజంపేటలో పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. విశాఖ జివిఎంసి 7,8 వార్డులలో పోటీ కార్మికులతో అధికారులు పనులు చేయించడాన్ని మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన పలువురు కార్మికులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఎన్‌టిఆర్ స్టేడియం వద్ద మున్సిపల్ కార్మికులు సమ్మెను కొనసాగించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహం దగ్గర ధర్నా నిర్వహించారు. ఏలూరులోని పలుచోట్ల పోటీకార్మికులతో ట్రాక్టర్లను బయటకు తీయగా మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో పోలీసుల సహకారంతో పోటీ కార్మికులతో పనులు చేయించేందుకు తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ చేసిన ప్రయత్నాలను మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు.

కోనసీమ జిల్లా అమలాపురం, మండపేట, రామచంద్రపురం, అమలాపురం మున్సిపల్ కార్యాలయాల వద్ద, తూర్పుగోదావరిలో కొవ్వూరు, నిడదవోలు మున్సిపల్ కార్యాలయాల వద్ద, కాకినాడ జిల్లాల్లో పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాలను కొనసాగించారు. మండపేటలో పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలిపారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మానవహారం చేపట్టారు. నంద్యాల జిల్లా ఆత్మకూరులో ఉరితాళ్లతో నిరసన తెలిపారు. ఉమ్మడి చిత్తూరు, విజయనగరం జిల్లాల్లో నిరసనలు కొనసాగాయి.



రాజ్యాంగ హక్కులను కాపాడుకుందాం

- డిఎస్ఎంఎం జాతీయ నాయకులు వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సావిత్రిభాయి స్ఫూర్తితో రాజ్యాంగ హక్కులను, పోరాడి సాధించుకున్న రిజర్వేషన్లను కాపాడుకుందామని డిఎస్ఎంఎం జాతీయ నాయకులు వి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మనువాద మతోన్మాదుల పాలనలో రాజ్యాంగ హక్కులు కాలరాయబడుతున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తే రిజర్వేషన్లు లేకుండా చేస్తున్న తరుణంలో సావిత్రిభాయి పూలే స్ఫూర్తితో పోరాడి సాధించుకోవాలన్నారు. విజయవాడలోని పూలే అంబేద్కర్ భవనంలో బుధవారం సావిత్రిభాయి పూలే 193వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అధ్యక్షత వహించారు. సభలో విఎస్ఆర్ మాట్లాడుతూ.. సమాజం అభివృద్ధి అసమానతలతో కూడుకుని ఉందని, దేశ సంపద కార్పొరేట్లకు దోచిపెడుతూ ప్రజలపై భారాలు మోపారన్నారు. రాజ్యాంగ చట్టాలను మారుస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసి రిజర్వేషన్లు లేకుండా చేస్తున్నారన్నారు. కుల వ్యవస్థను పెంచుతూ దళిత గిరిజనులపై దుర్మార్గమైన కుల దురహంకార దాడులు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో దళిత గిరిజనులపై దారుణమైన కుల దురహంకార దాడులు చేస్తున్నారని తెలిపారు. దళిత, గిరిజన ప్రజా ప్రతినిధులకు న్యాయం జగరడం లేదన్నారు. అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. చదువుల వల్లనే సమాజాభివృద్ధి ఉంటుందని పూలే భార్య సావిత్రమ్మకు చదువు నేర్పించి మొదట ఉపాధ్యాయులుగా స్కూలును ప్రారంభించి మహిళలు, బాలికలకు విద్యనందించారన్నారు. ఆమె జయంతి రోజున బాలికా అక్షరాస్యతా దినోత్సవంగా జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి క్రాంతికుమార్, ఉపాధ్యక్షులు జి నటరాజ్, సభ్యులు చింతల శ్రీనివాస్, జి అరుణ, నగర నాయకులు రారాజు, ఆంటోని, లాల్‌ఖాన్, కోటేశ్వరరావు, దేవ సహాయం, రాఘవేంద్ర పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు వామపక్షాల ఖండన



విజయవాడ స్వరాజ్య మైదానం వద్ద అంగన్‌వాడీలకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న వి శ్రీనివాసరావును అరెస్ట్ చేసి ఈడ్చుకెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమస్యల పరిష్కారం కోసం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ వద్దకు శాంతియుతంగా వస్తున్న వందలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శులు వై సాంబశివరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఐఎంఎల్ నాయకులు జాస్తి కిషోర్‌బాబు, ఎంసిపిఐయు నాయకులు కాటం నాగభూషణం, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు ఎన్ మూర్తి, ఎస్‌యుసిఐసి నాయకులు బిఎస్ అమర్‌నాథ్, ఫార్వార్డ్‌బ్లాక్ నాయకులు పివి సుందరరామరాజు, ఆర్‌ఎస్‌పి నాయకులు జానకి రాములు బుధవారం ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీల అరెస్టులపై నిరసన తెలపడానికి వెళ్లిన ట్రేడ్ యూనియన్, సిపిఎం నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండించారు. అరెస్టు చేసినవారిని వెంటనే విడుదల చేయాలని, వారితో చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టయినవారిలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, మంజులతోపాటు సుమారు 1000 మందిని వివిధ పోలీసు స్టేషన్లలో పెట్టారని తెలిపారు. 22 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. పైగా జనవరి 5వ తేదీలోగా విధుల్లో చేరకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మెల్యేల, మంత్రుల ఇళ్లకు వెళ్లి విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకపోవడంతో అంగన్‌వాడీలు ఆందోళన ఉధృతం చేస్తున్నారని, అందులో భాగంగా బుధవారం రాష్ట్రవ్యాపితంగా వేలాది మంది కలెక్టరేట్ల వద్ద బైఠాయించారని వివరించారు. న్యాయమైన కోర్కెలు, సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధానికి దిగడం వల్ల వచ్చే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఒంటెత్తు పోకడతో కేంద్రం బరితెగింపు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపై దేశమంతటా విమర్శలు వెల్లువెత్తుతున్నా ఒంటెద్దు పోకడ నిర్ణయాలతో ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్లకు కారు చౌకగా కట్టబెడతామని బరితెగింపు ప్రకటనలు చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు విమర్శించారు. పోరాట కమిటీ ఆధ్వర్యాన విశాఖపట్నం జిల్లా కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 1056వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎల్ఎంఎంఎం, ఎస్‌బిఎం విభాగ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ప్రజల ఆస్తులను కొద్ది మంది చేతుల్లో పెట్టి మెజారిటీ ప్రజానీకాన్ని ఆర్థిక బానిసత్వంలోకి నెట్టటమే కేంద్రం ఉద్దేశం అని విమర్శించారు. కేవలం రూ.4900 కోట్లతో స్థాపించిన విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇప్పటివరకు రూ.55 వేల కోట్లకు పైగా ట్యాక్స్‌లు, డివిడెంట్ రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించిందన్నారు. భూ, ప్రాణ త్యాగాలతో ఏర్పడ్డ ఈ స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తూ దేశంలో ఉన్న నిరుద్యోగ యువతకు, నిర్వాసితులకు ఉపాధి అవకాశా లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.భాస్కర్, సీతారామరాజు, త్రినాధ్, జగ్గారావు, ఎ.రవి, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పోరుబాట

బకాయిల కోసం 12 గంటల నిరసన దీక్ష



రాజమహేంద్రవరం దీక్షా శిబిరంలో కెఎస్ఎస్.ప్రసాద్



నెల్లూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక సంబంధమైన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాలు పోరుబాట పట్టారు. యుటిఎఫ్ ఆధ్వర్యాన బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 12 గంటల నిరసన దీక్ష చేపట్టారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని, పిఆర్‌సి, డిఎ, పిఎఫ్ తదితర ఆర్థిక బకాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిరసన దీక్షను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభించి మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ఒకటో తేదీనే జీతాలు, మెరుగైన పిఆర్‌సి, సకాలంలో డిఎలు చెల్లిస్తామని ఇచ్చిన హామీలను జగన్‌మోహన్‌రెడ్డి తుంగలో తొక్కారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, అమలాపురం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వేతన జీవులంతా 'పోరాడుదాం ఆంధ్ర' అంటూ పోరుబాట పట్టారని తెలిపారు. రాజమహేంద్రవరంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 9, 10 తేదీల్లో విజయవాడలో 36 గంటల నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు. నెల్లూరులో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఆర్థిక బకాయిలు చెల్లించకుండా రాజకీయం చేస్తోందని, రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి రాజకీయంగానే గుణపాఠం చెప్పాలని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నాలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు పాల్గొన్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఐటిడిఎ కార్యాలయాల వద్ద ఉపాధ్యాయులు ధర్నాలు చేశారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పాల్గొని మద్దతు తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కెఎ ఉమమహేశ్వరరావు, ఎస్‌పి మనోహర్ కుమార్ పాల్గొని మాట్లాడారు. తిరుపతిలో దీక్షా శిబిరాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు ప్రారంభించారు. కాంగ్రెస్ కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మద్దతు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో ఉపాధ్యాయులు వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తిరుపతి, చిత్తూరుల్లో ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు చేశారు. బాపట్లలో వంటావార్పు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌టిఆర్, విజయనగరం, ఏలూరు, శ్రీసత్యసాయి, శ్రీకాకుళం, అన్నమయ్య, ప్రకాశం జిల్లాల్లో నిరసన దీక్ష చేపట్టారు.

అంగన్‌వాడీలపై కర్కశం

(మొదటి పేజీ తరువాయి)

పోలీసు స్టేషన్లలో ఉన్న వారిని సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.వెంకటేశ్వర్లు, రైతు సంఘం, సిఐటియు నాయకులు పరామర్శించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా బయలుదేరిన అంగన్‌వాడీలను రోప్‌లతో పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకొనే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు, పోలీసులకు మధ్య పలుమార్లు వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకుంది. పోలీసులను, రోప్‌లను నెట్టుకుంటూ అంగన్‌వాడీలు కలెక్టరేట్‌కు పరుగులు తీశారు. పోలీసులు కూడా వారితో పరుగులు తీసి జైలు రోడ్డు జంక్షన్ వద్ద అడ్డుకున్నారు. దీంతో, అంగన్‌వాడీలు అక్కడ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. పోలీసులను తప్పించుకొని కలెక్టర్‌కు చేరుకున్న అంగన్‌వాడీలను అక్కడా పోలీసులు అరెస్టు చేశారు. విశాఖలో మొత్తం వెయ్యి మందిని అరెస్టు చేసి ఆ తర్వాత విడిచిపెట్టారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పలువురు అంగన్‌వాడీలను, సిఐటియు నాయకులను బలవంతంగా ఈడ్చుకుంటూ తీసుకెళ్లి అరెస్టు చేసి టూటౌన్ పోలీస్ స్టేషన్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో నిర్బంధించారు. గుంటూరులో అంగన్‌వాడీ యూనియన్ నాయకులను పలువురి పోలీసులు ఇళ్ల వద్ద అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అయినా, పోలీసుల ఆంక్షలను అధిగమించి వేలాది మంది అంగన్‌వాడీలు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. నరసరావుపేటలో కలెక్టరేట్ వద్ద రోడ్డుపై భోజనాలు చేశారు. కోలాటం ఆడారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, జిల్లా ఉపాధ్యక్షులు జి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద బైఠాయించిన అంగన్‌వాడీలకు నోటీసులు ఇవ్వడానికి సిడిపిఒ అక్కడకి వచ్చారు. దీంతో, ఆమెను అంగన్‌వాడీలు నిర్బంధించారు. తనకు ఎలాంటి సంబంధమూ లేదని బతిమలాడటంతో విడిచిపెట్టారు. పోలీసుల నిర్బంధాన్ని ఛేదించుకొని అంగన్‌వాడీలు బాపట్ల కలెక్టరేట్‌కు చేరుకొని బైఠాయించారు.

ప్రకాశం జిల్లా ఒంగోలులో పోలీసులకు, అంగన్‌వాడీలకు మధ్య తోపులాట చేసుకుంది. ఈ సందర్భంగా ఇద్దరు అంగన్‌వాడీలకు స్వల్ప గాయాలయ్యాయి. నెల్లూరులో పోలీసులకు, అంగన్‌వాడీలకు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదం చోటుచేసుకుంది. అంగన్‌వాడీల బైఠాయింపుతో అన్నమయ్య జిల్లా రాయచోట కలెక్టరేట్ హోరెత్తింది. వైఎస్ఆర్ జిల్లా కడప కలెక్టరేట్ వద్ద సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ పోరాటం ఆగదన్నారు. చిత్తూరు కలెక్టరేట్ ఎదుట వేలూరు-చిత్తూరు జాతీయ రహదారితోపాటు కలెక్టరేట్‌కు వెళ్లే రహదార్లపై పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి వచ్చిపోయే ఆటోలు, బస్సులు, ప్రయివేట్ వాహనాలను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ అని అనుమానం వచ్చిన వారినల్లా కిందకు దింపి వెనక్కు పంపేశారు. పోలీసుల నిర్బంధాలను దాటుకొని వేలాది మంది కలెక్టరేట్‌కు చేరుకొని కలెక్టరేట్ ప్రధాన ద్వారం ముందు బైఠాయించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నరసింహారావుతో సహా 50 మందిని పోలీసు అరెస్టు చేశారు. తిరుపతి కలెక్టరేట్ ఎదుట వేలాది మంది అంగన్‌వాడీలు కదంతొక్కారు. బారికేడ్లను తోసేసి కలెక్టరేట్ గేటు తెరుచుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకున్నారు. దీనికి ముందు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ కంటే రూ.వెయ్యి వేతనం ఎక్కువ ఇస్తామని చెప్పిన జగన్ నాలుగేళ్లు పూర్తయినా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. నంద్యాలలో కలెక్టరేట్ ఎదుట వేలాది మంది అంగన్‌వాడీలు బైఠాయించారు. పోలీసుల వలయాన్ని ఛేదించుకొని భారీగా శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. శ్రీకాకుళంలో అంగన్‌వాడీలు తమ వెంట తెచ్చుకున్న క్యారియర్లతో రోడ్డుపై బైఠాయించి అక్కడే భోజనం చేసి ఆందోళన కొనసాగించారు. అమలాపురంలో అంగన్‌వాడీల ఆందోళనలో పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర ఎవి.నాగేశ్వరరావు పాల్గొని మద్దతు తెలిపారు. కాకినాడలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి ప్రసంగించారు. ఏలూరులో 144 సెక్షన్ విధించినా భయపడకుండా అంగన్‌వాడీలు కలెక్టరేట్ వద్దకు చేరుకొని బైఠాయించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. అనకాపల్లిలో నెహ్రూ చౌక్ జంక్షన్లో అంగన్‌వాడీలు బైఠాయించి నిరసన తెలిపారు. అల్లూరి జిల్లా పాడేరులో కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు బైఠాయించారు. ఎటపాక, కూనవరం, విఆర్.పురం, చింతూరు నాలుగు మండలాల అంగన్‌వాడీలు చింతూరు ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.

మెగా డిఎస్‌సి విడుదల చేయాలి

- బొత్స కార్యాలయాన్ని ముట్టడించిన డివైఎఫ్ఐ
- అరెస్టు చేసిన పోలీసులు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెగా డిఎస్‌సి ప్రకటించాలని కోరుతూ ఉపాధ్యాయ నిరుద్యోగ అభ్యర్థులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. తక్షణమే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలంటూ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయాన్ని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయవాడలో ముట్టడించేందుకు బుధవారం వారు ప్రయత్నించారు. డివైఎఫ్ఐ నాయకులు, నిరుద్యోగులు ముందుగా బీసెంట్ రోడ్డుకు చేరుకుని అక్కడి నుంచి క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రదర్శనగా బయలుదేరారు. కార్యాలయం వద్దనున్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. వారి పట్ల దురుసుగా ప్రవర్తించడంతో అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. నిరుద్యోగులను, డివైఎఫ్ఐ నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి వ్యాన్‌లో పడేశారు. ముందుగా డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న ను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రమణ, శివ, నగేష్‌బాబు, కృష్ణ, నాగేశ్వరరావు, కిరణ్, హరీష్, ఆంజనేయరాజు, సంతోష్, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు. అరెస్టులు అనంతరం మరికొంత మంది నిరుద్యోగులు అక్కడికి చేరుకోగా, వారినీ అరెస్టు చేసి మాచవరం, మధురానగర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

25 వేల పోస్టులతో నోటిఫికేషన్ : రామన్న డిమాండ్

రాష్ట్ర ప్రభుత్వం 25 వేల టీచర్ పోస్టులతో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 40 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మెగా డిఎస్‌సి విడుదల చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి నాలుగేళ్లుగా ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. ఖాళీ పోస్టులపై మంత్రి బొత్స సత్యనారాయణ రోజుకో మాట మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక 117 జిఓ పేరుతో 2 వేల పాఠశాలలను మూసివేసిందని తెలిపారు. తెలుగు మీడియం రద్దు చేసి మరో 15 వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిందన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో 9 వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయ పోస్టుల నోటిఫికేషన్ కోసం 10 లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని అన్నారు. వెంటనే నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయాలని, లేదంటే ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటారని హెచ్చరించారు.

అరెస్టులను ఖండించిన సిపిఎం

డివైఎఫ్ఐ, ఉపాధ్యాయ నిరుద్యోగ అభ్యర్థుల అరెస్టును సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మంత్రి బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్లిన డివైఎఫ్ నాయకులు, అభ్యర్థులపై పోలీసులు దురుసుగా వ్యవహరించి అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెగా డిఎస్‌సి ప్రకటిస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను ఇప్పటికైనా వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గడిచిన ఐదేళ్లలో 5 లక్షల మంది నిరుద్యోగులు డిఎస్‌సి కోసం రూ.లక్షలు వెచ్చించి శిక్షణ తీసుకుని ఎదురు చూస్తున్నారని తెలిపారు. కానీ ఇప్పటికీ ప్రభుత్వం డిఎస్‌సి ప్రకటించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు సాగుతున్నాయని వివరించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులను అరెస్టులు చేయడం అక్రమం అని అన్నారు.

చంద్రబాబు హామీలు అమలు కాలేదు

(మొదటిపేజీ తరువాయి)

లేఖ కూడా రాయలేదని పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి విమర్శించారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి పేదలను ఆదుకుంటే, ఇళ్ల నిర్మాణాల్లో అవినీతి జరుగుతుందంటూ లేనిపోని ఆరోపణలు చేస్తూ ఆ దత్తపుత్రుడు నేడు కేంద్రానికి లేఖలు రాస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు అవినీతిలో దత్తపుత్రుడు కూడా భాగస్వామేనని, అందుకే ప్రశ్నించబోరని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అవినీతిని కేంద్ర దర్యాప్తు సంస్థలు నిర్ధారించారని, న్యాయస్థానం ఆయనను జైలుకు పంపిందన్నారు. జైల్లో ఉన్న చంద్రబాబును దత్తపుత్రుడు పరామర్శించారని ఎద్దేవా చేశారు. అవినీతికి తావులేకుండా పాలన చేస్తోన్న వైసిపి ప్రభుత్వంపై మాత్రం తప్పుడు విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో కుట్రలకు తెరతీస్తారని, కుటుంబాలను చీల్చి రాజకీయాలు చేస్తారని, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు వైఎస్ఆర్ పెన్షన్ కానుక మోడల్ చెక్కు అందించారు. కాకినాడలో ఏర్పాటు చేసిన ఆర్ఒబిని ప్రారంభించారు. రూ.94 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు.

యాత్రికుల రక్షణకు అధికారులతో సమావేశం

- టిటిడికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల నడక మార్గంలో యాత్రికుల రక్షణ చర్యలకు సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించాలని హైకోర్టు చెప్పింది. టిటిడి, అటవీశాఖ, వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా ఆఫీసర్లతో సమావేశం పెట్టాలంది. సిఫార్సుల అమలుకు చర్యలు తీసుకోవాలని టిటిడిని ఆదేశించింది. యాత్రికుల రక్షణ కోసం తీసుకునే దీర్ఘకాలిక చర్యలపై సమగ్ర వివరాలివ్వాలని ఆదేశించింది. విచారణను ఫిబ్రవరి 14కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది.

కోర్టు బిల్డింగ్స్ నిర్మాణాలపై నివేదిక ఇవ్వండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో కోర్టు భవన నిర్మాణాల పురోగతిని వివరిస్తూ నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు కోరింది. కోర్టు భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం తన వాటా కింద విడుదల చేయాల్సిన 60 శాతం నిధుల అంశంపై కూడా వివరాలివ్వాలని కోరింది. భవన నిర్మాణాల పురోగతిని పరిశీలించేందుకు థర్డ్ పార్టీ ఏజెన్సీ నియమించాలంది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గన్నవరంలో పలు కోర్టులకు అవసరమైన భవన నిర్మాణాలను చేపట్టడం లేదంటూ అదే ప్రాంతానికి చెందిన దేవిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి గతంలో పిల్ దాఖలు చేశారు. నిర్మాణాలు తుది దశకు చేరాయని, ఏప్రిల్ నాటికి పూర్తవుతాయని ప్రభుత్వం తరపున ఎజి శ్రీరామ్ చెప్పారు. 2017 నాటి పనులతో పోలిస్తే పనుల పురోగతి లేదని హైకోర్టు అభిప్రాయపడింది. కేంద్రం నుంచి 60 శాతం నిధుల విషయంపై కేంద్రంతో చర్చించేందుకు చీఫ్ సెక్రటరీ ఢిల్లీ కూడా వెళ్లారని ఎజి చెప్పారు. రాష్ట్ర వాటా విడుదల చేస్తేనే కేంద్ర వాటా వస్తుందని హైకోర్టు నిబంధనల్ని గుర్తు చేసింది. హైకోర్టు న్యాయవాది ఎస్ ప్రణతి వాదనలు వినిపిస్తూ.. నిర్మాణాల నాణ్యత పరిశీలనకు థర్డ్‌పార్టీ ఏజెన్సీని నియమించాలన్న ప్రతిపాదనను ఆమోదించింది. పిటిషనర్ న్యాయవాది ఎమ్మార్కే చక్రవర్తి వాదిస్తూ.. టాటా సంస్థ వాళ్లను థర్డ్‌పార్టీగా నియమించాలని కోరారు. విచారణను ఈ నెల 24కు హైకోర్టు వాయిదా వేసింది.



ధాన్యం దోపిడీ

- కొనుగోలు కేంద్రాల్లో రూ.10 కేజీల అదనం
- ప్రయివేటుగా విక్రయిస్తే రూ.200 నష్టం
- నిట్టనిలువునా మునిగిపోతున్న రైతన్న



గుర్ల మండలం పెదనాగళ్లవలసలో రైతుల కళ్లాల్లో ధాన్యం

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

- విజయనగరం జిల్లా గుర్ల మండలం పెదనాగళ్లవలసకు చెందిన పిసిని సత్యం ఒకటిన్నర ఎకరాల్లో వరి సాగు చేశారు. తిండికి ఉంచుకోగా మిగిలిన ధాన్యాన్ని విక్రయించేందుకు సిద్ధపడగా స్థానిక కొనుగోలు కేంద్రం నుంచి గోనె సంచులు ఇవ్వలేదు. సొంత సంచులు, వాహనంతో సమీపంలోని ఓ మిల్లుకు తీసుకెళ్లాలని కొనుగోలు కేంద్రంలోని సిబ్బంది ఉచిత సలహా ఇచ్చారు. దీంతో, ఆయన అనివార్యంగా స్థానిక దళారులకు క్వింటాలు రూ.1900 చొప్పున 20 క్వింటాళ్ల ధాన్యం విక్రయించారు. ప్రభుత్వం తీరు వల్ల దళారులు తక్కువ ధర చెల్లిస్తున్నారంటూ 'ప్రజాశక్తి' ఎదుట సత్యం వాపోయారు.
- పంతులుగారి పేరున ఉన్న భూములు వివాదంలో ఉండడంతో తమ ఊరిలో ఉన్న చాలా భూములు రికార్డుల్లోకి ఎక్కలేదని, దీంతో, ప్రభుత్వానికి విక్రయించుకునే అవకాశం లేక వ్యాపారులకే ఎంతోకొంతకు అమ్ముకోవాల్సి వస్తోందని అదే గ్రామానికి చెందిన బెవర రాంబాబు, సెట్టి సత్యం అనే రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రం సిబ్బంది సూచన మేరకు ధాన్యాన్ని మిల్లుకు తీసుకెళ్తే, అక్కడ క్వింటాలుకు ఆరు కేజీల చొప్పున అదనంగా తీసుకున్నారని పాలవలసకు చెందిన బూడి రామునాయుడు చెప్పాడు.
- తూకంలో మోసాన్ని భరించలేక పాలవలస పంచాయతీ నక్కపేటకు చెందిన ముద్దాడ పండోడు... పెనుమజ్జిపేట వ్యాపారికి క్వింటాలు రూ.1900 చొప్పున 50 క్వింటాళ్ల ధాన్యం తెగనమ్ముకున్నారు.

విజయనగరం జిల్లాలో దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఈ ఏడాది 'ఎ' గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2203, సాధారణ రకం రూ.2,183 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. జిల్లాలో 500 గ్రామ సచివాలయాలకు అనుసంధానంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు, అక్కడ సిబ్బంది, తూకం, తేమ శాతం కొలిచే సాధనాలు, గోనె సంచులు, జిపిఎస్ సిస్టం కలిగిన వాహనాలను అందుబాటులో ఉంచినట్టు అధికారులు చెప్తున్నారు. వాస్తవానికి ఆయా కేంద్రాల్లో సిబ్బంది తప్ప, సౌకర్యాలేవీ లేవు. అక్కడికి వెళ్లిన రైతులకు ఓ కాగితం ముక్క చేతిలోపెట్టి పలానా మిల్లుకు ధాన్యం తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. గోనె సంచులు, వాహన సదుపాయం అందుబాటులో లేక రైతులు రోజుల తరబడి ఎదురు చూస్తున్నారు. గోనె సంచులు కొనుగోలు చేసి, అద్దె ట్రాక్టరు లేదా నాటుబళ్లపై సంబంధిత మిల్లులకు తీసుకెళ్తే, అక్కడ అదనంగా 6 కేజీల నుంచి 10 కేజీల వరకు గుంజుతున్నారు. ఈ లెక్కన కిలో రూ.22 చొప్పున ప్రతి క్వింటాలుకు రూ.132 నుంచి రూ.220 వరకు రైతు నష్టపోతున్నాడు. గోనె సంచులు తిరిగి ఇవ్వడం లేదు. ప్రయివేటు వ్యాపారులు గ్రామాల్లో రంగ ప్రవేశం చేసి క్వింటాలుకు రూ.1900 నుంచి రూ.1950 ధర ఇస్తున్నారు. దీంతో, క్వింటాలుకు రూ.200 వరకు రైతులు నష్టపోతున్నారు. జిల్లాలోని రైసు మిల్లులు ప్రజాప్రతినిధులవి, రాజకీయ నాయకులవి కావడం, వ్యాపారులు కూడా వారి అనుయాయులు కావడంతో వీరితో అధికారులు కుమ్మక్కవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎవరికి అమ్మినా దోపిడీనే



ధాన్యం ప్రభుత్వానికి అమ్మినా, వ్యాపారులకు విక్రయించినా దోపిడీ తప్పడం లేదు. ఈ ఏడాది నేను నాలుగు ఎకరాల్లో వరి వేశాను. వ్యాపారులు క్వింటాలు రూ.1900కు అడుగుతున్నారని ప్రభుత్వానికే విక్రయించాను. స్థానికంగా తీసుకోకపోవడంతో వారు సూచించిన ప్రకారం కెఎస్ఆర్ పురంలోని రైసు మిల్లుకు తీసుకెళ్లాను. ప్రతి క్వింటాలుకు 10 కేజీల చొప్పున అదనంగా లాగేశారు. రైతు ఎలా బతుకుతాడు?

– సుంకరి నాగరాజు, లోగిశ గ్రామం, గజపతినగరం మండలం



విజయనగరంలో మరణించిన కోరాడ అప్పారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి

కార్యకర్తలకు అండగా ఉంటాం

- నారా భువనేశ్వరి
- బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-విజయనగరంకోట

కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటామని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. నిజం కావాలి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె విజయనగరం జిల్లాలో పర్యటించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో విజయనగరంలోని 23వ డివిజన్‌లో, తెర్లాం మండలం మోదుగవలస, పెరుమాళి గ్రామాల్లో మరణించిన ముగ్గురు కార్యకర్తల కుటుంబాలకు రూ.3 లక్షలు చొప్పున చెక్కులు అందజేశారు. ఆయా కుటుంబాలను ఆమె ఓదార్చారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీకి, చంద్రబాబుకు అండగా నిలిచిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టు విని ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను పరామర్శించేందుకు వస్తున్నానని, ఇక్కడ లభించిన ప్రజాదరణ చాలా సంతృప్తిని ఇచ్చిందని భువనేశ్వరి తెలిపారు. భువనేశ్వరికి విజయనగరం సమీపంలోని చెల్లూరు జంక్షన్, రామభద్రపురం మండలం బూసాయివలస వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్‌గజపతిరాజు, గుమ్మడి సంధ్యారాణి, మాజీ మంత్రులు సుజయ్‌కృష్ణ రంగారావు, కోండ్రు మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన, ఆదివాసీ హక్కుల పరిరక్షణే లక్ష్యం

- ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

గిరిజన, ఆదివాసీ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఎస్‌టి కమిషన్ పనిచేస్తోందని కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు అన్నారు. విజయవాడలోని ఎస్‌టి కమిషన్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్ హాలులో బుధవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో రాజ్యాంగ బద్ధంగా ఎస్‌టి కమిషన్ ఏర్పాటైందన్నారు. ఎస్‌టిల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. గ్రీవెన్స్ సెల్ ద్వారా 2022లో 2,751, 2023లో 2,712 ఫిర్యాదులు అందాయని తెలిపారు. వీటిలో 432 ఫిర్యాదులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, అవి కూడా సంబంధిత శాఖల్లో పరిష్కారానికి చివరి దశలో ఉన్నట్లు ఆయన తెలిపారు. విజయనగరం, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పర్యటించి గిరిజనులు, ఆదివాసీల సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యకలాపాలను సమీక్షించామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక యాప్ ద్వారా అర్జీలు స్వీకరించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. గిరిజనులకు వారి గ్రామంలోనే ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా మెరుగైన వైద్యం అందుతోందని ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సెక్రటరీ రామశేషు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రాజధానికి వ్యతిరేకిని కాదు

- షర్మిల వెంట నేనూ నడుస్తా : ఎమ్మెల్యే ఆర్కే

ప్రజాశక్తి – మంగళగిరి (గుంటూరు జిల్లా)

అమరావతి రాజధానికి తానేమి వ్యతిరేకిని కానని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. తాను కేవలం బలవంతపు భూసేకరణను మాత్రమే వ్యతిరేకించానని చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తన కార్యాలయంలో ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత తాను కూడా కాంగ్రెస్ పార్టీలోకి వెళతానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఎఐసిసి ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లుగా పత్రికలో చూశానని, షర్మిల వెంటే తానూ నడుస్తానని స్పష్టం చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో పోటీ చేయాలా? లేదా? అనేది కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని బట్టి ఉంటుందన్నారు.

వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు

- చేనేత, జౌళి ముఖ్య కార్యదర్శి సునీత

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

భారత ప్రభుత్వం చేపట్టిన వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ గుర్తింపులో రాష్ట్రం తన ప్రత్యేకతను చాటుకుందని పరిశ్రమలు, వాణిజ్యశాఖ (చేనేత, జౌళి) ముఖ్యకార్యదర్శి సునీత పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా పది జిల్లాలకు అవార్డులు రాగా, అందులో ఆరు మన రాష్ట్రం దక్కించుకుందన్నారు. కాకినాడ జమదాని చీరలు, అల్లూరి జిల్లా అరకు కాఫీకి బంగారు పతకాలు రాగా, పొందూరు (శ్రీకాకుళం) కాటన్, గద్వాల (కర్నూలు) చీరలకు కాంస్య పతకాలు లభించాయని ఆమె తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా 538 జిల్లాల నుంచి దరఖాస్తులు రాగా, వాటిలో 64 ఉత్పత్తులను షార్ట్ లిస్ట్ చేశారన్నారు. దేశంలోని అన్ని జిల్లాల సామాజిక, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రతి జిల్లా నుంచి ఒక ఉత్పత్తిని ఎంపిక చేసి, బ్రాండింగ్, విస్తృత ప్రచారం కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ అవార్డులను అందుకున్నారని సునీత తెలిపారు.

అప్పర్ సీలేరులో అంకెలగారడీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – అమరావతి

ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న అప్పర్ సీలేరు విద్యుత్ కేంద్రంలో అంకెల గారడీ చోటుచేసుకుంటోంది. అంచనా వ్యయాన్ని ఎప్పుడు పెంచుతారో... ఎప్పుడు తగ్గిస్తారో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా మరోసారి కొత్త అంచనాలను రూపొందించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ని సీలేరులో 150 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యంలో తొమ్మిది పంప్డ్ స్టోరేజి విద్యుత్ కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు 2019లోనే నిర్ణయించారు. తరువాత ఈ ప్రాజెక్టును రూ. 10,445 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించారు. మరో ఏడాది తరువాత 2021 అక్టోబర్‌లో దీనికి సూత్రప్రాయ అనుమతి కూడా లభించింది. 2022 డిసెంబర్‌లో ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా పూర్తి అనుమతులు జారీ చేసింది. అయితే ముందుగా అనుకున్న దానికంటే కొంత అంచనా వ్యయాన్ని తగ్గించి రూ.11,881 కోట్లకు మాత్రమే అనుమతినివ్వడం విశేషం. అదే నెలలో వాప్కోస్ నుంచి పూర్తిస్థాయి ప్రాజెక్టు రిపోర్ట్ కూడా అందింది.

అంచనా వ్యయంలో భారీగా మార్పులు

ఈ మొత్తాన్ని సమకూర్చుకునేందుకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.9,505 కోట్ల రుణానికి కసరత్తు ప్రారంభించారు.

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ ప్రాజెక్టును జ్యుడీషియల్ రివ్యూకి పంపించారు. అదే నెలలో ప్రాజెక్టుకి సంబంధించిన ఎస్టిమేటెడ్ కాంట్రాక్ట్ వేల్యూని రూ.7,860 కోట్లతో మరోసారి న్యాయ సమీక్షకు సమర్పించారు. ఈ సమయంలోనే ప్రాజెక్టుకు సంబంధించి రూ.11,154 కోట్లకు టిఇసి (టెక్నో ఎకనామిక్ కాన్కరెన్స్) రావడం విశేషం. ఆ తరువాత జూన్‌లో జరిగిన బోర్డు సమా వేశంలో ప్రాజెక్టు సైకిల్ ఎఫిషియన్సీ 68.6 శాతం గా అంచనా వేస్తూ ఒక్కసారిగా అంచనా విలువను జిఎస్‌టి కలపకుండా రూ. 6,717 కోట్లకు కుదించారు.

ఆర్ఇసి నుంచి 8,919 కోట్లు

ఇదే సమయంలో గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (ఆర్ఇసి) నుంచి రూ. 8,919 కోట్ల రుణం మంజూరు కావడం విశేషం. అలాగే గత అక్టోబర్‌లో పంప్ టర్బయిన్ వెయిటెడ్ సామర్థ్యాన్ని 91.4 శాతం నుంచి 90 శాతానికి మార్పు చేసేలా వాప్కోస్‌కు రాష్ట్ర అధికారులు సూచించారు. అలాగే డిసెంబర్ 11న బోర్డుకు కొత్త ప్రతిపాదనలు తయారుచేసి సమర్పించడం గమనార్హం. ఈ ప్రతిపాదనల్లోనే ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఏకంగా రూ.12,271 కోట్లకు పెంచి ప్రతిపాదించారు. దీనిపైనే మరోసారి ఎల్–1గా వచ్చిన మెఘా ఇంజనీరింగ్ సంస్థతో జరిగిన చర్చల్లో కేవలం సివిల్ పనులు, ఇ అండ్ ఎం పనులకురూ. 7,383.60 (జిఎస్‌టి లేకుండా) కోట్లకు టెండర్ ఖరారు చేయగా, మెఘా నుంచి 3.60 కోట్లు డిస్కౌంట్ వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. . ఈ మొత్తానికి అదనంగా సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ అనుమతులకు, , ఆ సంస్థకు చెల్లించాల్సిన ఇతర మొత్తం, 18 శాతం జిఎస్‌టి, ఐదేళ్ల కాలానికి సంబంధించి ఇన్‌స్టాలేషన్ ఛార్జీలు కలుపుకొని మొత్తం ప్రాజెక్టు విలువ 12,264 కోట్లుగా ఖరారు.

సరుకు రవాణాలో మూడవ స్థానం

- 137 మిలియన్ టన్నుల సామర్థ్యం... రూ.2,300 కోట్ల ఆదాయం
- అదానీ బెర్త్‌ని స్వాధీన పరచుకుని 2023లో రూ.70 కోట్ల వ్యాపారం
- వైజాగ్ పోర్టు ట్రస్ట్ ఛైర్మన్ ఎం.అంగముత్తు వెల్లడి

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశంలోని 12 మేజర్ పోర్టుల సరకు రవాణా వ్యాపారంలో విశాఖ పోర్టు మూడవ స్థానంలో నిలదొక్కుకుని పురోగతి సాధిస్తోందని వైజాగ్ పోర్టు ట్రస్ట్ అథారిటీ (విపిఎ) ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు వెల్లడించారు. 1933లో విశాఖ పోర్టు మూడు బెర్తులతో ఎడ్లబండ్లపై కార్గోని తీసుకొచ్చి ఏడాదికి 1.2 లక్షల టన్నుల సరకు రవాణా చేసే స్థాయి నుంచి 2024 నాటికి 31 బెర్తులతో 137 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ 90 ఏళ్లలో రూ.2,300 కోట్ల రెవెన్యూ తీసుకువచ్చే స్థాయికి అంచెలంచెలుగా ఎదిగిందని తెలిపారు. నగరంలోని పోర్టు హార్బర్ గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పోర్టు సాధించిన అభివృద్ధిని వివరించారు.

ప్రస్తుతం వైజాగ్ పోర్టు నుంచి రోడ్డు మార్గం ద్వారా 43 శాతం, రైల్వేల ద్వారా 26 శాతం, పైప్‌లైన్ ద్వారా 21శాతం, కన్వేయర్ల ద్వారా 10 శాతం సరకు రవాణా జరుగుతోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఐఎఫ్ఎక్స్–2 అనే నూతన కంటైనర్ లైనర్ సర్వీసు అందుబాటులోకి రానుందని తెలిపారు. చెన్నై–సింగపూర్ క్రూయిజ్ షిప్‌ను విశాఖ నగరం మీదుగా నడిపేందుకు లిట్టోరల్ క్రూయిజ్ లిమిటెడ్ సంస్థతో ఎంఒయు చేసుకున్నామని చెప్పారు. సుమారు రూ.1,200 కోట్ల పెట్టుబడితో భారత్, శ్రీలంక, మాల్దీవులకు క్రూయిజ్ సర్వీసులను నిర్వహించే ప్రణాళిక ఈ సంస్థకు ఉందన్నారు. పోర్టుల్లో చాలా బెర్తులు నిరుపయోగంగా, పాతవి ఉన్నందున వాటి అభివృద్ధికి పిపిపి విధానం తీసుకున్నామని చెప్పారు. డబ్ల్యుక్యు 7, 8 బెర్తుల యాంత్రీకరణ, డబ్ల్యుక్యు 6 కూడా యాంత్రీకరణ జరుగుతోందని వివరించారు. మరో ఇక్యు 6 బెర్తు పిపిపి విధానంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. 2030 నాటికి పిపిపి టర్మినల్స్ ద్వారానే మొత్తం సరకులో 75 శాతాన్ని నిర్వహించడానికి ప్రణాళికలు వేశామని, పూర్తిగా ల్యాండ్ లార్డ్ పోర్టుగా వైజాగ్ మారనుందని వివరించారు. గతేడాది అదాని బెర్త్‌ను స్వాధీనం చేసుకుని రూ.70 కోట్ల ఆదాయం ఆర్జించామని తెలిపారు. 2022–23 సంవత్సరంలో మెరైన్ ఉత్పత్తుల్లో 26.36 శాతం వాటాను కలిగి ఉందని రూ.16,877 కోట్ల విలువైన 2.64 లక్షల మిలియన్ టన్నుల మెరైన్ ఉత్పత్తులను ఎగుమతి చేశామని చెప్పారు. ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ పనులకు రూ.150 కోట్లతో పిఎంఎంఎస్‌వై కింద పనులు చేపట్టామన్నారు. పోర్టు నుంచి 16వ నెంబరు జాతీయ రహదారి వరకూ ఆటంకం లేని రవాణా కోసం రూ.501.65 కోట్లతో విశాఖ పోర్టు, ఎన్‌హెచ్ఎఐ సంయుక్తంగా కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకూ ప్రస్తుతం ఉన్న నాలుగు లైన్ల రోడ్డును 10 లైన్లకు పెంచే నిర్ణయం చేశామని, 24 నెలల్లో పూర్తవుతుందని తెలిపారు. రూ.15 కోట్లతో పోర్టుకు చెందిన 186 ఎకరాల్లో మొక్కల అభివృద్ధికి, సుందరీకరణకు పోర్టు నిధులు వెచ్చించిందన్నారు. ఈ సమావేశంలో పోర్టు సెక్రటరీ వేణుగోపాల్, ట్రాఫిక్ మేనేజర్ రత్నశేఖర్ పలువురు హెచ్ఒడిలు పాల్గొన్నారు.

విద్యాశాఖలో విలీనం చేయాలి

- రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎస్ఎ ఉద్యోగుల ఆందోళన



నెల్లూరులో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-యంత్రాంగం

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సర్వ శిక్షా అభియాన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె బుధవారం 15వ రోజుకు చేరింది. కలెక్టరేట్లు, ఆర్‌డిఒ కార్యాలయల వద్ద ధర్నాలు, ర్యాలీలు చేపట్టారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.పల్నాడు జిల్లా నరసరావుపేటలో సమ్మె శిబిరాన్ని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సందర్శించి మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అన్ని ప్రజా సంఘాల మద్దతు కూడగట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. గుంటూరులో ఆర్‌డిఒ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పుష్కరఘాట్ వద్ద ప్లకార్డులను ప్రదర్శిస్తూ జలదీక్ష చేశారు. కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ డిఇఒ కార్యాలయాల నిరసనలు తెలిపారు. విశాఖ జిల్లా భీమిలిలో ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనకాపల్లిలో కలెక్టర్‌కు, ఆర్‌డిఒకు వినతిపత్రాలు అందించారు. నర్సీపట్నంలో ఎన్‌టిఆర్ మినీ స్టేడియంలో సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు బిఎస్‌పి నాయకులు మద్దతు తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్ ఎదుట గడ్డి తింటూ నిరసన తెలిపారు. సరైన వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నామని, గడ్డి తిని బతకాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఎఒకు వినతిని అందజేశారు. శ్రీకాకుళంలోని జ్యోతిరావు పూలే పార్కు వద్ద మోకాళ్లపై నిల్చొని అర్ధనగ్న ప్రదర్శన చేపడుతూ నిరసన తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఎ ఉద్యోగులు ప్రధానికి పోస్టుకార్డులు పంపి నిరసన తెలిపారు. శ్రీ సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి, ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మెకు టిడిపి, యుటిఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. విజయనగరం, కర్నూలు, అన్నమయ్య, ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల్లో నిరవధిక సమ్మెను కొనసాగించారు.

హింసను ప్రేరిపిస్తున్న రాంగోపాల్ వర్మ చిత్రాలు

- సిఐడి విచారణకు హాజరైన శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాంగోపాల్ వర్మతో తనకు వ్యక్తిగత వైరం లేదని, ఆయన సినిమాల వల్ల హింసా ప్రవృత్తి, మహిళలపై అసభ్య భావజాలం పెంపొందిస్తున్నారనే కారణంగానే ఆయనపై ఈ వ్యాఖ్యలు చేశానని సిఐడి విచారణకు హాజరైన అమరావతి పరిరక్షణ సమితి నాయకులు కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ తలతెచ్చి ఇస్తే రూ.రెండు కోట్లు ఇస్తానని టివి చర్చలో ప్రకటించిన సందర్భంగా గుంటూరులోని ప్రాంతీయ సిఐడి కార్యాలయంలో విచారణకు శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు టిడిపి నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలపగా ఆయన తరుపున న్యాయవాది లక్ష్మి నారాయణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణను సిఐడి అధికారులు విచారణకు అనుమతించారు. న్యాయవాది సమక్షంలో విచారించాలని, విచారణ ప్రక్రియను వీడియో తీయాలని సాయికృష్ణ పట్టుబట్టారు. వ్యూహం సినిమాలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను కించపరచడాన్ని తట్టుకోలేక తాను ఈ విధంగా అనాల్సి వచ్చిందన్నారు.

విచారణ ఈ నెల ఎనిమిదికి వాయిదా వేశారు. అంతకు ముందు సిఐడి అధికారులు 30 ప్రశ్నలతో విచారించినట్లు సమాచారం.

చమురు ధరలను తగ్గించేది లేదు..!

- కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ వెల్లడి

న్యూఢిల్లీ : చమురు ధరలను తగ్గించే అవకాశాలు లేవని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురీ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ముందు చమురు ధరలను కేంద్రం తగ్గిస్తుందంటూ వస్తోన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఒకప్పటితో పోలిస్తే చమురు ధరలు గరిష్ఠాల నుంచి భారీగా తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఆ మేర వినియోగదారులకు ప్రయోజనాన్ని బదిలీ చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని రిపోర్టులు వచ్చాయి. లీటర్‌కు రూ.6 మేర తగ్గే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. కాగా.. అలాంటిదేమీ లేదంటూ మంత్రి హరదీప్ స్పష్టం చేశారు. చమురు ధరల తగ్గింపుపై జరుగుతున్న ప్రచారం అనేది పూర్తిగా ఊహాజనితమన్నారు. ధరల తగ్గింపుపై ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో ఎలాంటి చర్చలూ జరగలేదన్నారు. అంతర్జాతీయంగా చమురు ధరలు ఒడుదొడుకుల కారణంగా అటు అభివృద్ధి చెందిన, పొరుగు దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతం పెరిగాయని అన్నారు. భారత్‌లో మాత్రం ధరలు స్థిరంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు, ఎల్‌పిజి దిగుమతిదారుగా భారత్ ఉందన్నారు. ప్రపంచ మార్కెట్‌లో ఎప్పుడికప్పుడు చమురు ధరలు తీవ్రమైన ఒడుదొడుకులు ఎదుర్కొంటూ ఉంటాయని తెలిపారు. అలాంటి స్థితిలో ఏ ప్రభుత్వానికి అయినా చమురు ధరలు తగ్గించడం కష్టంతో కూడుకున్న వ్యవహారమన్నారు.

ఎస్‌బిఐ స్పాన్సర్‌గా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్

ముంబయి : సెకండరీ మార్కెట్‌లో ఎస్‌బిఎకు సదుపాయాన్ని కల్పించేందుకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ స్పాన్సర్, డెస్టినేషన్ బ్యాంక్‌గా వ్యవహరించనున్నట్లు ఆ విత్త సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. నగదు, ఈక్విటీ డెరివేటివ్స్ విభాగాలలో ఎన్ఎస్ఇ, బిఎస్ఇలకు ప్రముఖ క్లియరింగ్ మరియు సెటిల్‌మెంట్ బ్యాంక్‌గా ఉన్న తాము జనవరి 01 నుంచి ఇండియన్ స్టాక్ ఎక్స్ఛేంజీలలో సెకండరీ మార్కెట్లలో బ్లాక్ చేయబడిన మొత్తానికి మద్దతు ఇచ్చే ట్రేడింగ్‌కు స్పాన్సర్, డెస్టినేషన్ బ్యాంక్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపింది.

ఎఎస్‌టిసికి 100 టాటా విద్యుత్ బస్సులు

గౌవతి : అస్సాం స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎఎస్‌టిసి)కు 100 విద్యుత్ బస్సులను సరఫరా చేసినట్లు దేశంలోనే అతిపెద్ద వాణిజ్య వాహనాల తయారీదారు టాటా మోటార్స్ ప్రకటించింది. 9–మీటర్ల, ఎయిర్ కండిషన్డ్ టాటా అల్ట్రా ఇవి బస్సులు గౌవతి రోడ్లపై తిరుగనున్నాయని పేర్కొంది. ఈ జీరో ఎమిషన్ బస్సులను దేశీయంగా తయారు చేసినట్లు తెలిపింది. ఇప్పటి వరకు భారత్‌లో 1,500 పైగా ఇవి బస్సులను సరఫరా చేసినట్లు పేర్కొంది.

మార్కెట్లకు రెండో రోజూ నష్టాలు..

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాలు చవి చూశాయి. సూచీలు గరిష్ఠానికి చేరుకోగా మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపుతున్నారు. దీంతో బుధవారం సెషన్‌లోనూ బిఎస్ఇ సెన్సెక్స్ 536 పాయింట్ల పతనంతో 71,357కు తగ్గింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 148 పాయింట్ల నష్టంతో 21,517 వద్ద ముగిసింది. దాదాపు 1,917 షేర్లు రాణించగా.. 1,390 షేర్లు నష్టాలు చవి చూడగా.. మరో 79 స్టాక్స్ యథాతథంగా నమోదయ్యాయి.

హెచ్‌ఆర్‌హెచ్ నెక్స్ట్ సర్వీసెస్ లిస్టింగ్



హైదరాబాద్ : బిపిఒ సేవలందించే హెచ్ ఆర్‌హెచ్ నెక్స్ట్ సర్వీసెస్ బుధవారం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఇ) ఎస్ఎంఇ వేదికలో లిస్టింగ్ అయ్యింది. ఉదయం 13.86 శాతం ప్రీమియంతో రూ.41 వద్ద ప్రారంభమైంది. దీని ఇష్యూ ధర రూ.36గా ఉంది. డిసెంబర్ 27తో ఆ సంస్థ ఐపిఒ ముగిసింది. ఈ సంస్థకు బ్యాంకింగ్, ప్రభుత్వ, విద్యా, వైద్యం, ఫుడ్‌టెక్, ఇ–కామర్స్ తదితర రంగాల్లో క్లయింట్లను కలిగి ఉంది. ముంబయిలో ఎన్ఎస్ఇ నుంచి లిస్టింగ్ సర్టిఫికెట్‌ను హెచ్‌ఆర్‌హెచ్ నెక్స్ట్ సర్వీసెస్ ఎండి అంకిత్ షా అందుకున్నారు.

సంపాదకీయం

పేదలపై పెనుదాడి

కార్పొరేట్లకు వేల కోట్ల రూపాయలు దోచిపెడుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం సామాన్యుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తోంది. కష్టకాలంలో పేద ప్రజలకు ఎంతో కొంత అండగా ఉంటున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టంపై పదేపదే చేస్తున్న దాడులే దీనికి నిదర్శనం. కొత్త సంవత్సరం తొలిరోజు నుండి అమలులోకి తీసుకువచ్చిన ఆధార్ ఆధారిత ఉపాధి హామీ వేతన చెల్లింపుల విధానం ఈ దాడుల పరంపరలో తాజాది! ఈ విధానం వల్ల నిరుపేదల పొట్ట కొట్టడమే తప్ప మరెటువంటి ప్రయోజనం ఉండదని దాదాపు ఏడాది కాలంగా దేశవ్యాప్తంగా వ్యక్తమవుతున్న ఆందోళనను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిన తీరు దుర్మార్గం. వామపక్ష పోరాటాల ఫలితంగా యుపిఎ ప్రభుత్వ హయాంలో అమలులోకి వచ్చిన ఉపాధి హామీ చట్టం గొంతు నులమడమే లక్ష్యంగా అధికారంలోకి వచ్చినప్పటి నుండి మోడీ ప్రభ్యుత్వం వ్యవహరిస్తోంది. ఏటికేడాది నిధుల కేటాయింపును తగ్గిస్తూ వస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ చట్టం కింద 60 వేల కోట్ల రూపాయలను కేటాయిస్తే, సవరించిన అంచనాల్లో 33శాతం కేటాయింపులు తగ్గించినట్లు తేలిందంటే ఏ స్థాయిలో నిధులు కోత పెట్టారో అర్ధం చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా పరిశ్రమలు మూతపడుతున్నాయి. ఉద్యోగ, ఉపాధి రంగం గతంలో ఎన్నడూ లేని విధంగా క్షీణిస్తోంది. ఫలితంగా ఉపాధి హామీ పనులకు డిమాండ్ పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ఉపాధి హామీ చట్టం అమలుకు భారీ ఎత్తున నిధులు కేటాయించడంతో పాటు, పట్టణ ప్రాంతాలకు విస్తరిస్తే కష్టాల్లో ఉన్న ప్రజానీకానికి ఊరట దక్కి ఉండేది. కానీ, మోడీ ప్రభుత్వానికి సామాన్యుల కష్టాలు, కన్నీళ్లు పట్టవు.

నూతన విధానం ప్రకారం ఉపాధి హామీ చట్టం కింద పనులు చేస్తున్న వారి జాబ్ కార్డు, బ్యాంకు ఖాతా, ఆధార్‌తో అనుసంధానమై ఉండితీరాలి. దీనితో పాటు బ్యాంకు ఖాతా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్లాట్‌ఫామ్‌కు అనుసంధానమై ఉండాలి. అప్పుడే ఆధార్ సంఖ్య ఆర్థిక చిరునామాగా ఉపయోగపడుతుంది. మ్యాపింగ్ చేయడానికి వీలవుతుంది. మ్యాపింగ్ అయిన తరువాత మాత్రమే వేతనాలు చెల్లించడం సాధ్యమవుతుంది. ఈ ప్రక్రియ సజావుగా జరగాలంటే క్షేత్ర స్థాయి వరకు వెళ్లి పనిచేసే అధికార యంత్రాంగంతో పాటు కీలకమైన మౌలిక సదుపాయాలు ఎంతో అవసరం. ఈ దిశలో అవసరమైన చర్యలు తీసుకోని కేంద్ర ప్రభుత్వం అదే సమయంలో పెద్ద సంఖ్యలో కార్మికులను అనర్హులుగా ప్రకటించి చేతులు దులుపుకుంటోంది. అధికారిక లెక్కల ప్రకారమే దేశ వ్యాప్తంగా 25.25 కోట్ల మంది ఉపాధి హామీ పనుల కోసం దరఖాస్తు చేసుకోగా వీరిలో దాదాపు 10 కోట్ల మందిని అనర్హులుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. నిజానికి యుపిఎ హయాంలో రూపొందించిన ఉపాధి హామీ చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ 100 రోజులు పనులు చూపించి తీరాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగానిదే! ఒక్కరిని కూడా అనర్హులుగా ప్రకటించడానికి కానీ, పనులు లేవని చెప్పడానికి కానీ వీలు లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే పనిని పొందడాన్ని ఒక హక్కుగా ఈ చట్టం మార్చింది. ఈ హక్కును కూడా మోడీ సర్కారు నీరుగార్చింది. రకరకాల నిబంధనలు చేర్చి పొట్టకొట్టడమే లక్ష్యంగా వ్యవహరించింది.

అర్హులుగా గుర్తించిన మిగిలిన వారికైనా పనులు ఇస్తోందా అంటే అదీ లేదు. కేంద్ర ప్రభుత్వం అర్హులుగా ప్రకటించిన 14.35 కోట్ల మందిలో దాదాపుగా 12.7శాతం (దాదాపుగా 1.80 కోట్లు) మంది బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం కాలేదు. కాబట్టి వీరు కూడా నూతన విధానం కింద అనర్హులుగానే లెక్క! వీరికి పనులు చూపించే బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకోనుంది. వీరి జీవనం ఎలా అన్న ప్రశ్నకు జవాబు ఇవ్వడానికి కేంద్రం సిద్ధపడటం లేదు. మానవ జీవనాన్ని సులభతరం చేయాల్సిన నూతన సాంకేతికతను పేదలపై దాడి చేయడానికి, జీవనోపాధిని హరించడానికి మోడీ ప్రభుత్వం ఉపయోగిస్తోంది. ఈ విధానాలను మానుకోవాలి. ఉపాధి హామీని ఆధార్‌తో ముడిపెట్టి తప్పనిసరి చేయడాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలి. దీనికోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలి.

మహనీయుల మాట



పరిశుద్ధం కావలసిన అవసరం 'అంటరానివారికి' లేదు. అగ్రవర్ణాలు అని చెప్పకునే వారు మాత్రమే పరిశుద్ధమవ్వాలి. దుర్లక్షణాలు, మురికి, అనారోగ్యకరమైన పరిసరాలు కేవలం అంటరానివారికి మాత్రమే ప్రత్యేకించి లేవు.

- గాంధీజీ

mkgandhi

ఎవరి మేలు కోసం భూమి హక్కుల చట్టం?

విశ్లేషణ



వై. కేశవరావు

రాష్ట్ర ప్రభుత్వం భూహక్కుల చట్టం ఎ.పి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/ 2023 అక్టోబర్ 31 నుండి అమలులోకి వచ్చే విధంగా జీవో నెంబర్ 572 విడుదల చేసింది. ఈ చట్టం వల్ల రైతులకు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని రైతులకు సమగ్ర హక్కుల రికార్డు తయారవుతుందని చెప్తున్నది.

కేంద్ర ప్రభుత్వ అజమాయిషీ లోని నీతి ఆయోగ్ ఈ చట్టాన్ని ప్రతిపాదించింది. మోడల్ ల్యాండ్ టైటిల్ యాక్ట్ రూపొందించింది. అన్ని రాష్ట్రాలు చట్టాలు చేయాలని కోరింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్టాన్ని రూపొందించి రాష్ట్రపతి ఆమోదానికి పంపడం, రాష్ట్రపతి ఆమోదం పొందడంతో అక్టోబర్ 31 నుండి అమలుకు పూనుకున్నది. కేంద్ర ప్రభుత్వం మోడల్ యాక్ట్ రూపొందించే క్రమంలో కొన్ని నిర్ధారణలు ప్రకటించింది.

1.దశాబ్దాల పాటు (సగటు 20 సంవత్సరాలు) సాగుతున్న కోర్టు లిటిగేషన్లను అరికట్టి మూడు సంవత్సరాలలో ప్రజలకు వివాదాలు లేని రికార్డు తయారు చేయడం. 2. ప్రభుత్వానికి, పెట్టుబడిదారులకు, మౌళిక సదుపాయాలు కల్పించే వారికి అవరోధాలు లేకుండా చూడడం-భూమి మార్కెట్‌ను అభివృద్ధి పరచడం. 3. పట్టణ, గ్రామీణ సంస్థల ఆదాయాలు పెంచడం. 4. సన్న చిన్నకారు రైతులకు పరపతి కల్పించడం. 5.పట్టణీకరణలో పెరుగుతున్న గృహ అవసరాలు తీర్చడం. 6. బినామీ ట్రాన్సాక్షన్లు అరికట్టడం, బ్లాక్ మనీని అరికట్టడం.

ఈ అంశాలను సాధించాలంటే అన్ని రాష్ట్రాలు చట్టం చేయాలంది. అలా మన రాష్ట్ర ప్రభుత్వం కూడా చట్టం చేసి అమలులోకి తెచ్చింది. రూల్స్ విడుదల చేయవలసి ఉంది. ఈ చట్టం అమలుకు గాను మూడు స్థాయిలలో (1. భూమి రిజిస్ట్రేషన్ అధికారి, 2. అప్పిలేటు అధికారి, 3 భూమి ప్రాధికార సంస్థ) నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేసింది.

భూ సర్వే

రాష్ట్రంలో గత రెండు సంవత్సరాల నుండి భూముల సర్వే కార్యక్రమం జరుగుతుంది. సర్వేయర్ల ద్వారా కాకుండా డ్రోన్ల ద్వారా సర్వే జరుగుతుంది. వ్యవసాయ భూములతో పాటు గ్రామ కంఠాలు, మంద బయళ్ళు, తదితర భూములన్ని సర్వే చేస్తున్నారు. ఈ సర్వేను పరిశీలిస్తే సరిహద్దులు సక్రమంగా రావడం లేదని వాస్తవ విస్తీర్ణానికి, డ్రోన్‌లు చూపిస్తున్న విస్తీర్ణానికి పొంతన ఉండడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. సర్వే పూర్తయిన గ్రామాలలో పట్టాదారు పుస్తకాలు ఇస్తున్నారు. ల్యాండ్ పార్సిల్‌లో ఉన్న రైతులందరికీ జాయింట్ పట్టాలు ఇస్తున్నారని, క్రయ విక్రయాలకు బ్యాంక్ తనఖాలకు అందరి ఆమోదం కావాలన్న షరతు ఉన్నదని విమర్శలు వచ్చాయి. భూమి రిజిస్ట్రేషన్ అధికారిగా స్థానిక ఎమ్మార్వో ఉండాలి. సంచార మొబైల్ ఎమ్మార్వోగా మరొకరిని నియమించారు.



భూ సర్వే పూర్తయిన క్రమంలో గ్రామాలలో రిజిస్ట్రేషన్ అధికారి రికార్డులలో నమోదు చేయాలి. భూమి కలిగిన యజమాని నివాస గృహం లేదా స్థలం కలిగిన యజమాని తమకు ఉన్న హక్కు పత్రాలను రిజిస్ట్రేషన్ అధికారికి అందించాలి. అన్నీ సక్రమంగా ఉంటే నమోదు చేస్తారు. కోర్టు లిటిగేషన్ ఉన్నా, సరిహద్దు వివాదం ఉన్నా, దాయాదుల తగాదాలు ఉన్నా రిజిస్ట్రేషన్ అధికారికి రాతపూర్వకంగా ఇవ్వాలి. ఈ లిటిగేషన్లన్నీ రిజిస్టర్‌లో నమోదు చేసి అప్పిలేట్ అధికారికి తెలియజేస్తారు. రైతుకు పట్టాదారు పాసు పుస్తకం ఇచ్చినా రిజిస్ట్రేషన్ అధికారి దగ్గర డిజిటలైజ్ చేసినదే అధికారయుతంగా ఉంటుంది. ఇది మార్పు చేసే అవకాశం ఉంటుంది. ఇది రైతుకు ఏ మాత్రం క్షేమకరం కాదు. రైతుకు ఇచ్చిన పట్టాదారు పాసు పుస్తకం అధికార పత్రంగా ఉండాలి. రికార్డు అయిన రెండు సంవత్సరాల లోపల ఎవరైనా అప్పీలు అధికారికి అభ్యంతరం దాఖలు చేయవచ్చు. నిరూపణ అయ్యేవరకు పెండింగ్‌లో ఉంటుంది. చట్టంలోని 64వ క్లాజు ప్రకారం నిరూపించుకోలేకపోతే ఆ రైతుకు లేదా స్థల యజమానికి ఆరు మాసాల జైలు, రూ.50 వేలు జరిమానా విధించవచ్చు.

> **రైతుకు పట్టాదారు పాసు పుస్తకం ఇచ్చినా రిజిస్ట్రేషన్ అధికారి దగ్గర డిజిటలైజ్ చేసినదే అధికారయుతంగా ఉంటుంది. ఇది మార్పు చేసే అవకాశం ఉంటుంది. ఇది రైతుకు ఏ మాత్రం క్షేమకరం కాదు. రైతుకు ఇచ్చిన పట్టాదారు పాసు పుస్తకం అధికార పత్రంగా ఉండాలి. రికార్డు అయిన రెండు సంవత్సరాల లోపల ఎవరైనా అప్పీలు అధికారికి అభ్యంతరం దాఖలు చేయవచ్చు. నిరూపణ అయ్యేవరకు పెండింగ్‌లో ఉంటుంది. చట్టంలోని 64వ క్లాజు ప్రకారం నిరూపించుకోలేకపోతే ఆ రైతుకు లేదా స్థల యజమానికి ఆరు మాసాల జైలు, రూ.50 వేలు జరిమానా విధించవచ్చు.**

అప్పిలేటు అధికారి

జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ హోదాకు తగ్గని అధికారిని అప్పిలేటు అధికారిగా నియమిస్తారు. రిజిస్ట్రేషన్ అధికారుల నుండి వచ్చిన, నేరుగా రైతులు లేదా ఇతరుల నుండి వచ్చిన ఫిర్యాదులను ఈ అధికారి విచారించి తీర్పు వెలువరుస్తారు. రెండు సంవత్సరాల వ్యవధిలో తీర్పులు ఇవ్వాలి. అప్పిలేట్ అధికారి ఇచ్చిన తీర్పు అంగీకారం కాకపోతే హైకోర్టుకు వెళ్ళాలి. జూనియర్, సీనియర్ సివిల్ కోర్టులకు, జిల్లా కోర్టులకు వెళ్ళకూడదు. సివిల్ కోర్టులు, జిల్లా కోర్టులు కలుగజేసుకోకూడదు. సన్న చిన్నకారు రైతాంగం హైకోర్టు దాకా వెళ్లలేరు. వెళ్లినా భూ మాఫియా ముందు నిలువలేరు. రైతాంగానికి న్యాయం అందని ద్రాక్షపండే అవుతుంది. భారత రాజ్యాంగంలోని నాలుగు మూల స్తంభాలలో న్యాయస్థానం ఒకటి తమకు అన్యాయం జరిగినప్పుడు కోర్టును ఆశ్రయించడం ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కు సామాన్య ప్రజానీకానికి అందుబాటులో ఉండే డివిజినల్, జిల్లా న్యాయస్థానాలకు వెళ్లకుండా ఆంక్షలు విధించడం రాజ్యాంగ విరుద్ధం.

భూ ప్రాధికార సంస్థ

రాష్ట్ర స్థాయిలో ఐదుగురు సభ్యులతో భూప్రాధికార సంస్థ ఏర్పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 630 జీవో ద్వారా భూ ప్రాధికార సంస్థను నియమించింది. సిసిఎల్‌ఎ ఛైర్మన్‌గాను, సర్వీస్ సెటిల్‌మెంట్ కమిషనర్‌ను ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ కమిషనర్ గాను, మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ కమిషనర్, పంచాయతీరాజ్ కమిషనర్ సభ్యులుగా భూ ప్రాధికార సంస్థను ఏర్పరిచింది. ఈ సంస్థకు చట్టం రెండు కర్తవ్యాలను నిర్దేశించింది.

1. స్థిర చరాస్తులను సంపాదించడానికి కలిగి ఉండడానికి, ఆస్తికి మార్కెట్‌ను సృష్టించి వ్యయం చేయడానికి దావా వేయడానికి అవకాశం ఇచ్చింది. 2. దస్తావేజులకు, లైసెన్సులకు సంబంధించిన సమాచారం కోసం ఫీజులు నిర్ణయించి వసూలు చేయడం, ప్రభుత్వం నుండి లేదా సంస్థల నుండి సహాయం, గ్రాంట్లు, దానాలు, చందాలను, బహుమతులను, ధర్మాదాయములను స్వీకరించవచ్చు...అని 5వ అధ్యాయం 30, 31 క్లాజులలో స్పష్టంగా పేర్కొంది.

> **అదానీ, అంబానీల వంటి కార్పొరేట్ కంపెనీలకు గిడ్డంగుల నిర్మాణానికి, వ్యాపార కారిడార్లు ఏర్పరచుకోవడానికి ఈ చట్టం బాగా ఉపకరిస్తుంది. భూ ప్రాధికార సంస్థకు అధికారాన్ని కట్టబెట్టడం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమేననడంలో ఎటువంటి సందేహం లేదు. అందుకే ఈ భూ హక్కుల చట్టం రద్దుకు పోరాడవలసి ఉంది.**

ఈ చట్టం ప్రకారం భూక్రయ విక్రయాలపైన, కట్టడాల పైన, లైసెన్సులపైన ఫీజులు పెంచడం, వసూలు చేయడం, ప్రభుత్వానికి, స్థానిక సంస్థలకు వాటాలు పంచడం చేస్తుంది. ఇప్పటికే ఆస్తులు విలువలు పెంచడం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం వల్ల సన్న, చిన్నకారు రైతాంగం పేద మధ్యతరగతి గృహ, స్థల యజమానులు భరించలేనంతగా ఉన్నాయి.

ప్రభుత్వ భూములను, ప్రైవేటు భూములను సమీకరించడం వాటిని కార్పొరేట్ కంపెనీలకు, రియల్టర్లకు అమ్మే అధికారం పొందింది. అందుకు అనుగుణంగానే ఈ చట్టం ఆమోదించిన వెంటనే రాష్ట్రంలో 15 లక్షల 56 వేల మంది దగ్గరున్న 26 లక్షల ఎకరాల బంజరు భూములపై ఉన్న నిషేధాన్ని 35వ నెంబర్ జీవో ద్వారా ఎత్తివేసింది. ఇటీవల కాలంలో షరతులతో దళితులకు, గిరిజనులకు ఇచ్చిన బీ ఫారం భూములను సైతం భూ ప్రాధికార సంస్థ స్వాధీనం చేసుకునే అవకాశం కలిగింది. సహాయం, దానములు, చందాలు, బహుమతులు ఇవ్వగలిగిన కార్పొరేట్ కంపెనీలకు పేదల భూములు గుంజుకోవడానికి రాజమార్గం ఏర్పడింది.

గతంలోని కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులకు, రైల్వే లైన్‌లకు 500 మీటర్ల వరకు గల భూములలో నిర్మాణాలకు నిషేధం విధించింది. కోస్టల్ రెగ్యులేటెడ్ జోన్ పరిధిని మరొక 500 మీటర్లకు పెంచింది. అనంతపురం అమరావతి జాతీయ రహదారి ప్లానులో అవసరమైన దానికన్నా వెడల్పును రహదారుల జంక్షన్లో అదనపు భూములను తీసుకోవడానికి నోటిఫికేషన్ కూడా ఇచ్చిన విషయం విదితమే.

అదానీ, అంబానీల వంటి కార్పొరేట్ కంపెనీలకు గిడ్డంగుల నిర్మాణానికి, వ్యాపార కారిడార్లు ఏర్పరచుకోవడానికి ఈ చట్టం బాగా ఉపకరిస్తుంది. భూ ప్రాధికార సంస్థకు అధికారాన్ని కట్టబెట్టడం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమేననడంలో ఎటువంటి సందేహం లేదు. అందుకే ఈ భూ హక్కుల చట్టం రద్దుకు పోరాడవలసి ఉంది.

(వ్యాసకర్త సీనియర్ రైతు నాయకులు)

దేవుని సొమ్ము దేనికోసం ఖర్చు చేయాలి!

అభిప్రాయం



కందారపు మురళి

దేవుని సొమ్మును ప్రజల అవసరాలు తీర్చటానికి ఖర్చు చేయవచ్చా? లేదా? అన్న చర్చ తిరుపతి నగరంలో ప్రస్తుతం పెద్ద ఎత్తున జరుగుతున్నది.

దేవుని సొమ్ము ప్రజల అవసరాలకు ఖర్చు చేయకూడదని గత అనేక ఏళ్లుగా బిజెపి అడ్డంకులు సృష్టిస్తున్నది. తిరుమల-తిరుపతి దేవస్థానం పాలక మండలి తిరుపతి అభివృద్ధికి తన బడ్జెట్‌లో ఒక శాతం నిధులు కేటాయించటం, తిరుపతి నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణకు టిటిడి బాధ్యత తీసుకోవటాన్ని వ్యతిరేకిస్తూ బిజెపి కోర్టులో వ్యాజ్యాలు నడుపుతున్నది. ఇదే అంశంపై తెలంగాణకు చెందిన ఓ కేసులో భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి ఉదయ్ ఉమేష్ లలిత్, మరో న్యాయమూర్తి ఎస్ రవీంద్ర భట్‌లు గతంలో ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు.

1863 దేవాదాయ చట్టాన్ని ఉదహరిస్తూ ఆలయాలకు అందే నిధులు ప్రజల నుంచి వచ్చినవే కాబట్టి అవి తిరిగి ప్రజలకే వెచ్చించాలని అన్నారు. సమాజం యొక్క పెద్ద అవసరాలను ప్రభుత్వమే కాకుండా ఆదాయం ఉన్న ఆలయాలు, మత సంస్థలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా తిరుమల-తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న ఢిల్లీలోని విద్యాసంస్థ గురించి, కళాశాలలు, వైద్య సంస్థల గురించి న్యాయమూర్తులు ప్రస్తావించారు. దేశంలో 9 లక్షల ఆలయాలు ఉండగా ప్రభుత్వ నియంత్రణలో 4 లక్షలు ఉన్నాయని సామాజిక అవసరాలు తీర్చటం ఆలయాల బాధ్యతగా ఉండాలని చెప్పారు.

శుచి, శుభ్రతకు బిజెపి అడ్డు

ఇంటికొచ్చే ఎవరినైనా కాళ్లు, చేతులు కడుక్కుని లోపలికి రమ్మనటం ఆనవాయితీ. అలాంటిది తిరుపతి మీదుగా తిరుమలకు వెళ్లాల్సిన భక్తులకు అత్యంత శుభ్రంగా, పవిత్రంగా తిరుపతిని ఉంచటానికి టిటిడి తన నిధులను పారిశుధ్య నిర్వహణకు కేటాయింపులు చేస్తే బిజెపి అడ్డుపుల్ల వేసింది.

తిరుపతి నగరాభివృద్ధికి ఒక శాతం నిధులను మున్సిపాలిటీకి కేటాయిస్తూ టిటిడి పాలక మండలి చేసిన తీర్మానంపై బిజెపి వ్యతిరేకిస్తూ అడ్డగోలు వాదనలు చేసింది. విశ్వహిందూ పరిషత్ ఎ.పి లోని అన్ని కలెక్టరేట్ కార్యాలయాల దగ్గర ధర్నాలకు పిలుపునిచ్చింది. ఈ పరిణామాలతో రాష్ట్ర ప్రభుత్వం వెనకడుగు వేసి టిటిడి చేసిన ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్టు ప్రకటించింది.

తిరుపతి నగరానికి రోజుకు కనీసంగా లక్ష మంది భక్తులు వస్తుంటారు. గత ఏడాది పెరటాసి మాసం సందర్భంగా 5 లక్షల మంది తిరుమలకు వచ్చారు. వీరంతా తిరుపతి మీదుగా తిరుమలకు చేరుకోవలసిందే.

ఇంత మంది భక్తుల విసర్జకాలు, వ్యర్థాలను నిర్వహించటానికి తమ శక్తి సరిపోవడం లేదని టిటిడి కూడా బాధ్యత తీసుకోవాలని స్థానిక మున్సిపాలిటీ టిటిడిని కోరింది. దీనికి సానుకూలంగా టిటిడి స్పందించి భక్తులు తిరుగాడే ప్రాంతాల పారిశుధ్య పనుల బాధ్యతను తానే తీసుకుని, టెండర్లను పిలిచింది. దీనిని వ్యతిరేకిస్తూ బిజెపి భక్తుల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని కోర్టుకెక్కింది. కోర్టు మధ్యంతర ఉత్తర్వులతో పనులు ఆగాయి.

ఈ చర్యతో దేవుని సొమ్ము ప్రజల కోసం ఖర్చు చేయటం సమంజసమా?! కాదా?! అన్న చర్చ ప్రారంభమైంది.

1987లో ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ చొరవతో టిటిడి చట్టాన్ని పటిష్టం చేశారు. మిరాశి వ్యవస్థను (స్వామివారి ఆదాయంలో వాటాను పొందే బాపతు) రద్దు చేస్తూ టిటిడి నిధులు విద్య, వైద్యం, పారిశుధ్యం తదితరాలతో భక్తులు, యాత్రికుల అవసరాలు తీర్చే విధంగా చట్టంలో పలు అర్థవంతమైన మార్పులు చేశారు. 1986లో జస్టిస్ చల్లా కొండయ్య సిఫార్సుల మేరకు ఈ చట్టం రూపొందించబడింది. టిటిడి చట్టంలోని నాల్గవ ప్రకరణం, 7వ అంశంలో, 6(ఎ) సబ్‌క్లాజ్ 4లో నిధులను పారిశుధ్యం, విద్య, వైద్యం లాంటి పనులకు వెచ్చించవచ్చని స్పష్టంగా పేర్కొనబడింది.

దళితుల ఉపాధికి గండి

తిరుపతిలో పారిశుధ్య పనులను అడ్డుకోవటం ద్వారా బిజెపి దళితులు, గిరిజనుల, మహిళలు ఉపాధికి గండి కొట్టింది. టిటిడి పారిశుధ్య పనులు చేపట్టడం ద్వారా మరో 1600 కుటుంబాలకు ఉపాధి ఏర్పడేది. 1600 మంది కార్మికులకు పని కల్పించటానికి అవసరమైన ఏర్పాట్లు జరిగిన నేపథ్యంలో ఈ వర్గాలకు బిజెపి ద్రోహం తలపెట్టింది.

టిటిడి నిధుల ఖర్చు విషయంలో బిజెపి దాని అనుయాయ సంస్థలు మొదటి నుంచి యాగీ చేయటం అనవాయితీగా మారింది.

ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు మిరాశీ వ్యవస్థను రద్దు చేస్తూ 1987లో చేసిన చట్టాన్ని బిజెపి వ్యతిరేకించింది. టిటిడి ఆదాయంలో కొంత భాగాన్ని మిరాశీలకు చెల్లించాల్సిందేనని, సాంప్రదాయకంగా వస్తున్న మిరాశీ వ్యవస్థను రద్దు చేయటానికి ఎన్‌టిఆర్ ప్రభుత్వానికి హక్కు లేదని బిజెపి వాదించింది. మిరాశీలకు అండగా నిలబడింది.

1988వ సంవత్సరంలో తిరుపతి భూగర్భ డ్రయినేజీ పనులకు రూ.25 కోట్లు అవసరమని, టిటిడి సమకూర్చాలని తిరుపతి మున్సిపాలిటీ అభ్యర్థించింది. టిటిడి సానుకూలంగా స్పందించి రూ.25 కోట్లు కేటాయిస్తూ తీర్మానించింది.

బిజెపి, విహెచ్‌పిలు ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా కోర్టుకెక్కాయి. రూ.25 కోట్లు కాస్తా రూ.100 కోట్లు ఖర్చు అయ్యేంత కాలం కోర్టులలో వ్యాజ్యాలు నడిపి చివరకు విహెచ్‌పి ఓడిపోయింది. టిటిడి గెలిచింది. నాడు నిర్మించిన భూగర్భ డ్రయినేజి నిర్మాణం నేటికీ తిరుపతికి తోడ్పడుతున్నది. ఆఖరుకు బిజెపి ప్రభుత్వం నిర్వహిస్తున్న స్మార్ట్ సిటీ జాబితాలో తిరుపతి స్థానం సంపాదించింది.

తిరుపతి నగరానికి సమీపంలో కరకంబాడి వద్ద టిటిడి ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని టిటిడి తీర్మానించగా నాటి ఇఓ ఐవైఆర్ కృష్ణారావు ద్వారా బిజెపి, విహెచ్‌పి, ఆర్‌ఎస్‌ఎస్‌లు కోర్టుకెక్కి అడ్డుకున్నాయి. ఏళ్ల తరబడి వ్యాజ్యాలు నడిచి ఇప్పుడు తిరుపతికి 30 కి.మీ దూరంలోని వడమాలపేటలో స్థలాలు కేటాయించారు. బిజెపి పుణ్యమా అని ఉద్యోగులు ఉసూరుమంటున్నారు.



> **టిటిడి నిధులు ఆలయ నిర్మాణాలకు, హిందూ ధర్మ ప్రచారానికి మాత్రమే ఖర్చు చేయాలని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్‌పిలు అదే పనిగా మాట్లాడుతున్నాయి. కానీ టిటిడి నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలను కొనసాగించాల్సిన ఆవశ్యకత ఉన్నది. బిజెపి ఒత్తిడికి తలొగ్గి ప్రజోపయోగ పనుల నుంచి వెనక్కు మళ్లటం చారిత్రక తప్పిదమవుతుంది. ప్రస్తుత టిటిడి ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలోని పాలక మండలి, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు, భక్తులకు మేలు జరిగే వ్యవహారాలలో వెనక్కు తగ్గకుండా అమలు జరపాలి.**

తిరుపతిలో ట్రాఫిక్ కష్టాలు తీరటానికి టిడిపి హయాంలో మున్సిపాలిటీ, టిటిడి, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్మాణం తలపెట్టిన గరుడ వారధి (ప్రస్తుతం శ్రీనివాస సేతు)ని బిజెపి అడ్డుకుని హైకోర్టు మెట్లెక్కింది. ప్రజాగ్రహంతో వెనక్కు తగ్గి తన పిల్‌ను ఉపసంహరించుకుంది.

తిరుపతి రోడ్ల అభివృద్ధికి, ఉద్యోగుల, కాంట్రాక్టు కార్మికుల సౌకర్యాలు, వేతనాల పెంపుకు, విద్యా వైద్యానికి టిటిడి ఖర్చు చేయటాన్ని బిజెపి అడుగడుగునా వ్యతిరేకిస్తున్నది.

రాష్ట్రానికి తలమానికంగా ఉన్న తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో డాక్టర్ పోస్టుల భర్తీకి టిటిడి నోటిఫికేషన్ విడుదల చేస్తే హిందూ డాక్టర్లను మాత్రమే రిక్రూట్ చేసుకోవాలని బిజెపి నానా యాగీ చేసింది.

బిజెపి రెండు నాల్కల ధోరణి

24 మందితో ఉన్న ప్రస్తుత టిటిడి బోర్డులో బిజెపి అనుకూలురు తొమ్మిది మంది ఉన్నారు. కర్ణాటక బిజెపి ఎంఎల్‌ఏ సైతం సభ్యునిగా ఉన్నారు. తిరుపతి అభివృద్ధికి టిటిడి నిధులు ఒక శాతం ఖర్చు చేయటానికి, పారిశుధ్య పనుల నిర్వహణకు వీరంతా అనుకూలంగా బోర్డులో తీర్మానం చేశారు. బోర్డులో ఉన్న బిజెపి సభ్యులు అనుకూలం. బోర్డు బయట ఉన్న బిజెపి వ్యతిరేకం.

తిరుమల కొండపై బిజెపి వైఖరి ఒక రకంగా, కొండ కింద బిజెపి వైఖరి మరో రకంగా ఉండటాన్ని పలువురు విమర్శిస్తున్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి టిటిడి నిధుల వినియోగంపై తిరుపతికి వచ్చి మరీ నిరసన తెలిపారు. బోర్డులోని బిజెపి సభ్యులు ఆమోదం తెలిపి మీరెందుకు వ్యతిరేకిస్తున్నారన్న దానిపై ఆమె నోరు మెదపలేదు.

సమరసతా ఫౌండేషన్ పేరిట బిజెపి దందా

టిటిడిలో సమరసతా సేవ ఫౌండేషన్ పేరిట బిజెపి తన దందాను సాగిస్తున్నది. శ్రీవాణి ట్రస్టు నిధులతో ఆలయ నిర్మాణాలు, హిందూ ధర్మం ప్రచారం పేరిట కోట్లాది రూపాయల నిధులను ఈ ఫౌండేషన్ ఖర్చు చేస్తున్నది. ఇది అమరావతి కేంద్రంగా ఎపి, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో ఖర్చు చేస్తున్నది.

ఐఎఎస్‌లుగా పని చేసి రిటైరయి ప్రస్తుతం బిజెపి నాయకులుగా చలామణి అవుతున్న ఐవైఆర్ క్రిష్ణారావు, దాసరి శ్రీనివాసులు వంటి వారు, విహెచ్‌పి, ఆర్‌ఎస్‌ఎస్‌లలో చురుగ్గా పని చేస్తూ రిటైరైన అధికారులు ఈ ఫౌండేషన్‌లో ఉన్నారు. వీరికి టిటిడి ఇప్పటికే కోట్లాది రూపాయలు సమర్పించుకున్నది. ప్రస్తుత ఇఓ ధర్మారెడ్డిని విహెచ్‌పి నేతలు ఇటీవల విహెచ్‌పి సమావేశాలకు పిలిచి మరీ సన్మానించారు. ధర్మారెడ్డి సేవలను ప్రశంసించారు.

టిటిడి నిధులు ఆలయ నిర్మాణాలకు, హిందూ ధర్మ ప్రచారానికి మాత్రమే ఖర్చు చేయాలని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్‌పిలు అదే పనిగా మాట్లాడుతున్నాయి.

టిటిడి నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలను కొనసాగించాల్సిన ఆవశ్యకత ఉన్నది. బిజెపి ఒత్తిడికి తలొగ్గి ప్రజోపయోగ పనుల నుంచి వెనక్కు మళ్లటం చారిత్రక తప్పిదమవుతుంది. ప్రస్తుత టిటిడి ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలోని పాలక మండలి, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు, భక్తులకు మేలు జరిగే వ్యవహారాలలో వెనక్కు తగ్గకుండా అమలు జరపాలి.

(వ్యాసకర్త టిటిడి ఉద్యోగ, కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు)

నివాళి

అంధుల అక్షర ప్రదాత బ్రెయిలీ

అంధుల కోసం ప్రత్యేక లిపిని కనిపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ. చిన్నతనంలోనే చూపు కోల్పోయినప్పటికీ ఏ మాత్రం కుంగిపోకుండా తన లాంటి వారు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ప్రత్యేకంగా బ్రెయిలీ లిపిని అభివృద్ధి చేశాడు.

లూయిస్ బ్రెయిలీ 1809 జనవరి 4వ తేదీన పారిస్ లోని 'క్రూవే' గ్రామంలో మోనిక్ బ్రెయిలీ, సైమన్ రెనె బ్రెయిలీ దంపతులకు జన్మించాడు. బాల్యంలో ప్రమాదవశాత్తు రెండు కళ్లు కోల్పోయి అంధుడిగా మారాడు. పారిస్‌లో వాలెంటైన్ హ్యూ ప్రారంభించిన అంధుల పాఠశాలలో ఆయన చదువుకున్నాడు. బ్రెయిలీ తెలివితేటలను చూసి ఉపాధ్యాయులే ఆశ్చర్యపోయారు. పట్టుదలగా 'లైన్ టైపు' పద్ధతిలో చదువుకుని 17 సంవత్సరాల వయస్సులోనే అదే స్కూలులో ప్రొఫెసరుగా నియమితులయ్యాడు.

పగలు పాఠశాలలో చదువు చెప్తూ, రాత్రి సమయంలో అంధులు చదవగలిగే, రాయగలిగే లిపి తయారీకి కృషి చేశాడు. అంధులు పుస్తకాలను స్పర్శతో గుర్తుపట్టి చదివేందుకు వీలుగా చుక్కలు ఉండాలనే నిర్ణయానికి వచ్చాడు. సైనికులు చీకటిలో కూడా తాను పంపిన సమాచారం గుర్తించేందుకు వీలుగా 1821లో ఛార్లెస్ బార్బియర్ అనే సైనికాధికారి రూపొందించిన 12 ఉబ్బెత్తు చుక్కల లిపిని...బ్రెయిలీ ఆరు చుక్కలకు తగ్గించాడు. ఫ్రాన్స్ దేశం బ్రెయిలీ లిపికి అధికారిక గుర్తింపునిచ్చి ఆయనను తమ ముద్దుబిడ్డగా ప్రకటించుకుంది. ఆ కృషి వలనే ప్రపంచ వ్యాప్తంగా అంధులు చదువుకునేందుకు వీలు కల్గింది. అయితే అంధుల కోసం బ్రెయిలీ కనిపెట్టిన లిపికి ఆయన మరణానంతరమే గుర్తింపు వచ్చింది. సంగీతాన్ని కూడా అదే లిపిలో రాయడం ఆయన విశిష్టత.

ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల మంది అంధులు అభివృద్ధి చెందిన దేశాల్లో నివసిస్తున్నారు. పిల్లలలో అంధత్వం పెరుగుదలకు...నివసిస్తున్న ప్రాంతం, కుటుంబ సామాజిక, ఆర్థిక పరిస్థితి కారణం అవుతుంది. మన దేశంలో 15 మిలియన్ల మంది అంధులున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరి కోసం ప్రత్యేకంగా విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలి. సామూహిక ప్రాంతాల్లో బ్రెయిలీ లిపి అందుబాటులో ఉంచాలి. అన్ని రకాల అంధత్వం కలిగిన వారికి వైకల్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి. ప్రభుత్వ సమాచారం, జీవోలు, చట్టాలు బ్రెయిలీ లిపిలో ముద్రించి అందుబాటులోకి తేవాలి. అంధులకు పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలి. సమాజంలో వారికి సమాన అవకాశాలు కల్పించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

- యం. అడివయ్య,
ఎన్‌పిఆర్‌డి జాతీయ ఉపాధ్యక్షులు, సెల్ : 9490098713

రాష్ట్ర స్థాయి పోటీల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

సీతంపేట : గురుకులాల ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సీతంపేట ఐటిడిఎ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఐటిడిఎ పిఒకల్పనకుమారి అభినందించారు. స్థానికబాలుర గురుకుల కళాశాల విద్యార్థులు ఖోఖో, ఆర్చరీలో ప్రథమ స్థానం సాధించారు. అలాగే ట్రిపుల్ జంప్‌లో ప్రథమస్థానం, 400 మీటర్లు, 100 మీటర్ల పరుగుపందెంలో తృతీయ స్థానాలు సాధించారు. దీంతో పాటు ఆల్ రౌండ్ ఛాంపియన్ షిప్ కూడా సొంతం చేసుకున్నారు. బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు కబడ్డీలో ప్రథమస్థానం, వాలీబాల్, ఖోఖో, బాడ్మింటన్, పోటీల్లో ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానం, 800 మీటర్ల పరుగుపందెంలో తృతీయ స్థానం సాధించారు. బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు కబడ్డీ క్రీడలో ప్రథమస్థానం, ఖోఖోలో ద్వితీయ స్థానం, 400 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానం, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, షాట్ పుట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానందం, కళాశాల ప్రిన్సిపళ్లు నాగభూషణరావు, పీడీ లక్ష్మణామూర్తి పాల్గొన్నారు.

పార్లమెంట్ భద్రతావైఫల్యం కేసు : నీలమ్ ఆజాద్ పిటిషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ : పార్లమెంట్ భద్రతా వైఫల్యం కేసులో అరెస్టయిన నీలమ్ ఆజాద్ పోలీస్ రిమాండ్‌ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు బుధవారం తిరస్కరించింది. తన పోలీస్ రిమాండ్ చట్ట విరుద్ధమని, తక్షణమే విడుదల చేయాలని పిటిషన్‌లో కోరారు. పిటిషనర్ ఇప్పటికే ట్రయల్ కోర్టు ముందు బెయిల్ దరఖాస్తును సమర్పించారు. ఈ సమయంలో ఈ పిటిషన్ సమర్థనీయం కాదని మరియు తదనుగుణంగా కొటివేస్తున్నామని జస్టిస్ సురేష్ కుమార్ కైత్, జస్టిస్ మనోజ్ జైన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది.

ఆమెను హైకోర్టు ముందు హాజరుపరిచేలా హెబియస్ కార్పస్ రిట్ మరియు ఆమెకు స్వేచ్ఛనిచ్చేలా ఆదేశించాలని నీలమ్ తరపు న్యాయవాది పిటిషన్‌లో కోరారు. అలాగే తనకు నచ్చిన న్యాయవాదిని సంప్రదించడానికి అనుమతించకపోవడానికి రాజ్యాంగం హామీ ఇచ్చిన తన ప్రాథమిక హక్కుని ఉల్లంఘించడమేనని, దీంతో రిమాండ్ ఆర్డర్ చట్టవిరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే విచారణ సమయంలో ఆమె ప్రాథమిక హక్కును ఉల్లంఘించేలా ఎటువంటి కారణాలు చూపలేదని హైకోర్టు పేర్కొంది.

పార్లమెంట్ భద్రతా వైఫల్యం కుట్రతో ప్రమేయం ఉన్నవారందరినీ గుర్తించేందుకు వారికి రిమాండ్ అవసరమని సిటీ పోలీసులు పేర్కొనడంతో .. నీలమ్ ఆజాద్ సహా నలుగురు నిందితులకు జనవరి 5 వరకు రిమాండ్ విధిస్తున్నట్లు గతేడాది డిసెంబర్ 21 ట్రయల్ కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే.

అయోధ్యకు ప్రత్యేక రైళ్లు

లక్నో: అయోధ్యలో జనవరి 22న శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా అక్కడికి పర్యాటకుల రద్దీ భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అయోధ్య సందర్శనకు వచ్చే ప్రయాణికుల కోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందించినట్లు రైల్వే శాఖ ప్రకటించింది. వివిధ ప్రాంతాల నుంచి ప్రస్తుతం అయోధ్యకు 35 రైళ్లు నడుస్తున్నాయి. రోజువారీ రైళ్లతో పాటు, వీక్లీ రైళ్లు కూడా ఇందులో ఉన్నాయి. వీటితో పాటు జనవరి 22 నుంచి అదనంగా 37 రైళ్లను నడపనున్నట్లు రైల్వే శాఖ పేర్కొంది. దీంతో దేశంలోని 430 నగరాల నుంచి మొత్తం 72 రైళ్లు అయోధ్యకు నడపనున్నట్లు తెలిపారు.

ధాన్యం రైతుల గగ్గోలు

- అన్నదాతను దోచేస్తున్న మిల్లర్లు
- ఏడు కేజీల వరకు అదనంగా వసూలు
- ప్రశ్నిస్తే లోడ్లు వెనక్కి పంపిస్తున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న కర్షకులు



ప్రజాశక్తి- రేగిడి (విజయనగరం)

అన్నదాతలకు అడుగడుగునా ఆటంకాలు తప్పడం లేదు. మొన్న వర్ష భావం కారణంతో కొంత పంట నష్టం వాటిల్లగా నిన్నేమో తుపాను కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. వచ్చిన కొద్దిపాటి పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న ధాన్యాన్ని రైతు మిల్లర్లకు పంపిస్తే అక్కడ 80 కేజీలకు గాను, 87 నుంచి 90 కేజీల వరకు (7నుంచి10కేజీలు) అదనంగా తూనికలు వేసి రైతుల ధాన్యాన్ని. దోచేస్తున్నారు. ప్రభుత్వం 80 కేజీలు తూనికలకు అంగీకరిస్తే మిల్లర్లు ఈ విధంగా దగా చేస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఏమైనా ప్రశ్నిస్తే తీసుకువెళ్లిన లోడులను వెనక్కి పంపిస్తున్నారు. దూర ప్రాంతాల నుండి ధాన్యాన్ని ఎడ్ల బల్లతో మిల్లర్లకు తీసుకువెళ్లడంతో ఏమి తోచన పరిస్థితులలో ఎడ్ల బళ్ళు అద్దెలు కట్టుకోలేక తప్పనిసరిగా అదనపు ధాన్యాన్ని ఇవ్వవలసిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. రైతే రాజు అన్న ప్రభుత్వం, కస్టోడియన్ అధికారులైన విఆర్ఒలు, ఆర్ఐ, తహశీల్దార్, ఫుడ్ కార్పొరేషన్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో పాటు రైతుల బాధలు పట్టించుకోకపోవడంతో రైతులం ఎలా బతికేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని కొండల మామిడి వలస, పారం పేట, కోడిశ , సోమరాజుపేట గ్రామాల్లో ఉన్న రైస్ మిల్లర్లకు ప్రభుత్వం ధాన్యం ఆడేందుకు అనుమతులు మంజూరు చేసింది. అయితే ప్రభుత్వ నిబంధనలు ప్రకారం 80 కిలోలు ధాన్యం బస్తాను తీసుకోవాల్సిన మిల్లర్లు ఒక్కో రైతు నుంచి అధనంగా 7 కిలోలు ధాన్యం తీసుకుని మొత్తం 87 నుంచి 90 కిలోల మధ్య ధాన్యాన్ని సేకరిస్తున్నారు. ఈ విధంగా మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నారు. మిల్లర్ల ఒత్తిడిని తట్టుకోలేని కొంత మంది రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించాల్సి వసుందని చెబుతున్నారు.

ప్రకటనలకే పరిమితం

తుపాను కారణంగా తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తరలించి మంచి ధర కల్పిస్తామని మంత్రి, జెడ్‌పి చైర్మన్ చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు కొనగోళ్లకు ముందు ఆర్‌బికెల్లో రైతులతో సమావేశమై ఊకదంపుడు ఉపన్యాసాలే ఇచ్చారు తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదని రైతులు ఎద్దేవా చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులైన మిల్లర్ల పై చర్యలు తీసుకు సక్రమంగా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

దళారులదే హవా

మిల్లర్లు అదనంగా ధాన్యం తీసుకోవడంతో పాటు డబ్బులు వెంటనే చెల్లించకపోవడం, తరలింపునకు అధనపు భారం పడటంతో రైతులు దళారుల వైపు మొగ్గు చూపుతున్నారు. దళారులు ప్రభుత్వం ధర కంటే తక్కువే ఇచ్చినా నేరుగా కళ్లాలకు వచ్చి ధాన్యం తరలించుకోవడంతో పాటు డబ్బులు వెంటనే చెల్లించేయడంతో చాలా మంది రైతులు దళారులకే ఇచేస్తున్నారు. దీంతో వారి హవా కొనసాగుతోంది.

అదనపు కేజీలు తీసుకుంటున్నారు.

మిల్లర్లు 80 కేజీలకు బదులుగా 87 నుంచి 90 కేజీల వరకు ధాన్యం అదనంగా తీసుకుంటున్నారు. ప్రశ్నిస్తే తిరిగి పంపించేస్తున్నారు. అధికారులు పర్యవేక్షణ కొరవడింది. తిరిగి వచ్చిస్తే వ్యయ ప్రయాసాలు తప్పవన్న బాధతో మిల్లర్లు డిమాండ్ మేరకు అదనంగా ధాన్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఇది చాలా ఘోరంగా ఉంది. పరిస్థితి మారకపోతే రైతు చాలా నష్టపోతాడు.

దాలినాయుడు, రైతు, సంకిలి.

మిల్లర్లుపై నిఘా ఉంచాలి

పారంపేట, కెఎం.వలస, కోడిశ, సోమరాజుపేట గ్రామాల్లో రైస్ మిల్ యాజమాన్యం రైతుల వద్ద అదనంగా ధాన్యం తీసుకుంటున్నాయి. రైతులను మోసం చేయకుండా మిల్లర్లపై అధికారులు నిఘా ఉంచాలి. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. రైతుకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అధికారులు మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి.

నారు జనార్ధన రావు, రైతు సంఘం అధ్యక్షులు

మా దృష్టికి రాలేదు

రైతుల వద్ద నుంచి మిల్లర్లు అదనంగా ఏడు నుంచి పది కేజీలు తీసుకుంటున్న విషయం మా దృష్టికి రాలేదు.. సిఎస్‌డిటి కామేశ్వరరావుకు బాధ్యతలు అప్పగించాం. పరివేక్షణ తరువాత విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

సుదర్శన్ రావు, తహశీల్దార్, రేగిడి

ఆర్‌బికెల్లో కొనుగోలు చేస్తున్నాం

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. మిల్లర్లకు రైతుల ద్వారా పంపిస్తున్నాం. మిల్లర్లు అదనంగా ధాన్యం వసూలు చేస్తున్నట్లు మా దృష్టికీ వచ్చింది. కానీ సమస్యను పరిష్కరించే అధికారం మాకు లేదు. సిఎస్‌డిటి, డిఎస్‌ఒలు చర్యలు తీసుకోవాలి.

'నీ స్థాయి ఎంత?' అంటూ ఆగ్రహం.. కలెక్టర్‌పై బదిలీ వేటు



భోపాల్: 'హిట్ అండ్ రన్' కేసులకు సంబంధించి 'భారత న్యాయ సంహిత'లోని నిబంధనలపై ట్రక్కు డ్రైవర్లు ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మధ్యప్రదేశ్‌లోని శాజాపుర్ జిల్లాలో డ్రైవర్ల సంఘం ప్రతినిధులతో స్థానిక కలెక్టర్ వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. 'నీ స్థాయి ఎంత?' అంటూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడంతో.. రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. బుధవారం నాడు ఆయనపై బదిలీ వేటు వేసింది. తమ పాలనలో ఇటువంటి భాష సహించేదే లేదని సీఎం మోహన్ యాదవ్ హెచ్చరించారు. ఆందోళనల నేపథ్యంలో మంగళవారం ఓ డ్రైవర్ల సంఘం ప్రతినిధులతో శాజాపుర్ కలెక్టర్ కిశోర్ కన్యాల్ సమావేశమయ్యారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దంటూ వారిని హెచ్చరించారు. అంతలోనే.. తమతో సరిగ్గా మాట్లాడాలంటూ ఓ ప్రతినిధి కోరాడు. దీంతో ఆగ్రహానికి గురైన కలెక్టర్.. 'నువ్వేం చేయగలవు? నీ స్థాయి ఎంత?' అంటూ విరుచుకుపడ్డారు. ఏ 'స్థాయి' లేనందునే తాము ఈ పోరాటం చేస్తున్నామని ప్రతినిధి బదులిచ్చాడు. ఇద్దరి మధ్య వాగ్వాదానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అనంతరం ఈ ఘటనపై కలెక్టర్ విచారం వ్యక్తం చేశారు.

రవాణా ఉక్కిరిబిక్కిరి

ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఆదేశాల మేరకు కన్యాల్‌ను కలెక్టర్ పదవి నుంచి తొలగించినట్లు సీఎం కార్యాలయం బుధవారం ప్రకటించింది. ఆయన్ను రాష్ట్ర డిప్యూటీ సెక్రెటరీగా బదిలీ చేసింది. నర్సింగపుర్ కలెక్టర్ రిజు బఫ్నాను కొత్త కలెక్టర్‌గా నియమించింది. "ఈ ఘటన బాధపెట్టింది. నేనూ ఓ కూలీ కుమారుడినే. ఎంత పెద్ద అధికారి అయినా.. పేదల పనిని, వారి మనోభావాలను గౌరవించాలి. ఇటువంటి భాషను సహించదు. ఇలాంటి అధికారులకు విధులు నిర్వహించే అర్హత లేదు' అని సిఎం యాదవ్ పేర్కొన్నారు.

మన్యం కాఫీకి అవార్డు

ప్రజాశక్తి-పాడేరు

అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన పాడేరు కాఫీకి మరో అవార్డు దక్కింది.అరకు కాఫీకి ఒక జిల్లా ఒక పంట అవార్డు దక్కింది. 2023 అక్టోబరు నెలలో కేంద్ర బృందం ఏజెన్సీలో పర్యటించి గిరిజన ప్రాంతంలో సేంద్రీయ విధానాలు సాగు చేస్తున్న కాఫీ పంటను పరిశీలించింది. ఒక జిల్లా ఒక పంట 2023 అవార్డుకు ఎంపికైంది. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ చేతుల మీదుగా జిసిసి వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ జి.సురేష్ కుమార్ అవార్డును స్వీకరించారు. ఢిల్లీలోని భారత్ మండపం ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ కన్వెన్షన్ సెంటర్ లో బుధవారం జరిగిన అవార్డుల ప్రధాన కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు కాఫీ పంటకు ఒక జిల్లా ఒక పంట అవార్డు దక్కింది.

సంజయ్ లేని డబ్ల్యుఎఫ్ఐ ఆమోదమే : సాక్షి మాలిక్

న్యూఢిల్లీ : సంజయ్ సింగ్ లేకుండా రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) నూతన పాలకవర్గంతో తనకు ఎలాంటి సమస్యలు లేవని రెజ్లర్ సాక్షి మాలిక్ బుధవారం స్పష్టం చేశారు. గతేడాది డిసెంబర్ 21న బ్రిజ్ భూషణ్ సన్నిహితుడు సంజయ్‌సింగ్ డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్ర కటన వెలువడిన వెంటనే .. అతనిని వ్యతిరేకిస్తూ సాక్షి మాలిక్ రెజ్లింగ్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. డబ్ల్యుఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ మద్దతుదారుల నుండి తన తల్లికి కూడా బెదిరింపు ఫోన్‌కాల్స్ వచ్చాయని తెలిపారు. తమ కుటుంబ సభ్యుల్లో ఒకరిపై కేసు కూడా నమోదు చేస్తామని బ్రిజ్ భూషణ్ గూండాలు బెదిరిస్తున్నారని అన్నారు. సంజయ్ సింగ్‌ను డబ్ల్యుఎఫ్ఐకి దూరంగా ఉంచినట్లైతే.. నూతన పాలకవర్గంతో తమకు ఎలాంటి సమస్యలు లేవని స్పష్టం చేశారు. అడ-హక్ కమిటీతో తమకు ఎలాంటి సమస్యలేదని మీడియాకి తెలిపారు. ప్రభుత్వం తమకు తల్లిదండ్రుల వంటిదని, రాబోయే యువ రెజ్లర్లకు రెజ్లింగ్ సురక్షితంగా ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నానని సాక్షి మాలిక్ పేర్కొన్నారు. సంజయ్ సింగ్ ఎలా ప్రవర్తిస్తున్నాడో మీరూ చూశారు కదా అని మీడియాని ప్రశ్నించారు.

కలుషిత ఆహారం తిని 39 మంది ఆశ్రమ విద్యార్థినులకు అస్వస్థత

చింతూరు ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు



ప్రజాశక్తి-చింతూరు
(అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం, బొడ్డుగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం కలుషిత ఆహారం వల్ల 39 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరంతా ప్రస్తుతం చింతూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి....

బొడ్డుగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు మంగళవారం మధ్యాహ్నం భోజనం చేశారు. తరువాత సాయంత్రం సమయంలో 12 మంది విద్యార్థులు తీవ్రంగా వాంతులు, కడుపునొప్పితో బాధపడుతుండటంతో వారిని ఏడుగురాళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యురాలు విశ్వచైతన్య, సిబ్బంది వారికి వెంటనే వైద్యం అందించారు. తరువాత వైద్యురాలు ఆశ్రమ పాఠశాలను సందర్శించగా, అక్కడ సిక్ రూంలో మరో 12 విద్యార్థినులు తీవ్ర అస్వస్థతతో ఉండడాన్ని గమనించి వారిని కూడా ఆసుపత్రికి తరలించారు. వారిలో చాలా మంది జ్వరంతో పాటు వాంతులు, కడుపునొప్పితో బాధపడుతున్నారు. ఇది ఇలా ఉండగా, రాత్రి భోజనం తరువాత మరో 15 మంది బాలికలు తలనొప్పి వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో అధికారుల ఆదేశాల మేరకు వీరిని వెంటనే చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య శాఖ చర్యలు చేపట్టింది. జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పులయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ఐటిడిఎ పిఒ ఆదేశాల మేరకు ఏడుగురాళ్ళపల్లి పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న 24 మందిని బుధవారం ఉదయం చింతూరు ఆసుపత్రికి తీసుకొచ్చారు. వీరందరూ ప్రస్తుతం చింతూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మధ్యాహ్నం పప్పు, బంగాళదుంపల కూరలతో భోజనం పెట్టారు. సాయంత్రం సమయంలో మజ్జిగ ఇచ్చారు. అది తాగిన కొద్ది సమయానికే విద్యార్థినులకు వాంతులు మొదలై తీవ్ర అస్వస్థకు గురైనట్లు తెలుస్తోంది. ఆహారం కలుషితం కావడం వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు చెప్పారు.

ఉడకని భోజనం పెడుతున్నారు

బొడ్డుగూడెం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న మీడియా వారు రాత్రి హాస్టల్ సందర్శించి భోజనాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమకు పెట్టే భోజనం సారిగా ఉండడం లేదన్నారు. ఎప్పుడైనా ఎవరైనా అధికారులు వచ్చినప్పుడు మాత్రమే మంచిగా వండి పెడుతున్నారని, మిగతా రోజుల్లో ఉడికీ ఉడకని భోజనం పెడుతున్నారని వాపోయారు. దోమలు ఎక్కువగా ఉంటున్నాయని, మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేదని, భోజనశాల అపరిశుభ్రంగా ఉందని చెప్పారు. మరో వైపు తీవ్ర అస్వస్థతతో ఉన్న కొంత మంది విద్యార్థినులను హాస్పటల్‌కి తరలించకుండా పాఠశాల సిబ్బంది తీవ్ర నిర్లక్షంతో సిక్ రూమ్‌లో ఉంచడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐటిడిఎ పిఒ సందర్శన

సమాచారం అందుకున్న చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య బుధవారం ఆశ్రమ హాస్టల్‌ను, విద్యార్థినులు చికిత్స పొందుతున్న ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. విద్యార్థినుల అస్వస్థతకు గల కారణాలపై ఆరా తీశారు. అస్వస్థకు గురైన బాలికలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం లేకపోవడంతో అధికారులు, హాస్టల్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, బాలికల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

- తిరువూరులో రణరంగం
- ఎస్‌ఐకు గాయాలు
- కేశినేని బ్రదర్స్ మధ్య ఆధిపత్య పోరు


కుర్చీలు విసిరి వేస్తున్న ఎంపి అనుచరులు

ప్రజాశక్తి - తిరువూరు

తెలుగు తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు కుర్చీలను, చెప్పులు, బకెట్లు విసురుకున్నారు. ఎస్‌ఐకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ నెల ఏడున ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు బహిరంగ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ స్థాయి సమావేశంతో ఈ రణరంగం చోటు చేసుకుంది. పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం, పలువురు రాష్ట్ర నాయకులతోపాటు ఆ పార్టీకి చెందిన విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని), ఆయన సోదరుడైన కేశినేని చిన్ని, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహనరావు హాజరయ్యారు. సాయంత్రం నాలుగు గంటలకు ఎంపి కేశినేని నాని టిడిపి కార్యాలయానికి తన అనుచరులతో వచ్చారు. సమావేశం జరిగే వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎంపి నాని ఫొటో చిన్నదిగాను, చిన్ని ఫొటో పెద్దదిగాను ఉంది. దీంతో ఎంపి నాని అనుచరులు గొడవకు దిగారు. ఆ ఫ్లెక్సీని చించిన "జై నాని" అంటూ నినాదాలు చేశారు. కుర్చీలను పైకి విసిరేశారు. అనంతరం కేశినేని చిన్నిని పార్టీ కార్యాలయంలోకి రానివ్వకుండా గేటు బయట ఎంపి అనుచరులు బైటాయించారు. చిన్ని తన అనుచరులతో కార్యాలయంలోకి వెళుతుండగా అడ్డుకున్నారు. ఈ క్రమంలో రెండు గ్రూపుల మధ్య తోపులాట జరిగింది. పోలీసుల సహకారంతో ఎట్టకేలకు చిన్ని పార్టీ కార్యాలయంలోకి వెళ్లారు. దీంతో "గో బ్యాక్ చిన్ని" అంటూ నాని అనుచరులు నినాదాలు చేశారు. చిన్ని కూడా తన అనుచరులతో కలిసి అక్కడే కింద కూర్చున్నారు. "జై ఎన్‌టిఆర్, జై చంద్రబాబు, జై కేశినేని చిన్ని" అంటూ ఒకవైపు, "జై కేశినేని నాని" అంటూ మరోవైపు నినాదాలతో టిడిపి కార్యాలయం దద్దరిల్లింది. చిన్ని బయటకు వెళ్లాలంటూ ఎంపి అనుచరులు కుర్చీలు విసిరేశారు. ఈ క్రమంలో కార్యాలయంలో ఉన్న నాని బయటకు వచ్చారు. చిన్ని ఎలాగైనా ఆఫీసులోకి వెళ్లేందుకు ప్రయత్నించగా రెండు గ్రూపుల మధ్య తీవ్రమైన తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు వారిని అదుపు చేస్తున్న క్రమంలో ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకోవడంతో ఓ కుర్చీ బలంగా ఎస్‌ఐ సతీష్ తలకు తగిలింది. రక్తం రావడంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఎంపి నాని తన అనుచరులతోను, చిన్ని తన అనుచరులతో పోటాపోటీగా బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో సిఐ లాఠీఛార్జికి ఆదేశించారు. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో చిన్నిని బయటకు పంపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసుతో ఎంపి సమావేశం నిర్వహించారు.

భగవద్గీత పేరుతో స్వార్థప్రయోజనాలు ప్రచారం

- ఎంవిఎస్ శర్మ



భగవద్గీత, అరుణ తారలు, తదితర పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

భగవద్గీత భారతీయ సంస్కృతిలోని వివిధ మత భావనలను క్రోడీకరించిన గ్రంథమని మాజీ శాసనమండలి సభ్యులు, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎంవిఎస్ శర్మ అన్నారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవం ఏడో రోజు బుధవారం జేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై విశాలాంధ్ర వారి పుస్తకావిష్కరణ సభను నిర్వహించారు. 'భగవద్గీత- ఒక అవలోకన' గ్రంథాన్ని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీతను భగవంతుని వాక్కుగా కాకుండా ఒక చారిత్రక ఆధారంగా పరిశీలించాలని సూచించారు.

సనాతనధర్మం, భగవద్గీత ఒకటే బోధించాయనే విషయం పూర్తిగా నిజం కాదన్నారు. భూస్వామ్య వ్యవస్థ మొదలైన తొలినాళ్లలో అప్పటికే అమలులో ఉన్న గణతంత్ర, సమిష్టి భావనలకు వ్యతిరేకంగా, భూస్వామ్య వ్యవస్థను బలపరిచేందుకు భగవద్గీత ఆవిర్భవించిందన్నారు. మారుతున్న కాలంతో పాటు, ధర్మాలు కూడా మారుతుంటాయి కనుక భగవద్గీతను ఆ దృష్టితో చూడాలని తెలిపారు. ప్రస్తుతం ఒక మత ప్రయోజనం కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం భగవద్గీతను ప్రజల వద్దకు తీసుకువెళ్లేందుకు విపరీతమైన ప్రయత్నం జరుగుతోందన్నారు. భగవద్గీత పేరుతో సమాజంలోని అసమానతలను దేవుడే సృష్టించాడని చెప్పడం అన్యాయమని తెలిపారు. అలాగే పని మీదే కానీ ఫలితం మీద ఆశలు వదులుకోవాలని చెప్పడం కూడా తగదన్నారు. అనంతరం 'అరుణ తారలు' పుస్తకాన్ని ప్రజానాట్యమండలి గౌరవ సలహాదారు నల్లూరు వెంకటేశ్వర్లు, 'పెరియార్ ఇ. వి. రామస్వామి నాయకర్ రాజకీయజీవితం' పుస్తకాన్ని విశాలాంధ్ర విజ్ఞాన సమితి కోశాధికారి జి. ఓబులేసు, రెంటాల శ్రీనివాసరావు అనువదించిన 'భారతీయ నాస్తికవాదం' పుస్తకాన్ని విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి. హరనాథ్ రెడ్డి ఆవిష్కరించారు. సమితి సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించగా విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజరు మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

టిడిపిలోకి విజయసాయిరెడ్డి బావమరిది

- చంద్రబాబు సమక్షంలో ద్వారకానాథ్ రెడ్డి చేరిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి బావమరిది, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకానాథ్‌రెడ్డి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. టిడిపి కార్యాలయంలోని ఎన్‌టిఆర్ భవన్‌లో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు వైసిపి ఎమ్మెల్సీ సి రామచంద్రయ్య, దాడి వీరభద్రారావు, బాపట్ల, అనంతపురం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని పలు నియోజకవర్గాలకు చెందిన పలువురు చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు.

ఎమ్మెల్యేలు తప్పుచేస్తే ఏం చేశావు? : చంద్రబాబు

ఐదేళ్లుగా ఎమ్మెల్యేలు తప్పు చేసి ప్రజల మద్దతు కోల్పోతే ఏం చేశారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చంద్రబాబు ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏమి చేసిందని నిలదీశారు. వైసిపి నేతల అవినీతి, అక్రమాలపై ఎవరు మాట్లాడినా దాడులు చేసి కేసులు పెట్టారని అన్నారు. ఎక్కడ చూసినా దందాలు, దోపిడీలే అని విమర్శించారు. 'తప్పు చేసిన ఎమ్మెల్యేలను ఎప్పుడైనా పిలిచి ఇది తప్పు' అని చెప్పారా? అని నిలదీశారు. జగన్ రూ.12 లక్షల కోట్లు అప్పు చేసినా రాష్ట్రంలో అభివృద్ధి అన్నమాటే లేదన్నారు. విశాఖలో యువతిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారని, రాష్ట్రంలో శాంతి భద్రతలపై సిఎం పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, గురుకులాల సిబ్బంది రోడ్లపైకి వస్తే బెదిరిస్తున్నారని తెలిపారు.



టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. టిడిపి-జనసేన కూటమి 160 స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరేందుకు చాలా మంది ఫోన్లు చేస్తున్నారని, తాము తలుపులు తెరిస్తే వైసిపిలో ఒక్కరు కూడా మిగలరని అన్నారు. రామచంద్రయ్య మాట్లాడుతూ.. రాష్ట్రం మళ్లీ కోలుకోలేని విధంగా అప్పులపాలు చేశారని విమర్శించారు. దాడి వీరభద్రరావు మాట్లాడుతూ.. సిఎం జగన్.. ప్రజలను భిక్షగాళ్లల్లా మారుస్తున్నారని విమర్శించారు. జగన్ తన పార్టీ కార్యాలయంలో కొంతమందిని ఏజెంట్లుగా పెట్టుకుని కలెక్షన్లు రాబడుతున్నారని ద్వారకనాథ్‌రెడ్డి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, ఉండవల్లి శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవింద్, ప్రభాకర్ చౌదరి, యరపతనేని శ్రీనివాస్, కాల్వ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి చేనేతకు కేంద్రం అవార్డు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

మంగళగిరి చేనేత చీరలు, ఫ్యాబ్రిక్స్‌కు కేంద్ర ప్రభుత్వ ఒన్ డిస్ట్రిక్ ఒన్ ప్రోడక్ట్ జాతీయ స్పెషల్ మెన్షన్ అవార్డు లభించింది. ఢిల్లీలోని ప్రగతి మైదానంలో కామర్స్ ఇండస్ట్రీయల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవార్డుల ప్రదానోత్సవంలో విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్, కేంద్ర మంత్రి పియూష్ గోయల్ నుండి అవార్డును కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అందుకున్నారు.

మోడీ సెల్ఫీ ఖర్చు చెప్పాడని బదిలీ చేశారు

- సెంట్రల్ రైల్వే సీపీఆర్ఓకు 'బహుమతి'

న్యూఢిల్లీ : రైల్వే స్టేషన్లలో ప్రధాని నరేంద్ర మోడీ '3డీ సెల్ఫీ పాయింట్ల'ను ఏర్పాటు చేసినందుకు ఎంత ఖర్చు అయిందో చెప్పడమే ఆయన చేసిన నేరం. బహుమతిగా ఆ అధికారిపై బదిలీ వేటు వేశారు. రైల్వే స్టేషన్లలో ప్రధాని కటౌట్లతో ఏర్పాటుచేసిన సెల్ఫీ పాయింట్ల కోసం ఎంత ఖర్చు చేశారో చెప్పాలంటూ సామాజిక కార్యకర్త అజయ్ బోస్ సమాచార హక్కు చట్టం కింద దేశంలోని ఐదు రైల్వే జోన్లకు దరఖాస్తులు పంపారు. సెంట్రల్ రైల్వేకి చెందిన సీపీఆర్ఓ శివరాజ్ మన్స్‌ప్యూర్ ఈ దరఖాస్తుకు సమాధానం పంపారు. అదే ఆయన చేసిన నేరం...పదవీకాలం మరో రెండు సంవత్సరాలు ఉండగానే శివరాజ్‌కు బదిలీ ఉత్తర్వులు అందజేశారు. 2011 బ్యాచ్‌కి చెందిన ఐఆర్‌టీఎస్ అధికారి శివరాజ్ సెంట్రల్ రైల్వే పీఆర్ఓగా గత సంవత్సరం మేలోనే బాధ్యతలు స్వీకరించారు. ఎలాంటి కారణం చూపకుండానే ఆయనను డిసెంబర్ 29న సెంట్రల్ రైల్వే ముంబయి కేంద్ర కార్యాలయం బదిలీ చేసింది. తదుపరి పోస్టింగుపై కూడా ఆయనకు ఇప్పటివరకూ సమాచారం ఇవ్వలేదు. శివరాజ్ స్థానంలో స్వప్నిల్ డి నీలాను నియమించారు. అయితే ఇక్కడ గమనించాల్సిన ఆసక్తికరమైన విషయం ఒకటుంది. శివరాజ్ బదిలీకి ఒక రోజు ముందు...అంటే డిసెంబర్ 28న జనరల్ మేనేజర్లు, డివిజనల్ రైల్వే మేనేజర్లకు రైల్వే బోర్డు ఓ సమాచారం పంపింది. ఆర్‌టీఐ కింద కోరే సమాచారానికి సమాధానం ఇచ్చే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలంటూ అందులో సుద్దులు చెప్పింది.

ఇచ్చిన ఉద్యోగాల వివరాలు సేకరణ

- అన్ని శాఖలకూ ప్రభుత్వం ఆదేశాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్నికల వేళ కల్పించిన ఉద్యోగాలపై ప్రభుత్వం లెక్కలు తీస్తోంది. రెగ్యులర్ ఉద్యోగాలే కాకుండా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో ఇచ్చిన ఉద్యోగాల వివరాలు కూడా సేకరిస్తోంది. ఈ మేరకు అన్ని శాఖలకూ సాధారణ పరిపాలనశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రధానంగా 2019లో జగన్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఇచ్చిన ఉద్యోగాల వివరాలు సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

జిల్లాల్లోని ఉపాధి కల్పన కార్యాలయాల ద్వారా ఈ వివరాలు సేకరించి, ఏయే శాఖల్లో ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నది చెప్పాలని ప్రభుత్వం కోరింది. ఇందులో కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్దేశించింది. ఎపిపిఎస్‌సి, కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా జరిగిన నియామకాలు, రాష్ట్ర మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా జరిగినవి, పలు శాఖల్లో జరిగిన కారుణ్య నియామకాల వివరాలు, రెగ్యులర్ చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగుల వివరాలతోపాటు, నేరుగా నియామకాలు జరిగే ఉపాధ్యాయులు, పోలీస్, ఎక్సైజ్, పంచాయతీరాజ్, విఆర్ఒ, విఆర్ఎ, ఆర్‌టిసిలో కండక్టర్లు, డ్రైవర్లు, అటవీశాఖలో జరిగిన ఉద్యోగాల వివరాలు చెప్పాలని నిర్దేశించింది. అలాగే ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, నేరుగా ఉపాధి కల్పన కార్యాలయాల ద్వారా జరిగిన పోస్టుల భర్తీ వివరాలు చెప్పాలని పేర్కొంది. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాల్లో ఏయే శాఖల్లో ఎంతమందిని నియమించారన్నది కూడా స్పష్టం చేయాలని పేర్కొంది. ఉద్యోగాల కల్పన సమయంలో తప్పనిసరిగా అభ్యర్థుల పేర్లు స్థానిక ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌ల్లో పొందుపరచాల్సి ఉంటుందని, ఆ వివరాలు కూడా సమర్పించాలని సాధారణ పరిపాలనశాఖ కోరింది. ఇందుకుగానూ అన్ని శాఖలకూ ఒక ప్రత్యేక నమోనాను కూడా పంపింది. దీని ఆధారంగానే వివరాలు సమర్పించాలని నిర్దేశించింది.

మొదటి సారి స్పేస్ ఎక్స్ ద్వారా భారత్ శాటిలైట్ ప్రయోగం

న్యూఢిల్లీ : భారత్ ఉపగ్రహం జిశాట్ -20ని స్పేస్ ఎక్స్ ద్వారా ప్రయోగించేందుకు సిద్ధమైంది. తరువాతి తరానికి సంబంధించిన భారీ కమ్యూనికేషన్స్ శాటిలైట్ జిశాట్ -20ని ప్రయోగించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ మరియు ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)లు మొదటిసారిగా ఫాల్కన్ -9 రాకెట్‌ను వినియోగించనుంది. భారత్ ప్రత్యేక మిషన్‌లో భాగంగా ఫ్లోరిడా నుండి ఈ ప్రయోగం చేపట్టనుంది.జిశాట్ -20 శాటిలైట్ బరువు 4,700కేజీలు. హెచ్‌టిఎస్ సామర్థ్యం సుమారు 48 జిపిబిఎస్‌గా ఉంటుంది. రిమోట్/అనుసంధానం కాని ప్రాంతాలకు సేవలను అందించేందుకుగాను ప్రత్యేకంగా ఈ శాటిలైట్‌ను రూపొందించారు. సమయానికి మరే రాకెట్ స్పేస్ అందుబాటులో లేనందున స్పేస్ ఎక్స్‌తో ఒప్పందం చేసుకోవాల్సి వచ్చిందని ఇస్రో చైర్మన్ ఎస్.సోమ్‌నాథ్ తెలిపారు. ఈ ఏడాది రెండో త్రైమాసికంలో రాకెట్ ప్రయోగం కోసం ఇస్రో వాణిజ్య విభాగం ' న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ ' (ఎన్‌ఎస్ఐఎల్) స్పేస్ ఎక్స్‌తో ఓ ఒప్పందం చేసుకుంది. ఇప్పటివరకు భారీ ఉపగ్రహాలను ప్రయోగించేందుకు భారత్ ఫ్రాన్స్‌కి చెందిన ఏరియన్ స్పేస్ కన్సార్టియంపై ఆధారపడింది.

అమల్లో ఇంకా పాత జోనల్ రూల్సే..

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేసినప్పటికీ ఇంకా గతంలోని పాత జోనల్ రూల్సే అమల్లో ఉన్నాయని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. దీంతో విద్యా, ఉపాధి అవకాశాల్లో ఏ ఒక్కరూ నష్టపోరని ప్రభుత్వం తరపున ఎజి ఎస్ శ్రీరామ్ చెప్పారు. కొత్త జిల్లాల ఏర్పాటు రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధమని, అందువల్ల సంబంధిత జిఓలను కొట్టేయాలని కోరుతూ గుంటూరు, ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన దొంతినేని విజయ్‌కుమార్ ఇతరులు దాఖలు చేసిన పిల్స్‌ను బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. సంక్రాంతి సెలవుల తర్వాత విచారణ కొనసాగిస్తామని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆస్పత్రిలో సేవ చేయండి

ఎత్తు విషయంలో పోలీసు నియామక బోర్డుపై తప్పుడు ఆరోపణలు, కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చిన అభ్యర్థులకు నెల రోజుల సామాజిక సేవను శిక్షగా హైకోర్టు విధించింది. నెల రోజులపాటు ప్రభుత్వాస్పత్రిలో సేవ చేయాలని, ఈ మేరకు ధ్రువీకరణ పత్రాలు కూడా తీసుకుని హైకోర్టుకు అందజేయాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. ఎత్తు కొలతపై పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలతో హైకోర్టులో వారికి కొలతలు కొలిపించింది. పిటిషనర్ల వాదన వాస్తవం కాదని తేలింది. దీంతో ఆరుగొళ్ల దుర్గాప్రసాద్‌తోపాటు మరో 23 మందికి సామాజిక శిక్ష విధించింది.

పిటిషన్‌ను సవరించండి

తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, సిబిఐ ఎస్‌పి రాంసింగ్ దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు విచారణ జరిపింది. ఈ మూడు పిటిషన్లకు విచారణార్హత లేదని, కోర్టు ఆదేశిస్తేనే పోలీసులు కేసు నమోదు చేశారని, పులివెందుల పోలీసులు సంబంధిత కోర్టులో చార్జిషీట్ కూడా వేశారని స్పెషల్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూరా వెంకట సాయినాథ్ వాదించారు. కేసు కొట్టేయాలన్న అభ్యర్థనను సవరించి, చార్జిషీట్‌ను కూడా కొట్టేయాలని కోరాలని పిటిషనర్లకు హైకోర్టు సూచన చేసింది. ఇందుకు పిటిషనర్ల న్యాయవాదులు అంగీకరించారు. దీంతో విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తూ జస్టిస్ బి భానుమతి ఉత్తర్వులు జారీ చేశారు.


విధులు నిర్వహిస్తున్న రాష్ట్రాల్లోనే కొనసాగవచ్చు

● ఐఎఎస్, ఐపిఎస్‌లకు హైకోర్టులో ఊరట

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్యాట్ ఉత్తర్వులతో తెలంగాణలో కొనసాగుతున్న ఐఎఎస్, ఐపిఎస్‌లకు హైకోర్టులో ఊరట లభించింది. కేటాయింపులపై అభ్యంతరాలున్న అఖిలభారత సర్వీసు అధికారుల విజ్ఞప్తులను మరోసారి పరిగణనలోకి తీసుకొని తిరిగి కేటాయింపులు జరపాలని హైకోర్టు ధర్మాసనం బుధవారం కేంద్రాన్ని ఆదేశించింది. అప్పటి వరకు ఆయా ఐఎఎస్, ఐపిఎస్‌లు ప్రస్తుతం విధులు నిర్వహిస్తోన్న రాష్ట్రాల్లోనే కొనసాగొచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. విభజన సమయంలో ఎపికి కేటాయించినా.. కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ ఉత్తర్వులతో 13 మంది ఐఎఎస్ అధికారులు తెలంగాణలోనే కొనసాగుతున్నారు. క్యాట్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అఖిల భారత సర్వీసు అధికారుల కేటాయింపు విషయంలో క్యాట్ తన పరిధి దాటి వ్యవహరించిందని అదనపు సోలిసిటర్ జనరల్ నరసింహాశర్మ కోర్టుకు తెలిపారు. కేటాయింపు సమయంలో కేవలం ప్రత్యూషసిన్హా కమిటీ నిర్దేశకాలను పరిగణనలోకి తీసుకున్నారని.. ర్యాంకు, స్థానికత, రిజర్వేషన్, పదోన్నతి వంటి విషయాలను పట్టించుకోలేదని పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు హైకోర్టుకు తెలిపారు. సివిల్స్ ద్వారా ఎంపికైన వారికి... పదోన్నతుల ద్వారా వచ్చిన అధికారులను ఒకే విధంగా పరిగణించి కేటాయింపులు చేశారని న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపున వాదనలు విన్న ధర్మాసనం క్యాట్ ఉత్తర్వులను కొట్టేసింది. అధికారుల కేటాయింపు కేవలం డిఒపిటి పరిధిలోనే ఉంటుందని తెలిపింది. కేటాయింపులపై క్యాట్ ఉత్తర్వులు ఇవ్వకుండా డిఒపిటిని ఆదేశించి ఉండాల్సిందని న్యాయస్థానం అభిప్రాయం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం తిరిగి కేటాయింపులు జరిపే వరకు ఐఎఎస్ అధికారులు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రాష్ట్రాల్లోనే ఉండొచ్చని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

కోవిడ్‌తో దేశంలో ఐదుగురు మృతి



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా బుధవారం నాటికి గడిచిన 24 గంటల్లో కోవిడ్‌తో ఐదుగురు మరణించారు. ఈ విషయాన్ని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సిడిసి) తెలిపింది. జెఎన్.1 సిరీస్ వేరియంట్‌కి సంబంధించి మంగళవారానికి మొత్తంగా 11 రాష్ట్రాల్లో 511 కేసులు నమోదయ్యాయి. ఇందులో కర్ణాటకలో 199, కేరళలో 148, గోవాలో 47, గుజరాత్ 36, మహారాష్ట్ర 32 కేసులు నమోదయ్యాయి. గత 24గంటల్లో 602 కొత్త కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రస్తుతం దేశంలో యాక్టివ్‌గా వున్న కేసుల సంఖ్య 4,440గా వుంది. గత 24గంటల్లో 722మంది కోలుకున్నారు. తాజాగా మరణించిన ఐదుగురిలో ఇద్దరు కేరళలో మృతి చెందారు. ఇప్పటికే ఇతర వ్యాధులతో బాధపడుతున్న 66 ఏళ్ళ వృద్ధుడు, 79 ఏళ్ళ వృద్ధురాలుగా వీరిలో వున్నారు. హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్న 45 ఏళ్ళ వ్యక్తి ఒకరు కర్ణాటకలో చనిపోయారు. పంజాబ్, తమిళనాడుల్లో మరో ఇద్దరు మరణించారు. కోవిడ్ సబ్ వేరియంట్ జెఎన్.1 చాలా వేగంగా వ్యాప్తి చెందుతోందని, అపోలో ఆస్పత్రికి చెందిన డాక్టర్ రాజేష్ చావ్లా తెలిపారు.

సమన్లకు సరైన కారణం చూపలేదు

● ఇడిపై కేజ్రీవాల్ ఫైర్

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు దర్యాప్తులో భాగంగా ఢిల్లీ ముఖ్యమంత్రికి ఇడి జారీ చేసిన సమన్లను బుధవారం మూడోసారి కూడా అరవింద్ కేజ్రీవాల్ తోసిపుచ్చారు. తనకు సమన్లు జారీ చేసేందుకు దర్యాప్తు సంస్థ సహేతుక కారణం వెల్లడించలేదని ఇడికి రాసిన లేఖలో కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఇడి ఈ అంశంలో అనవసరమైన గోప్యతను పాటిస్తోందని, ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తనను విచారణకు పిలవడం వెనుక నిజమైన ఉద్దేశం, పరిధి, స్వభావం, విస్తృతిని అర్థం చేసుకోవడానికి తనకు వీలు కల్పించే పరిస్థితిని స్పష్టం చేయాల్సిందిగా అరవింద్ కేజ్రీవాల్ ఈ లేఖలో కేంద్ర ఏజెన్సీని కోరారు. మరోవైపు ఇడి సమన్లపై ఆప్ తీవ్రంగా స్పందించింది. ఈ నోటీసులు అక్రమమని, తమ పార్టీ అధినేతను అరెస్ట్ చేసే ఉద్దేశంతోనే వాటిని ఇచ్చారని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. అయితే, దర్యాప్తు సంస్థలకు సహకరించేందుకు కేజ్రీవాల్ సిద్ధంగా ఉన్నారని తెలిపింది.

సోరెన్ మీడియా సలహాదారు నివాసంపై ఇడి దాడులు

రాంచి : జార్ఖండ్ రాష్ట్రంలో అక్రమ గనుల తవ్వకాలు, మనీ లాండరింగ్ వ్యవహారాలపై దర్యాప్తులో భాగంగా ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మీడియా సలహాదారు అభిషేక్ ప్రసాద్ అలియాస్ పింటూ నివాసంపై, సాహిబ్‌గంజ్ జిల్లా కలెక్టర్, ఎస్‌పి, మాజీ ఎంఎల్ఎ పప్పు యాదవ్ నివాసాలపై ఇడి అధికారులు బుధవారం దాడులు చేశారు. కొంతమంది జైలు అధికారులు, పోలీసు కానిస్టేబుల్ నివాసాలపై కూడా దాడులు చోటు చేసుకున్నాయి. రాజధాని రాంచితో సహా మొత్తంగా రాష్ట్రంలో 12కి పైగా ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. రాజస్థాన్‌లో కూడా ఒక నివాసంపై దాడి జరిగింది. పిఎంఎల్ఎ నిబంధనల కింద ఈ దాడులు చేపట్టినట్లు ఇడి అధికారులు తెలిపారు. రాష్ట్రంలో అక్రమ గనుల తవ్వకాల వల్ల వంద కోట్ల రూపాయిల మేరకు లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. వాటిపై 2022 నుండి ఇడి దర్యాప్తు చేపట్టింది. సోరెన్ రాజకీయ సహాయకుడు పంకజ్ మిశ్రా, ఆయన అనుచరుల నివాసాలపై ఇడి దాడుల నేపథ్యంలో మనీ లాండరింగ్ దర్యాప్తు ప్రారంభమైంది. దర్యాప్తులో భాగంగా సేకరించిన సాక్ష్యాధారాలు, డిజిటల్ సాక్ష్యాలు, పత్రాలు బట్టి చూసినట్లైతే నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న మొత్తాలన్నీ అక్రమ గనుల తవ్వకాల నుండి వచ్చినవేనని వెల్లడైందని ఇడి తెలిపింది.

అదానీ కేసు సిట్‌కు బదిలీ చేయలేం

● సెబీ దర్యాప్తులో జోక్యం చేసుకోలేం ● సుప్రీం కోర్టు తీర్పు



న్యూఢిల్లీ : అదాని గ్రూపుపై సెబీ సరిగా దర్యాప్తు చేయడం లేదని, కాబట్టి ఈ కేసును ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్‌కు) బదిలీ చేయాలన్న పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. అదాని కంపెనీల ఆర్థిక అవకతవకలపై అమెరికన్ పరిశోధనా సంస్థ హిండెన్‌బర్గ్, ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఒసిసిఆర్‌పి) చేసిన ఆరోపణలపై సెబీ చేస్తున్న దర్యాప్తులో జోక్యం చేసుకోలేమని చీఫ్ జస్టిస్ డి వై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తేల్చేసింది. సెబి అధికార పరిధికి కూడా పరిమితి ఉందని పేర్కొంది. ఈ పిటిషన్లపై విచారణ గత ఏడాది నవంబరులో పూర్తిచేసిన కోర్టు తన తీర్పును రిజర్వులో ఉంచి, ఇప్పుడు వెల్లడించింది.

పెండింగ్‌లో ఉన్న రెండు కేసులపై దర్యాప్తును మూడు నెలల్లో పూర్తి చేయాలని సెబీని సుప్రీం ఆదేశించింది. అదానీ గ్రూప్ తన షేర్లలో అవకతవకలకు పాల్పడుతోందని, ఖాతాల్లోనూ మోసాలు చేస్తోందంటూ హిండెన్‌బర్గ్ ఓ రిపోర్ట్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. సెబీ రెగ్యులేటరీ ఫ్రేమ్ వర్క్‌లో కల్పించుకునేందుకు అధికారం సుప్రీంకోర్టుకు పరిమితంగానే ఉంటుందని కోర్టు చెప్పింది.. హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలకు సంబంధించి మిగతా కేసుల్లో మూడు నెలల్లోగా దర్యాప్తు పూర్తి చేయాలని సెబీని సుప్రీం ఆదేశించింది. సుప్రీం తీర్పు వెలువడిన తరువాత అదానీ కంపెనీల షేర్లు మార్కెట్‌లో లాభపడ్డాయి.

సుప్రీం తీర్పు నిరాశపరిచింది

సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : అడాని కేసులో నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నిరాశపరిచిందని సిపిఐ(ఎం) విమర్శించింది. ఏ విధంగా చూసినా ఇది దురదష్టకరమైన తీర్పు అని పార్టీ పొలిట్‌బ్యూరో బుధవారం నాడిక్కడ విడుదలజేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. సుప్రీంకోర్టు విశ్వసనీయతను పెంచే తీర్పుగా దీన్ని చూడలేం. అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలపై త్వరితగతిన దర్యాప్తు చేయాల్సిన బాధ్యతను సెబీ వంటి చట్టబద్ధంగా నిర్దేశించిన సంస్థ సరిగా నెరవేర్చలేక పోయింది. 2014లో డీఆర్ఐ అదానీపై వచ్చిన ఆరోపణలను సెబీకి అప్పగించింది. 2021లో అదానీపై వచ్చిన ఆరోపణలపై సెబీ దర్యాప్తు చేస్తోందని ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది. అయితే కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో అటువంటి దర్యాప్తు ఏదీ తాను చేపట్టలేదని సెబీ పేర్కొంది. ఫిర్యాదులపై ఎందుకు చర్యలు చేపట్టలేదని సెబీని ప్రశ్నించాల్సింది పోయి, దర్యాప్తు చేయలేదన్న మాటను ఆ సంస్థ ముఖ విలువగా న్యాయస్థానం తీసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. రెండవది, 'అంతిమ లబ్ధిదారు' ఎవరో దాచడానికి సెబీ తన సొంత నిబంధనలను సైతం మార్చేసింది. ఇది పారదర్శకతను కుదించివేస్తోంది. ఇటువంటి సవరణలు సెబీ చట్టపరమైన అధికారాన్ని ప్రతికూలం గా ప్రభావితం చేసే వాతావరణంలో దర్యాప్తు జరిగింద`ని సుప్రీం కోర్టుచేత నియమించబడిన నిపుణుల కమిటీ కూడా ఎత్తి చూపింది. అయినా, 'అంతిమ లబ్ధిదారు' , విదేశీ పెట్టుబడిదారుల మధ్య సంబంధాన్ని దాచడానికి గోడగా మారిన ఈ సవరణలను సుప్రీంకోర్టు ఆమోదించిందని పేర్కొంది. మూడవది, అత్యంత దురదృష్టకరమైనది నిబంధనల ఉల్లంఘన జరిగిందని హిండెన్‌బర్గ్ రిసెర్చ్ చేసిన ఆరోపణలపై దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకోవడానికి బదులు విజిల్‌బ్లోయర్‌నే శిక్షించేలా ప్రభుత్వానికి బహిరంగ లైసెన్స్‌ను ఈ తీర్పు ఇస్తున్నది. ఈ తరహా విధానం హిండెన్‌బర్గ్ నివేదికను ప్రచురించిన అన్ని మీడియా సంస్థలను ప్రమాదంలోకి నెడుతుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది మొత్తం మీద ఈ తీర్పు సుప్రీం కోర్టు విశ్వసనీయతను పెంచేదిగా లేదని తెలిపింది. .

ప్రత్యామ్నాయ మీడియాపై మరిన్ని బరువు బాధ్యతలు

● గణశక్తి వ్యవస్థాపక వార్షికోత్సవంలో మీడియా నిపుణులు శశికుమార్

కొల్‌కతా: పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి సూచిక. దానిని పరిరక్షించుకోవాల్సిన అవసరమెంతైనా ఉందని ప్రముఖ మీడియా నిపుణులు శశి కుమార్ చెప్పారు. 'ప్రభుత్వం చేస్తున్న పనిలో తప్పులుంటే వాటిని ఎత్తి చూపాల్సిన బాధ్యత కచ్చితంగా తేల్చాల్సిన బాధ్యత మీడియాపై ఉంది. కానీ నేడు పత్రికలు ప్రభుత్వానికి పెంపుడు జంతువుగా మారాయి. అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కోల్‌కతాలో జరిగిన 'గణశక్తి' వ్యవస్థాపక వార్షికోత్సవంలో శశికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోనప్పుడు పత్రికలు మీడియా క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. .పత్రికలు, సోషల్ మీడియాతోపాటు ప్రత్యామ్నాయ మాధ్యమాల్లోనూ ఫేక్ న్యూస్ ప్రబలుతోంది. ఈ పరిస్థితుల్లో బెంగాల్‌లోని 'గణశక్తి' లేదా కేరళలోని 'దేశాభిమాని' వంటి ప్రత్యామ్నాయ మీడియా అవసరం మరింత పెరిగిందని ఆయన అన్నారు. ప్రభుత్వ విధానాల్లోని లోటుపాట్లను ఎత్తి చూపినందుకు 'న్యూస్ క్లిక్' పై దాడులు జరిగాయని అన్నారు. ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ఒక్కటే ఆధారం కాదు. పత్రికా స్వేచ్ఛ కూడా ముఖ్యమేనని అన్నారు. కోల్‌కతాలోని ప్రమోద్ దాస్‌గుప్త భవన్‌లో జరిగిన ' ఈ కార్యక్రమానికి బిమన్ బసు అధ్యక్షత వహించారు .సిపిఐఎం) రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం , ' గణశక్తి ' కార్యదర్శి షామిక్ లాహిరి మాట్లాడారు., "రాయిటర్స్ , ఎఎఫ్‌పి వంటి వార్తా సంస్థలు 85 శాతం వార్తలను అందిస్తాయి. వారు అమెరికా దాని మిత్రదేశాలకు వ్యతిరేకంగా ఏదీ నివేదించరు . గాజాలో సంఘర్షణకు ముగింపు పలకాలని డిమాండ్ చేస్తూ లేదా ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ చేసిన మార్చ్‌లు బ్లాక్ అయ్యాయి. లాహిరి మాట్లాడుతూ, " మేము తటస్థంగా లేము, కష్టపడి పనిచేసే ప్రజల పక్షపాతిగా మేమున్నాం" అని అన్నారు.

ఏకపక్షంగా కోర్టుకు పిలిచే విషయంలో అధికారులకు మినహాయింపు

● సుప్రీంకోర్టు మార్గదర్శకాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

న్యాయస్థానాలు అధికారులను కోర్టులకు పిలిపించడం, వస్త్రధారణపై వ్యాఖ్యలకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. అధికారులను కించపరిచేలా మాట్లాడడం, వారి వేషధారణపై వ్యాఖ్యలు చేసే విషయంలో జాగ్రత్తగా వ్యవహరిం చాలని న్యాయస్థానాలకు సుప్రీంకోర్టు సూచనలు చేసింది. ఈ మేరకు ప్రభుత్వాధికారులను కోర్టుల ముందు హాజరుకావాలంటూ జారీ చేసే సమన్ల విషయంలో 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' పేరిట కొన్ని మార్గదర్శకాలు సూచించింది. ఏకపక్షంగా కోర్టుకు పిలిపించే విషయంలో అధికారులకు మినహాయింపునివ్వాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మార్గదర్శకాలను దేశంలోని అన్ని హైకోర్టులు తప్పనిసరిగా అనుసరించాలని ఆదేశించింది. అధికారుల వస్త్రధారణపై వ్యాఖ్యలకు న్యాయమూర్తులు దూరంగా ఉండాలని, కోర్టు కార్యాలయంలో దుస్తుల కోడ్‌ను ఉల్లంఘిస్తే తప్ప అధికారుల వస్త్రధారణను కించపరిచేలా మాట్లాడొద్దని ధర్మాసనం నొక్కి చెప్పింది. గతేడాది ఇద్దరు సీనియర్ ప్రభుత్వ అధికారులు కోర్టుకు హాజరుకావాలంటూ అలహాబాద్ హైకోర్టు సమన్లు జారీ చేయడాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సవాలు చేసింది. ఈ మేరకు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు ఆదేశాలను సమర్థించింది. అయితే ప్రభుత్వాధికారులను తరచూ కోర్టులకు పిలిపిస్తే రాజ్యాంగం ప్రకారం అమలవుతున్న పథకాల అమలు విషయంలో ఇబ్బందులు తలెత్తుతాయని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ మేరకు బుధవారం ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు పేర్కొంది. అఫిడవిట్‌ల ద్వారా సమస్యలను పరిష్కరిస్తే ప్రభుత్వ అధికారులను కోర్టులకు పిలవాల్సిన అవసరం ఉండదని సూచన చేసింది. అయితే కేసు ప్రక్రియలో భాగంగా సాక్ష్యంగా అధికారుల వ్యక్తిగత హాజరు ఆవశ్యకతను కోర్టు గుర్తు చేసింది. కోర్టు దృష్టికి భిన్నంగా అధికారి ఆలోచించినంత మాత్రన సమన్లు జారీ చేయడం తగదని ధర్మాసనం స్పష్టం చేసింది.

త్రిస్సూర్‌లో ప్రధాని మోడీ రోడ్ షో

త్రిస్సూర్ : మహిళా సదస్సులో పాల్గొనేందుకు లక్ష్యద్వీప్ నుండి కేరళకు బుధవారం చేరుకున్న ప్రధాని నరేంద్ర మోడీ త్రిస్సూర్‌లో రోడ్ షో నిర్వహించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించినందుకు కృతజ్ఞతగా కేరళ బిజెపి శాఖ 'వుమెన్స్ పవర్ విత్ మోడీ' పేరుతో ఒక సదస్సును నిర్వహించింది. ఆ సదస్సు కు మోడీ హాజరయ్యారు. వాస్తవానికి ఇది మహిళా సదస్సు అయినప్పటికీ అనధికారికంగా బిజెపి ఎన్నికల ప్రచారాన్ని ఆరంభించినట్లు కనిపించింది. నటుడు, బిజెపి నేత సురేష్ గోపి, ప్రధాని మోడీ వెంట వాహనంలో వచ్చారు. రాబోయే ఎన్నికల్లో త్రిస్సూర్ నుండి సురేష్ గోపి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తారని భావిస్తున్నారు.

'మహువా' బహిష్కరణపై స్పందన తెలపండి

● లోక్‌సభ సెక్రటేరియట్‌కు సుప్రీం నోటీసు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ ఎంపి మహువా మొయిత్రాను లోక్‌సభ నుంచి బహిష్కరించడంపై స్పందన తెలపాలని లోక్‌సభ సెక్రటేరియట్‌కు అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. లోక్‌సభ నుంచి తనను బహిష్కరించడాన్ని సవాల్ చేస్తూ టిఎంసి నేత మహువా మొయిత్రా దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. బహిష్కరణపై లోక్‌సభ సెక్రటేరియట్ నుంచి ధర్మాసనం సమాధానం కోరింది. అయితే మొయిత్రాకు మధ్యంతర ఉపశమనం కల్పించేందుకు న్యాయమూర్తుల ధర్మాసనం నిరాకరించింది. 'మొదటి ప్రతివాది (లోక్‌సభ సెక్రటేరియట్) అఫిడవిట్‌ను రెండు వారాల్లో దాఖలు చేయాలి. ఆ తరువాత మూడు వారాల్లో తిరిగి రిజాయిండర్‌ను దాఖలు చేయండి. మార్చి 11 నుండి ప్రారంభమయ్యే వారంలో ఈ పిటిషన్‌ను జాబితా చేయండి' అని ధర్మాసనం ఆదేశించింది..

జైళ్లలో కుల వివక్ష

● కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జైళ్లలో కుల వివక్షపై స్పందన తెలపాలని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. రాష్ట్రాల్లోని జైలు మాన్యువల్‌లు ఖైదీల మధ్య కుల ఆధారిత వివక్షను ప్రోత్సహిస్తున్నాయని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌ను బుధవారం సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ లేవనెత్తిన ఈ సమస్య చాలా కీలకమైనదని ధర్మాసనం అంగీకరించింది. దానిని పరిష్కరించడంలో కోర్టుకు సహాయం చేయవలసిందిగా సొలిసిటర్ జనరల్ (ఎస్జి) తుషార్ మెహతాను కోరింది.'ఇది చాలా ముఖ్యమైన అంశంగా లేవనెత్తబడింది. ఈ కోర్టుకు సహాయం చేయవలసిందిగా మేము ఎస్‌జి మెహతాను అభ్యర్థిస్తున్నాము. అన్ని రాష్ట్ర మాన్యువల్‌లను పట్టికలో ఉంచబడిన చార్ట్‌లో ఉంచనివ్వండి' అని ధర్మాసనం ఆదేశించింది. ఎస్‌జి మెహతా కూడా ఈ పరిస్థితి 'ఆమోదించదగినది కాదు' అని అన్నారు. దీనిని పరిష్కరించడంలో ఉమ్మడి ప్రయత్నాల ఆవశ్యకత ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. జైలు బ్యారక్‌లలో కుల ఆధారిత వివక్ష కొనసాగుతోందని, మాన్యువల్ లేబర్ అసైన్‌మెంట్ల వరకు విస్తరించిందని, డీనోటిఫైడ్ తెగలు, అలవాటైన నేరస్తులుగా వర్గీకరించబడిన వారిని ప్రభావితం చేస్తుందని పేర్కొంటూ జర్నలిస్ట్ సుకన్య శాంత కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వివిధ రాష్ట్రాల జైలు మాన్యువల్స్‌లో ఉన్న వివక్షతో కూడిన నిబంధనలను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ఎస్ మురళీధర్ వాదనలు వినిపిస్తూ.. దళితులు ప్రత్యేక జైళ్లలో నిర్బంధించిన సందర్భాలు కూడా ఉన్నాయని, ఇతర కులాలకు చెందిన వ్యక్తులను వివిధ ప్రాంతాల్లో నిర్బంధించారని వివరించారు. 'ఇటువంటి కుల ఆధారిత వివక్ష జైలులో అడుగుపెట్టినప్పటి నుండి ఉంది' అని అన్నారు. ప్రాథమిక వాదనలు సంక్షిప్తంగా విన్న ధర్మాసనం, కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, ఒడిశా,ఝార్ఖండ్, కేరళ, తమిళనాడు, మహారాష్ట్రకు నోటీసులు జారీ చేసింది.

కర్ణిసేన చీఫ్ హత్య కేసు దర్యాప్తు..

● 31 ప్రాంతాల్లో సోదాలు

న్యూఢిల్లీ: కర్ణిసేన చీఫ్ సుఖ్‌దేవ్ సింగ్ గోగమేది హత్య కేసులో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతున్నది. ఈ హత్య కేసుతో సంబంధం కలిగి ఉన్న నిందితుల ఇళ్లలో ఎన్ఐఎ సోదాలు నిర్వహిస్తోంది. బుధవారం ఉదయం నుంచి హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల్లోని 31 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో ఇంకా సోదాలు కొనసాగుతున్నాయి. స్థానిక పోలీసులతో కలిసి పలు ఎన్ఐఎ బందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. ఈ హత్య కేసులో పేరు మోసిన గ్యాంగ్‌స్టర్‌ల ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు లభించడంతో కేంద్ర హెూంశాఖ ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను రాజస్థాన్ పోలీసుల నుంచి ఎన్ఐఎకు అప్పగించింది. కాగా, కర్ణిసేన చీఫ్ సుఖ్‌దేవ్ సింగ్ గత నెల 5న జైపూర్‌లోని తన నివాసంలో హత్యకు గురయ్యారు. ముగ్గురు షుటర్‌లు తుపాకులతో వచ్చి సుఖ్‌దేవ్‌ను కాల్చిచంపారు. ఈ హత్యలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన రోహిత్ గోదార అనే గ్యాంగ్‌స్టర్ హస్తం ఉన్నది. డిసెంబర్ 9న ఈ హత్యతో సంబంధం ఉన్న షుటర్‌లు రోహిత్ రాథోడ్, నితిన్ ఫౌజీలను చండీగఢ్‌లో అరెస్ట్ చేశారు. రోహిత్ గోదారా ఆదేశాల మేరకే తాము ఈ హత్య చేశామని నిందితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

62కి పెరిగిన జపాన్ భూకంప మృతులు

వజిమా : జపాన్ భూకంపంలో మృతుల సంఖ్య 62కి పెరిగింది. 300 మందికి పైగా గాయపడగా, వారిలో 20 మంది పరిస్థితి ఆందోళనకరంగా వుందని అధికారులు తెలిపారు. కాగా, శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు సహాయక సిబ్బంది శ్రమిస్తున్నారు. మరోవైపు బుధవారం భారీ వర్షాలు పడే అవకాశం వుందని, ఫలితంగా కొండచరియలు విరిగిపడే ప్రమాదం వుందని అధికారులు హెచ్చరించడంతో సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడుతోంది. తాజా భూకంపానికి ఇషికవా ప్రిఫెక్చర్, అందులోని నోటో ద్వీపకల్పం బాగా దెబ్బతిన్నాయి. వజిమా, సుజు నగరాల్లో అనేక వందల భవనాలు నేలమట్టమయ్యాయి. దాదాపు 32 వేల మంది నిర్వాసితులు ప్రభుత్వం కల్పించిన ఆశ్రయాల్లో తల దాచుకున్నారు. కాగా, సహాయక చర్యలను ముమ్మరం చేసినట్లు ప్రధాని కిషిదా తెలిపారు. కాలంతో పోటీ పడుతూ సహాయక సిబ్బంది బాధితుల ప్రాణాలను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

సిఎం జగన్‌తో షర్మిల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

భేటీలో కేవలం కుటుంబ విషయాలే చర్చించుకున్నట్లు తెలిసింది.

షర్మిల తర్వాత నేనూ కాంగ్రెస్‌లోకి : ఆళ్ల రామకృష్ణారెడ్డి

వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత తాను చేరుతున్నట్లు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుండి తాడేపల్లిలోని సిఎం నివాసానికి వైఎస్ షర్మిల కుటుంబంతోపాటు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కూడా చేరుకున్నారు. అయితే అక్కడి సెక్యూరిటీ సిబ్బంది ఆళ్ల రామకృష్ణారెడ్డిని గేట్ బయటే నిలిపేయడంతో ఆయన బయటే ఉండిపోయారు. ఈ సందర్భంగా ఆళ్ల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఏ బాధ్యతలు ఇచ్చినా, ఇవ్వకపోయినా రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పని హక్కుపై కేంద్రం దాడి

● ఉపాధి హామీకి ఎబిపిఎస్ అనుసంధానాన్ని ఉపసంహరించుకోవాలి
● కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త ఆందోళనలు
● ఎఐఎడబ్ల్యుయు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గ్రామీణ భారతదేశంలో పని హక్కుపై కేంద్ర ప్రభుత్వం దాడి చేయడాన్ని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) సెంట్రల్ వర్కింగ్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. అలాగే ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఎబిపిఎస్)కు అనుసంధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఎబిపిఎస్ విధించిన కారణంగా ఉపాధి హామీ కింద నమోదైన కోట్లాది మంది కార్మికుల పని హక్కును నిరాకరించడాన్ని వ్యతిరేకించింది. ఎబిపిఎస్ చర్యకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం ఎఐఎడబ్ల్యుయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ విజయరాఘవన్, బి వెంకట్ ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీ కింద పని చేసే హక్కుపై జరుగుతున్న దాడులను ఆపాలని కోరారు. 'ఎబిపిఎస్‌పై రాష్ట్ర ప్రభుత్వాలు డేటాబేస్‌ను నవీకరించడానికి గడువు 2023 డిసెంబర్ 31తో ముగిసింది. కేంద్ర ప్రభుత్వం తేదీని మరింత పొడిగించలేదు. కేంద్ర ప్రభుత్వం మొదట 2023 జనవరి 30న ఎబిపిఎస్‌ని విధించింది. ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కార్మిక సంఘాల నుండి ప్రతిఘటన వ్యక్తమైంది. అయినప్పటికీ ప్రభుత్వం తన నిర్ణయాలను కొనసాగించింది. ఏడాది పొడవునా పొడిగింపులు పొడిగించారు. అయితే కోట్లాది మంది కార్మికులు ఇప్పటికీ ఎబిపిఎస్‌కు అనర్హులుగా ఉన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ డేటా ప్రకారం, జాబ్‌కార్డులో 34.8 శాతం హోల్డర్లు ఇప్పటికీ ఈ చెల్లింపు పద్ధతికి అనర్హులుగా ఉన్నారు' అని తెలిపారు.

ఎబిపిఎస్‌కు అనర్హులుగా వ్యవసాయ కార్మికులు

'ఇన్‌యాక్టివ్ జాబ్ కార్డు హోల్డర్లను అనర్హులుగా కేంద్ర ప్రభుత్వం పరిగణిస్తోందని వివిధ మీడియా నివేదికలు సూచిస్తున్నాయి. ఉపాధి హామీ కింద నమోదైన 25.25 కోట్ల మంది వ్యవసాయ కార్మికుల్లో, కేవలం 14.35 కోట్ల మంది క్రియాశీల వ్యవసాయ కార్మికులుగా ఉన్నారు. అనర్హులను ప్రకటించడం పార్లమెంటు ఆమోదించిన ఉపాధి చట్టంలో పొందుపరిచిన కార్మికుల హక్కులకు విరుద్ధం. క్రియాశీల కార్మికులలో 12.7 శాతం మంది ఇప్పటికీ ఎబిపిఎస్‌కు అనర్హులుగా ఉన్నారు' అని పేర్కొన్నారు.

ఉపాధి హామీ ప్రాథమిక స్వభావానికి వ్యతిరేకంగా మోడీ సర్కార్

కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఎబిపిఎస్‌ను 100 శాతం సాధించాలని రాష్ట్రాలు ఒత్తిడి చేస్తున్నాయి. ఆధార్ చెల్లింపులకు అర్హత లేని కోట్లాది జాబ్ కార్డులను (7.6 కోట్ల మంది వ్యవసాయ కార్మికులు) రాష్ట్రాలు తొలగించాయని క్షేత్రస్థాయి నివేదికలు వెల్లడిస్తున్నాయి' అని తెలిపారు. 'జీవనోపాధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కోసం తీసుకొచ్చిన ఉపాధి హామీ ప్రాథమిక స్వభావానికి వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. ఉపాధి హామీ గ్రామీణ ప్రజానీకానికి చెందిన అత్యంత పేద, అణగారిన వర్గాలు మనుగడ సాగించేందుకు సహాయపడింది. అదే సమయంలో వ్యవసాయ కార్మికులు, గ్రామీణ కార్మికుల సాధారణ వేతనాలు క్షీణించకుండా నిరోధించబడ్డాయి. చాలా ప్రాంతాల్లో వేతనాలు స్థిరంగా ఉన్నాయి. నగదు పరంగా పెరుగుదల ఉంది' అని పేర్కొన్నారు.



వేతనాల్లో కోతలను నిరసిస్తూ బ్రిటన్‌వ్యాప్తంగా జూనియర్ డాక్టర్ల 144 గంటల సమ్మె

లండన్ : వేతనాల్లో కోతలను నిరసిస్తూ బ్రిటన్ వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు సమ్మెకు దిగారు. 144గంటల కార్యాచరణలో భాగంగా బుధవారం ఉదయం 7గంటల నుండి ఈ సమ్మె ఆరంభమైంది. ఎన్‌హెచ్‌ఎస్ చరిత్రలోనే సుదీర్ఘమైన ఈ సమ్మె జనవరి 9వ తేదీ మంగళవారం ఉదయం 7గంటలతో ముగుస్తుంది. శీతాకాలం ప్రారంభం కావడంతో వైరస్‌ల వ్యాప్తితో ఆరోగ్య సేవలపై ఒత్తిడి పెరగనున్న తరుణంలో సమ్మె ప్రారంభమైంది. ఇదిలావుండగా, తక్షణమే సమ్మెను విరమించి, చర్చలకు రావాల్సిందిగా ఆరోగ్య, సామాజిక సంక్షేమ విభాగం మంగళవారం బ్రిటీష్ మెడికల్ అసోసియేషన్ (బిఎంఎ)ను కోరింది. దానిపై బిఎంఎ జూనియర్ డాక్టర్ల కమిటీ సహ అధ్యక్షుడు డాక్టర్ రాబ్ లారెన్సన్, డాక్టర్ వివేక్ త్రివేదిలు స్పందిస్తూ ఈ చివరి నిముషంలోనైనా ప్రభుత్వం మంచి విశ్వసనీయమైన ఆఫర్‌తో ముందుకు రావాల్సిందని వ్యాఖ్యానించారు. 2008 నుండి జూనియర్ డాక్టర్ల వేతనాల్లో నాలుగవ వంతుకు పైగా కోత విధిస్తున్నారు. వేసవి కాలంలో, ఇంగ్లండ్‌వ్యాప్తంగా జూనియర్ డాక్టర్ల వేతనాలను ప్రభుత్వం సగటున 8.8శాతం పెంచింది. అయితే, ఈ పెంపు సరిపోదని, 2008-09 నుండి వేతనాల్లో నమోదవుతున్న కోతను ఆపి, పూర్తి స్థాయి వేతనాలను పునరుద్ధరించాల్సిందిగా వారు కోరుతున్నారు. హాస్పిటల్ కన్సల్టెంట్స్, స్పెషలిస్ట్స్ అసోసియేషన్ యూనియన్‌కి చెందిన జూనియర్ డాక్టర్లు కూడా తమ సహచరులతో కలిసి సమ్మెలో పాల్గొననున్నారు. గతేడాది ఆరోగ్య మంత్రిత్వ శాఖ హామీ ఇచ్చినట్లుగా మంచి ఆఫర్ వస్తుందనే ఆశతో శలవులను గడిపామని, కానీ దురదృష్టవశాత్తూ అలాంటిదేమీ జరగలేదని లారెన్సన్, త్రివేదిలు ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ సమయంలో కూడా చర్చలకు రావడానికి సుముఖంగానే వున్నామని చెప్పామని, అలాగే రాబోయే సమ్మె కాలంలోకూడా తాము చర్చలకు సిద్ధంగానే వున్నామని వారు స్పష్టం చేశారు. అనూహ్యమైన ఈ సమ్మె కార్యాచరణతో వేలాదిమంది రోగుల ఆరోగ్య సేవలు ఇబ్బందుల్లో పడతాయని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో సత్వరమే సమస్యను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

బీరుట్‌లో హమాస్ డిప్యూటీ నేత హత్య

● మధ్య ప్రాచ్యంలో విస్తరించనున్న ఘర్షణలు

బీరుట్ : లెబనాన్ రాజధాని బీరుట్‌లో హమాస్ డిప్యూటీ నేత సాలెహ్ అల్ అరౌరిని ఇజ్రాయిల్ మితవాద ప్రభుత్వం మంగళవారం హత్య చేసింది. దీంతో మధ్య ప్రాచ్యంలో యుద్ధం మరింత విస్తరించే ముప్పు పొంచి వుంది. ఈ చర్యతో గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులు మరిన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా సామ్రాజ్యవాదం, యురోపియన్ సామ్రాజ్యవాద మిత్రులు ఈ యుద్ధం కోసమే ఎదురు చూస్తున్నట్లుగా ఉంది. బీరుట్ శివార్లలోని దహియెలో ఒక అపార్ట్‌మెంట్ భవనంపై ఇతర సీనియర్ హమాస్ అధికారులతో రహస్యంగా సమావేశం జరుపుతుండగా అల్ అరౌరిని డ్రోన్ దాడిలో హతమార్చారు. ఈ దాడిలో మొత్తంగా ఏడుగురు మరణించారు. హమాస్ సాయుధ విభాగమైన ఖాసిం బ్రిగేడ్స్‌కి చెందిన ఇద్దరు కమాండర్లు కూడా చనిపోయిన వారిలో వున్నారు. కాగా ఈ చర్యతో గాజాలో మిగిలిన బందీల విడుదల కోసం ఇజ్రాయిల్‌తో జరిపే చర్చలు నిలిచిపోయాయని హమస్ నేత ప్రకటించారు. ఇజ్రాయిల్ ఈ దాడికి తమదే బాధ్యత అని అధికారికంగా ఇంతవరకు ఎవరూ ప్రకటించలేదు. అమెరికా రక్షణ శాఖకు చెందిన పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు ఈ విషయాన్ని ధృవీకరించారు. అల్ అరౌరిని లక్ష్యంగా చేసుకుని హత్య చేయడాన్ని లెబనాన్ తాత్కాలిక ప్రధాని నజీబ్ మికాటి తీవ్రంగా నిరసించారు. 'ఘర్షణల కొత్త దశ'లోకి లెబనాన్‌ను ఇజ్రాయిల్ లాగుతోందని విమర్శించారు. అల్ అరౌరి హత్య జరిగిన తీరు అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమే. యూదు ప్రభుత్వ నేరపూరితమైన తీరుకు ఇదొక తిరుగులేని ఉదాహరణ.

అంగన్‌వాడీల ఆందోళన పథం


విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావును అరెస్టు చేస్తున్న పోలీసులు


అనకాపల్లి నెహ్రూచౌక్ జంక్షన్ దిగ్బంధనం


అనంతపురం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


చిత్తూరు కలెక్టరేట్ ఎదుట నిరసన


ఏలూరులో ర్యాలీ


గుంటూరు కలెక్టరేట్ ఎదుట రహదారిపై పడుకొని నిరసన


కర్నూలు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించిన అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు


నంద్యాల కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


నెల్లూరు కలెక్టరేట్ ఎదుట పోలీసులను అడ్డుకుంటున్న అంగన్‌వాడీలు


ప్రకాశం జిల్లా ఒంగోలులో


అల్లూరి జిల్లా పాడేరులో కలెక్టరేట్ వద్ద బైటాయించిన అంగన్‌వాడీలు


పార్వతీపురం కలెక్టరేట్ వద్ద ...


డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ...


శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ...


రాజమహేంద్రవరం రూరల్‌లో కలెక్టరేట్ వద్ద బైటాయించిన అంగన్‌వాడీలు


విజయనగరం కలెక్టరేట్ ఎదుట...


పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ...


వైఎస్ఆర్ కలెక్టరేట్ ఎదుట నిరసన


డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కలెక్టరేట్ వద్ద



సైంధవ్ అలరిస్తుంది : వెంకటేష్

'సైంధవ్ నా కెరీర్‌లోనే ఒక బెస్ట్ ఫిల్మ్. మంచి ఎమోషన్,న్యూ ఏజ్ యాక్షన్‌లో ఉంటుంది. సంక్రాంతికి ఖచ్చితంగా ప్రేక్షకులను అలరిస్తుంది' అని హీరో వెంకటేష్ అన్నారు. ఈనెల 13న విడుదల కానున్న సైంధవ్ సినిమా ట్రైలర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 'సైంధవ్‌ను సంక్రాంతి రోజున విడుదల చేస్తున్నాం. ఎప్పటిలాగానే మీ అందరి ప్రేమ, అభిమానం, ప్రోత్సాహం కావాలి. 75వ సినిమాగా సైంధవ్ చేయటం అదృష్టంగా భావిస్తున్నా' అని వివరించారు. దర్శక నిర్మాతలు శైలేష్ కొలను, వెంకట్ బోయనపల్లి మాట్లాడుతూ సినిమాను ఆదరించాలని ప్రేక్షకులను కోరారు. బేబీ సారా డ్యాన్స్‌తో ఆకట్టుకుంది. శ్రద్ధా శ్రీనాథ్, నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, రుహానీ శర్మ, ఆండ్రియా జెరెమియా ఈ సినిమాలో నటించారు.



'టైసన్ నాయుడు'గా బెల్లంకొండ సాయి

సాగర్ కె చంద్ర దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్, ఫస్ట్ గ్లింప్స్‌ని బుధవారం విడుదల చేశారు. సాయి పుట్టినరోజు సందర్భంగా రిలీజ్‌చేసిన ఈ చిత్ర టైటిల్ 'టైసన్ నాయుడు'గా ఫిక్స్ చేశారు. 14 రీల్స్ నిర్మాణం వహిస్తోంది. భీమ్స్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా నిర్వహిస్తున్నారు.



ప్రణం దేవరాజ్ హీరోగా ...

సీనియర్ నటుడు దేవరాజ్ కొడుకు ప్రణం దేవరాజ్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోంది. ఇప్పటికే రెండు సినిమాలు చేసిన ప్రణం, తాజాగా శంకర్ దర్శకత్వంలో పి.హరికృష్ణ గౌడ్ నిర్మాణంలో మూడో చిత్రం చేస్తున్నారు. తెలుగు, కన్నడ భాషలలో ఏకకాలంలో తెరకెక్కనున్న ఈ చిత్రం బుధవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఆకాష్ పూరి క్లాప్ కొట్టగా, దేవరాజ్ కెమెరా స్విచాన్ చేశారు. తనికెళ్ళ భరణి మేకర్స్‌కి స్క్రిప్ట్ అందించి తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు శంకర్ మాట్లాడుతూ, 'ఇది విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో వుండే కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్. మొదటి షెడ్యూల్ జనవరి మూడో వారం నుంచి హైదరాబాద్, తర్వాత వైజాగ్ పరిసర ప్రాంతాల్లో నిర్విరామంగా జరుగుతుంది' అని చెప్పారు.

త్వరలో 'మిస్ పర్ఫెక్ట్' వెబ్ సిరీస్

లావణ్య త్రిపాఠి, అభిజీత్ దుద్దాల, అభిజ్ఞ ఉతలూరు కీలకపాత్రల్లో నటిస్తున్న వెబ్ సిరీస్ 'మిస్ పర్ఫెక్ట్'. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. ఫస్ట్‌లుక్‌ను బుధవారం చిత్ర నిర్మాతలు విడుదల చేశారు. ఈ వెబ్ సిరీస్ హాట్ స్టార్‌లో త్వరలో స్ట్రీమింగ్ కాబోతోందని సుప్రియ యార్లగడ్డ తెలిపారు. లావణ్య త్రిపాఠి 'న్యూ ఇయర్‌ను పర్ఫెక్ట్‌గా మొదలుపెట్టబోతున్నాం' అంటూ ట్వీట్ చేశారు.





హనుమాన్ నుంచి ఫోర్త్ సింగిల్ విడుదల

హీరో తేజ సజ్జ, హీరోయిన్‌గా అమృత అయ్యర్ నటిస్తున్న చిత్రం హనుమాన్. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె.నిరంజన్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చైతన్య సమర్పణలో ప్రొడ్యూసర్లుగా అస్రిన్‌రెడ్డి, వెంకట్‌కుమార్ జెట్టి, కుశాల్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. డైరెక్టర్‌గా ప్రశాంత్‌వర్మ పనిచేస్తున్నారు. నాల్గో సింగిల్‌గా 'శ్రీరామధూత'గా వర్ణించిన పాటను విడుదల చేశారు. ఈనెల 12న ఈ సినిమా విడుదల కానుంది.

పేస్‌కు బ్యాటర్ల కుదేల్..

- సిరాజ్ దెబ్బకు దక్షిణాఫ్రికా 55పరుగులకు ఆలౌట్
- భారత్ 156ఆలౌట్
- టీమిండియాకు 98పరుగుల ఆధిక్యత



కేప్‌టౌన్: రెండో, చివరి టెస్ట్‌లో హైదరాబాద్ పేసర్ మహ్మద్ సిరాజ్ నిప్పులు చెరిగే బంతులకు తోడు బుమ్రా, ముఖేశ్‌కుమార్ బౌలింగ్‌లో చెలరేగడంతో దక్షిణాఫ్రికా తొలిరోజు లంచ్ విరామానికే ఆలౌటయ్యింది. అనంతరం టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 156పరుగులకే ఆలౌట్ కావడంతో భారత్‌కు 98 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. పేసర్లకు స్వర్గధామమైన కేప్‌టౌన్‌లో తొలిరోజే 23 వికెట్లు నేలకూలాయి. తొలుత టీమిండియా పేసర్ల ధాటికి దక్షిణాఫ్రికా 23.2 ఓవర్లలో 55పరుగులకే ఆలౌటయ్యింది. దీంతో దక్షిణాఫ్రికా టెస్ట్ క్రికెట్ చరిత్రలో తొలిసారి స్వల్ప స్కోర్‌కు ఆలౌటైంది. అంతకుముందు 2016లో జోహన్నెస్‌బర్గ్‌లో ఇంగ్లండ్ చేతిలో 73పరుగులకు కుప్పకూలింది.

సిరాజ్ కెరీర్ బెస్ట్..

దక్షిణాఫ్రికాపై సిరాజ్ ఆరు వికెట్లు తీసి మూడో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనను నమోదు చేశాడు. అంతకుముందు 2022లో శార్దూల్ ఠాకూర్.. జోహన్నస్‌బర్గ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఏడు వికెట్లు పడగొట్టాడు. 2011లో హర్భజన్ సింగ్ కూడా.. కేప్‌టౌన్‌లో ఏడు వికెట్లు తీశాడు. మూడో స్థానంలో సిరాజ్ (15/6) ఉన్నాడు. ఈ క్రమంలో సిరాజ్.. కుంబ్లే (53/6), శ్రీనాథ్ (76/6)ల సరసన చేరాడు. కేప్‌టౌన్‌లో భారత బౌలర్లలో హర్భజన్ సింగ్ తర్వాత సిరాజ్‌దే రెండో అత్యుత్తమ ప్రదర్శన.

టెస్ట్ క్రికెట్‌లో తొలిసారి..

టెస్ట్ క్రికెట్ చరిత్రలో టీమిండియా ఓ చెత్త రికార్డును తన పేర లిఖించుకుంది. 153పరుగుల వద్ద ఆరు వికెట్లు కోల్పోయి ఈ రికార్డును మూటగట్టుకుంది. దక్షిణాఫ్రికాను తొలి ఇన్నింగ్స్‌లో 55పరుగులకు ఆలౌట్ చేసిన టీమిండియా.. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆడుతూ 153పరుగులకు 4వికెట్లు కోల్పోయి పటిష్టంగా కనబడింది. ఆ దశలో రబడా, ఎన్గిడి, బర్గర్ చెలరేగడంతో 153పరుగులకే ఆలౌటైంది. అలాగే భారత బ్యాటర్లు ఆరుగురు డకౌటయ్యారు. జైస్వాల్, శ్రేయస్, జడేజా, బుమ్రా, సిరాజ్, ప్రసిధ్ పరుగుల ఖాతా తెరవకుండానే పెవీలియన్‌కు చేరారు.

అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌ను కెప్టెన్ రోహిత్ శర్మ(39), కోహ్లి(46) ఆదుకున్నారు. శుభ్‌మన్(38) కూడా బ్యాటింగ్‌లో రాణించగా.. ఆరుగురు బ్యాటర్లు డకౌటయ్యారు. వీరు ముగ్గురు కలిపి 123పరుగులు చేయగా.. అదనంగా 24పరుగులు వచ్చాయి. కెఎల్ రాహుల్ (8) పరుగులు చేయగా.. మిగిలిన బ్యాటర్లందరూ డకౌట్లయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లు రబడా, ఎన్గిడి, బర్గర్ మూడేసి వికెట్లు పడగొట్టగా.. సిరాజ్ రనౌటయ్యాడు. దీంతో భారత్‌కు 98పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 3వికెట్ల నష్టానికి 62పరుగులు చేసింది. ముఖేశ్ కుమార్‌కు రెండు, బుమ్రాకు ఒక వికెట్ దక్కాయి. భారత్‌కు ఇంకా 36పరుగుల ఆధిక్యతలో ఉంది.

స్కోర్‌బోర్డు..

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి)జైస్వాల్ (బి)సిరాజ్ 2, ఎల్గర్ (బి)సిరాజ్ 4, జోర్జి (సి)రాహుల్ (బి)సిరాజ్ 2, స్టబ్స్ (సి)రోహిత్ (బి)బుమ్రా 3, బెడింగ్హామ్ (సి)జైస్వాల్ (బి)సిరాజ్ 12, వెర్రెయనె (సి)శుభ్‌మన్ (బి)సిరాజ్ 15, జెన్సన్ (సి)రాహుల్ (బి)సిరాజ్ 0, మహరాజ్ (సి)బుమ్రా (బి)ముఖేశ్ కుమార్ 3, రబడా (సి)శ్రేయస్ (బి)ముఖేశ్ కుమార్ 5, బర్గర్ (సి)జైస్వాల్ (బి)బుమ్రా 4, ఎన్గిడి (నాటౌట్) 0, అదనం 5. (23.2 ఓవర్లలో ఆలౌట్) 55పరుగులు. వికెట్ల పతనం: 1/5, 2/8, 3/11, 4/15, 5/34, 6/34, 7/45, 8/46, 9/55, 10/55 **బౌలింగ్:** బుమ్రా 8-1-25-2, సిరాజ్ 9-3-15-6, ప్రసిధ్ 4-1-10-0, ముఖేశ్ కుమార్ 2.2-2-0-2.

ఇండియా తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి)రబడా 0, రోహిత్ (సి)జెన్సన్ (బి)బర్గర్ 39, శుభ్‌మన్ (సి)జెన్సన్ (బి)బర్గర్ 38, కోహ్లి (సి)మార్‌క్రమ్ (బి)రబడా 46, శ్రేయస్ (సి)వెర్రెయనె (బి)బర్గర్ 0, కెఎల్ రాహుల్ (సి)వెర్రెయనె (బి)ఎన్గిడి 8, జడేజా (సి)జెమీసన్ (బి)ఎన్గిడి 0, బుమ్రా (సి)జెన్సన్ (బి)ఎన్గిడి 0, సిరాజ్ (రనౌట్) బర్గర్ 0, ప్రసిధ్ (సి)మార్‌క్రమ్ (బి)రబడా 0, ముఖేశ్ కుమార్ (నాటౌట్) 0, అదనం 24. (34.5ఓవర్లలో ఆలౌట్) 153పరుగులు. **వికెట్ల పతనం:** 1/17, 2/72, 3/105, 4/110, 5/110, 5/153, 6/153, 7/153, 8/153, 9/153, 10/153 **బౌలింగ్:** రబడా 11.5-2-38-3, ఎన్గిడి 6-1-39-3, బర్గర్ 8-2-42-3, జెన్సన్ 9-2-29-0

ఐసిసి 2023 టి20 అవార్డు రేసులో జైస్వాల్, సూర్యకుమార్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) పురుషుల టి20 క్రికెట్ ఆఫ్ ది ఇయర్-2023 అవార్డు రేసులో సూర్యకుమార్ యాదవ్, యశస్వి జైస్వాల్ నిలిచారు. సూర్యకుమార్‌తోపాటు మరో నలుగురు టి20 క్రికెట్ ఆఫ్ ది ఇయర్ రేసులో ఉండగా.. ఐసిసి ఎమర్జింగ్ పురుషుల క్రికెట్ ఆఫ్ ది ఇయర్-2023కు జైస్వాల్ నామినేట్ అయ్యాడు. 2023లో 33ఏళ్ల సూర్యకుమార్ యాదవ్ గత ఏడాది 17 టి20ల్లో 48.86సగటు, 155.95స్ట్రైక్‌రేట్‌తో 733పరుగులు చేశాయి. అలాగే రెండో వేగవంతమైన సెంచరీ పూర్తి చేసి 2017లో శ్రీలంకపై కేవలం 35బంతుల్లో సెంచరీ కొట్టిన రికార్డుకు రోహిత్ శర్మ రికార్డుకు చేరువయ్యాడు. సికిందర్ రాజా(జింబాబ్వే), ఉల్ఫేష్ రంజానీ(ఉగాండా), మార్క్ ఛాప్మన్(న్యూజిలాండ్) టి20 అవార్డు రేసులో ఉన్న మిగిలిన క్రికెటర్లు. ఇక ఎమర్జింగ్ క్రికెట్ ఆఫ్ ది ఇయర్ రేసులో ఉన్న యశస్వి జైస్వాల్‌తోపాటు రచిన్ రవీంద్ర(న్యూజిలాండ్), జెరాల్డ్ కోయెట్జీ(దక్షిణాఫ్రికా), దిల్షాన్ మధుశంక(శ్రీలంక) అవార్డు రేసులో ఉన్నారు. మహిళల విభాగంలో చమరి ఆటపట్టు(శ్రీలంక), సోఫీ ఎక్లేస్టోన్(ఇంగ్లండ్), హేలీ మాథ్యూస్(వెస్టిండీ)తోపాటు 2017, 2019లో ఐసిసి మహిళా క్రికెట్ ఆఫ్ ది ఆయర్ అవార్డు విజేత టైటిల్ నెగ్గిన ఎల్లీస్ ఫెర్రీ(ఆస్ట్రేలియా) ఉన్నారు. ఇక ఎమర్జింగ్ ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు మారుఫా అక్తర్(బంగ్లాదేశ్), లారెన్ బెల్(ఇంగ్లండ్), డార్సీ కార్టర్(స్కాట్లాండ్), ఫోబ్ లిచ్‌ఫీల్డ్(ఆస్ట్రేలియా) ఎంపికయ్యారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68